# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 2 - సంచిక 5 ఫిబ్రవరి 2024 వెల : రూ.15

బీజేపీ 'ఎన్నికల బాండ్ల చట్టం' చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు

కేంద్ర బడ్జెట్ - తిరగబడిన తర్కం

బలుపు పార్టీలకే ఎలక్టోరల్ బాండ్లు

నరేంద్రమోదీ నిర్దేశిస్తున్న రాజనీతి

అటు ఆ రాముడూ ఇటు ఆత్మారాముడు

దైవ ఉన్మాదం కాదు.. ప్రజాస్వామ్య పరివ్యాప్తి జరగాలి

ఇటు లౌకిక వేదికలు.. అటు బీజేపీ పాచికలు

బీజేపీ నిజానికి ఒక హిందూ వ్యతిరేక పార్టీ

ఫ్రెంచ్ పాత్రికేయురాలి కన్నీటి నిష్క్రమణ

భారతదేశంలో తత్వశాస్త్ర పరిణామం

హనుమద్విజయము పుస్తకానికి త్రిపురనేని ముందుమాట

తెలుగు సాహిత్యంలో తొలి మానవవాది 'కవిరాజు'

ఆశను వాగ్దానం చేస్తున్న స్త్రీలు

ఇవీ మన మూలాలు!

ఊపిరి బిగపట్టి చదవాల్సిన పుస్తకం ఉరి వార్డు నుండి

లెనిన్ ఐక్య సంఘటన ఎత్తుగడలు సమకాలీన విప్లవోద్యమాలు

ఫిబ్రవరి - 2024

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 2 - సంచిక : 5


డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

ఈ సంచికలో..

1) బీజేపీ 'ఎన్నికల బాండ్ల చట్టం' చెల్లదని సుప్రీం కోర్టు తీర్పు - సంపాదకీయం 3
2) కేంద్ర బడ్జెట్ - తిరగబడిన తర్కం - ప్రభాత్ పట్నాయక్ 4
3) బలుపు పార్టీలకే ఎలక్టోరల్ బాండ్లు - రాఘవ శర్మ 6
4) నరేంద్రమోదీ నిర్దేశిస్తున్న రాజనీతి - ఎ.కృష్ణారావు 8
5) అటు ఆ రాముడూ ఇటు ఆత్మారాముడు - కె.శ్రీనివాస్ 10
6) దైవ ఉన్మాదం కాదు.. ప్రజాస్వామ్య పరివ్యాప్తి జరగాలి - అశోక్ కుంబము 12
7) ఇటు లౌకిక వేదికలు.. అటు బీజేపీ పాచికలు - తెలకపల్లి రవి 14
8) బీజేపీ నిజానికి ఒక హిందూ వ్యతిరేక పార్టీ - బండ్ల శ్రీనివాస్, నెల్లూరు నరసింహారావు, నలమాటి లక్ష్మణరావు 16
9) ఫ్రెంచ్ పాత్రికేయురాలి కన్నీటి నిష్క్రమణ - వనెసా డౌనక్ 19
10) భారతదేశంలో తత్వశాస్త్ర పరిణామం - టి.రవిచంద్ 21
11) హనుమద్విజయము పుస్తకానికి త్రిపురనేని ముందుమాట 25
12) తెలుగు సాహిత్యంలో తొలి మానవవాది 'కవిరాజు' - డాక్టర్ దేవరాజు మహారాజు 26
13) ఆశను వాగ్దానం చేస్తున్న స్త్రీలు - కాత్యాయనీ విద్మహే 28
14) ఇవీ మన మూలాలు! - వి.విజయకుమార్ 33
15) ఊపిరి బిగపట్టి చదవాల్సిన పుస్తకం ఉరి వార్డు నుండి.. - వివిపు బాలసుబ్రహ్మణ్యం 35
16) లెనిన్ ఐక్య సంఘటన ఎత్తుగడలు.. సమకాలీన విప్లవోద్యమాలు - కొండూరి వీరయ్య 37
17) కొత్త పుస్తకాలు స్వీకారం 42, 44 - 18) కార్టూన్స్ 43




కార్టూన్ : సతీష్ ఆచార్య

దారి దీపం
మాసపత్రిక
మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**

సంపాదకీయం



## బీజేపీ 'ఎన్నికల బాండ్ల చట్టం' చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు

2018లో బీజేపీ తెచ్చిన ఎన్నికల బాండ్ల చట్టం చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ చట్టం ద్వారా కంపెనీల చట్టం, ఆదాయ పన్ను చట్టం ప్రజా ప్రాతినిధ్య చట్టాలకు చేసిన మార్పులు కూడా చెల్లవని తీర్పులో స్పష్టం చేసింది. 2018 నుంచి ఈ ఎన్నికల బాండ్ల చట్టం బీజేపీకి విరాళాల వెల్లువను సాధించి పెట్టింది. ఇప్పటికి 13 వేల కోట్ల రూపాయల ఎన్నికల బాండ్లు అమ్ముడుపోతే అందులో 57 శాతం బీజేపీ చేజిక్కించుకుంది. ప్రధాన ప్రత్యర్థిగా వున్న కాంగ్రెస్‌కు కేవలం పది శాతం మాత్రమే నిధులు దక్కాయి. మిగిలిన అన్ని జాతీయ, రాష్ట్ర పార్టీలకు 37 శాతం నిధులు పంపిణీ అయ్యాయి.

గతంలో ఎన్నికల విరాళాల మీద రకరకాల ఆంక్షలు ఉండేవి. 20 వేల రూపాయలకు పైబడి ఎవరైనా విరాళం ఇస్తే వారి పేరును ఆ పార్టీ విధిగా ఎన్నికల కమిషన్‌కు తెలపాలి. ఎన్నికల కమిషన్ ఆ వివరాలను బహిరంగంగా ప్రకటించేది. ఇచ్చిన వారు తమ ఆదాయ పన్ను చెల్లింపు పత్రంలో దీనిని నమోదు చేసుకుని రాయితీ పొందేవారు. వరుసగా మూడు సంవత్సరాలు లాభాలు పొందిన కంపెనీలు మాత్రమే విరాళాలు ఇవ్వడానికి అర్హులవుతారు. వారు కూడా చివరిసారి వచ్చిన లాభంలో ఐదు శాతం మించి విరాళాలు ఇచ్చే వీలులేదు. అలాగే విదేశాలలోని భారతీయులు మాత్రమే విరాళాలు ఇవ్వాలి. ఇతరత్రా వసూలు చేసిన విరాళాలు పంపకూడదు.

ఈ ఆంక్షలన్నింటిని బీజేపీ ఎన్నికల బాండ్ల చట్టం తొలగించింది. ఇప్పుడు స్టేట్ బ్యాంకు ప్రతి మూడు నెలలకు ఒకసారి వెయ్యి రూపాయల నుంచి కోటి రూపాయల వరకు వున్న వివిధ బాండ్ల కొనుగోలుకు నిర్దిష్ట గడువులో వీలు కలిగిస్తుంది. ఎవరైనా కొనచ్చు. ఎంతైనా కొనచ్చు. ఏ పార్టీకైనా ఆ బాండ్లను సమర్పించవచ్చు. ఇచ్చిన వారి పేర్లు వెల్లడించే ఏర్పాటు లేదు. విరాళాలు పొందిన పార్టీలు ఈ బాండ్ల ద్వారా పొందిన మొత్తాన్ని తన జమాఖర్చుల జాబితాలో సమర్పిస్తే చాలు. ఇది అధికారంలోవున్న పార్టీకి అపరిమితమైన విరాళాలు పొందడానికి ఈ చట్టం ఒక రాజమార్గం అయ్యింది.

మన రాజ్యాంగంలో పౌరులకు తెలుసుకునే హక్కు వుందని ఎన్నికలు స్వేచ్ఛగా, సమన్యాయంతో నిర్వహించాలని ప్రకటించింది. ఈ చట్టం ఈ మౌలిక అంశాలకు విరుద్ధంగా వుందని దీనిని కొట్టి వేస్తూ తీర్పునిచ్చింది. పైగా అధికారంలో వున్న వారు నీకిది నాకిది అని బేరసారాలు చేసుకోవడానికి అక్రమ మార్గంగా వినియోగపడుతుందని కోర్టు అభిప్రాయపడింది. ఈ తీర్పు తక్షణ ప్రభావం బీజేపీ మీద అంతగా పడదు. అది ఆర్థికంగా అన్ని పార్టీల కంటే ఎంతో బలంతో ముందు వుంది. పోతే నిరంతరం నీతి సూక్తులు వల్లించే మోదీ ప్రభుత్వానికి నైతికంగా ఈ తీర్పు ఎదురుదెబ్బ అవుతుంది. మన ఎన్నికల వ్యవస్థ పూర్తిగా డబ్బు చుట్టూ, అధికార కాంక్ష చుట్టూ తిరిగే కుబేరుల ఆటగా మారింది. ఈ ఆటలో కుబేరులకు మాత్రమే స్థానం వుంది. అవి పోటీ చేస్తే వ్యక్తులైనా, పార్టీలైనా. ఎన్నికలు డబ్బు చుట్టూ తిరుగుతున్నా .అంతిమ నిర్ణేత డబ్బు కాదు ప్రజలు మాత్రమే. ఎన్నికల్లో డబ్బు ఎవరు ఎంత విచ్చలవిడిగా ఖర్చు పెట్టినా ప్రజలు మాత్రం ప్రభుత్వాలను మారుస్తూనే వున్నారు. అందువల్ల ఈ కుబేరుల ఎన్నికల ఆటను ప్రజలే మట్టిగరిపించాలి.

- డీవీవీఎస్ వర్మ
సంపాదకులు, 85006 78977

# కేంద్ర బడ్జెట్ - తిరగబడిన తర్కం



- ప్రభాత్ పట్నాయక్

**ఒకవేళ మోడీ కొట్టుకునే సెల్ఫ్ డబ్బాయే వాస్తవం అయితే బడ్జెట్ గతంలో చెప్పినదాన్నే మళ్ళీ చెప్పడం అన్నది ఆశ్చర్యం కలిగించదు. ఈ బడ్జెట్ నిరుద్యోగాన్ని మరింత పెంచుతుంది. శ్రామిక ప్రజలను మరింత దారిద్ర్యంలోకి నెడుతుంది. సమాజంలో ఇప్పటికే వికృతరూపం దాల్చుతున్న ఆర్థిక అసమానతలను మరింత పెంచుతుంది. కాని ఈ వాస్తవాలను ప్రభుత్వం ఒప్పుకోదు. మీడియాలో ఉన్న భజంత్రీలూ ఒప్పుకోరు. ఎందుకంటే, వారి నాయకుడు అటువంటి సమస్యలేవీ లేనేలేవని ప్రకటించారు కదా !**

మోడీ ఏం చెప్తే అదే సత్యం అన్నది బీజేపీ విధానం. ఒకవేళ మోడీ చెప్పినది తప్పు అని నిర్ధారించే ఆధారాలు ఏమైనా ఉంటే అటువంటివి తప్పుడు ఆధారాలై వుండాలి. కనుక వాటిని కప్పిపుచ్చాలి. తన పదేండ్ల పాలనలో ఉన్నంత గొప్పగా భారత దేశం గతంలో ఏనాడూ లేదని మోడీ చెప్తున్నారు. కాని అధికారిక గణాంకాలు దానికి భిన్నంగా ఉన్నాయి. కాబట్టి ఆ గణాంకాలు తప్పు అని, అసలు గణాంకాలను సేకరించే విధానాన్నే మార్చాలని బీజేపీ అంటోంది. మూడవ ప్రపంచ దేశాల్లోకెల్లా పేరు గాంచిన గణాంక వ్యవస్థ మనది. పి.సి. మహల్‌నోబిస్ రూపొందిన జాతీయ శాంపిల్ సర్వే విధానం మనకుంది. ఎంతో కృషి చేసి శ్రద్ధతో రూపొందించిన గణాంక వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం ధ్వంసం చేస్తోంది. 2011-12తో పోల్చినప్పుడు 2017-18లో గ్రామీణ ప్రజల తలసరి వినియోగం అన్ని విధాలా తీవ్రంగా పడిపోయిందని శాంపిల్ సర్వే వెల్లడించింది. అందుకు ఏకంగా ఆ సర్వే ఫలితాలను తొక్కిపెట్టారు. మనకి స్వాతంత్ర్యం రాక ముందు నుంచి దేశంలో జనాభా లెక్కల సేకరణ ప్రతీ పదేళ్ళకోమారు జరుగుతోంది. మోడీ చెప్పేవన్నీ వట్టి డాబులేనని ఆ జనాభా లెక్కలు ఎక్కడ బయట పెట్టేస్తాయో అన్న భయంతో ఆ జనాభా లెక్కల ప్రక్రియనే నిలిపివేశారు. నిరుద్యోగాన్ని లెక్కించేటప్పుడు వేతనం లేని పనిని నిరుద్యోగంగానే పరిగణించాలని ఐఎల్‌వో ప్రకటించింది. దానిని అనుసరిస్తే దేశంలో నిరుద్యోగం ఎంత తీవ్రస్థాయిలో ఉందో బయటపడుతుంది. అందుచేత ఐఎల్‌వో విధానాన్ని పక్కన పెట్టేశారు.

వాస్తవానికి వేతనం లేని పని మాత్రమే కాదు. వేతనం చెల్లించే పనుల్లోను అన్ని రకాల పనులనూ ఉపాధిగా లెక్కించకూడదు. 1930 దశకంలో మహా మాంద్యం నెలకొన్న కాలంలో బ్రిటన్‌లో చాలా మంది నిరుద్యోగులు రోడ్ల పక్కన బూట్లు పాలిష్ చేయడానికి తయారయ్యారు. వారేమీ ఆ పనిని ఉచితంగా చేయలేదు. కాని, అలాంటి వారినందరినీ ఉద్యోగులుగా లెక్కిస్తే నిరుద్యోగం అంత సంక్షోభ కాలంలో కూడా చాలా తక్కువ స్థాయిలో ఉన్నట్టే నిర్ధారణ వస్తుంది. ఇటువంటి తరహాను "ప్రచ్ఛన్న నిరుద్యోగులు"గా పరిగణించారు. అయితే ఆనాటి సమాజం సంక్షోభాన్ని తీవ్రమైన విషయంగా పరిగణించింది. బాధాకరమైనది ఏమంటే ప్రస్తుతం దేశంలో పాలకులు సంక్షోభాన్ని కూడా తీవ్రమైన విషయంగా పరిగణించడం లేదు.

ఫిబ్రవరి 1న పార్లమెంటులో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ఈ సంగతిని స్పష్టం చేసింది. ఆర్థిక మంత్రి ప్రసంగాన్ని చూద్దాం. సగటు నిజ ఆదాయాలు 50 శాతం పెరిగాయని ఆమె ప్రకటించారు. బహుశా గత దశాబ్దంతో పోల్చి ఆమె చెప్పి వుండాలి. కాని ఆమె చెప్పినది తలసరి ఆదాయం గురించి. అంతే తప్ప దేశంలో అత్యధిక సంఖ్యాకుల ఆదాయాల గురించి మాత్రం కాదు. జాతీయ సగటు ఆదాయం పెరిగింది కాబట్టి దేశంలో అందరి ఆదాయాలూ పెరిగినట్టే అని, దేశ ఆర్థిక పరిస్థితి చాలా బాగుందని ఆమె చెప్పుకోవడంలో మేధోపరమైన నిజాయితీ లోపించింది.

2011-12, 2017-18 ఏండ్ల మధ్యకాలంలో దేశంలో పౌష్టికాహార లేమి పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ భారతంలో రోజుకు కనీసం 2200 కేలరీల శక్తినిచ్చే ఆహారాన్ని పొందలేని జనాభా (గ్రామీణ ప్రాంతంలో పేదరికాన్ని నిర్ధారించేందుకు ప్రణాళికా సంఘం నిర్ధారించిన ప్రమాణాల ప్రకారం) 68 నుండి 80 శాతానికి పెరిగింది. మరి ఈ కాలంలో దేశంలో అత్యధికుల ఆదాయాలు మెరుగుపడ్డాయని ఏ ప్రాతిపదికన చెప్తున్నారు ? ఈ కాలంలో దేశంలో ఏం జరిగిందనేది ఇక్కడ పరిశీలించడం ముఖ్యం. ప్రజలు చేసే వినిమయాన్ని అంచనా వేయడానికి గతంలో జాతీయ శాంపిల్ సర్వే ఐదేళ్ళకోమారు గణాంకాలు సేకరించేది. ఇప్పుడు దానికి స్వస్తి చెప్పారు. కాని కొన్ని ఇతర గణాంకాల ఆధారంగా మనం కొన్ని నిర్ధారణలకు రావచ్చు. వాటిలో ఒకటి గ్రామీణ ప్రాంతాల్లో వాస్తవ ఆదాయాలకు సంబంధించి గత ఐదేండ్ల డేటా. వ్యవసాయ పనుల్లో గాని, వ్యవసాయేతర పనుల్లో గాని ఉన్న వారి నిజ ఆదాయాలు గత ఐదేండ్లలోనూ పడిపోయాయి. పట్టణ ప్రాంతాల్లో

సైతం అదే పరిస్థితి ఉండే అవకాశాలున్నాయి. ఆయా నిర్ణీత వ్యవ ధుల్లో నిర్వహించే శ్రామిక సర్వే (పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే) తాజా వివరాల ప్రకారం దేశం మొత్తం మీద, అటు పట్టణాల్లో గాని, ఇటు గ్రామాల్లోగాని సగటు నెలవారీ ఆదాయాలు 2017- 18కి, 2022-23కి మధ్య 20 శాతానికి పైగా పడిపోయాయి! అంటే 2017-18 తర్వాత నిజ ఆదాయాలు పడిపోతున్నాయనేది నిస్సందేహం.

స్వాతంత్ర్యం వచ్చినది మొదలు ఎన్నడూ లేనంత తీవ్ర స్థాయిలో నేడు నిరుద్యోగం ఉంది. సీఎంఐఈ (సెంటర్ ఫర్ మోనిటరింగ్ ది ఇండియన్ ఎకానమీ) ప్రకారం దేశంలో ఉన్న ఉద్యోగాల సంఖ్యలో గత ఐదేళ్లలో నికరమైన పెరుగుదల ఏమీ లేదు. ఒకపక్క నిజ వేతనాలు పడిపోతూ, మరొకపక్క ఉద్యోగాల సంఖ్యలో పెరుగుదల లేకపోవడం చూస్తే శ్రామికులుగా పని చేస్తున్న వారి తలసరి నిజ ఆదాయాలు పడిపోతున్నట్టు స్పష్టమవుతోంది. శ్రామికుల ఆదాయాలు తరిగిపోతున్నప్పుడు రైతులు, కూలీల ఆదాయాలు వేరే దిశలో ఎలా ఉంటాయి ? రైతుల ఆదాయాలు పెరిగితేనే డిమాండ్ పెరుగుతుంది. అప్పుడు అదనంగా కార్మికులు అవసరం అవుతారు. దాని వలన ఉపాధి అవకాశాలు బాగా పెరుగుతాయి. పైగా కార్మికుల నిజ వేతనాలు పెరుగుతాయి. ఇప్పుడు కార్మికుల నిజ వేతనాలు పడిపోతున్నాయంటే దానిని బట్టి రైతుల, కూలీల ఆదాయాలు కూడా పడిపోతున్నాయని – అంటే మొత్తం శ్రామిక ప్రజలందరి ఆదాయాలూ (వ్యవసాయ, వ్యవసాయేతర కూలీలు, రైతులు, చిన్న ఉత్పత్తిదారులు) గత ఐదేండ్లలో పడిపోయాయని నిర్ధారణ అవుతోంది. దేశ జనాభాలో ఈ శ్రామిక ప్రజలే అత్యధిక భాగం. అంటే దేశ జనాభాలో అత్యధిక భాగం గత ఐదేళ్ల కాలంలో దిగజారిన జీవన పరిస్థితులను అనుభవిస్తున్నారన్నది తిరుగులేని సత్యం. 2011-12 నుంచి 2017-18 మధ్య కాలంలో వీరి వినిమయం బాగా పడిపోయిందని ధృవపరిచే గణాంకాలను దీనికితోడు చేస్తే శ్రామిక ప్రజల దుర్భర జీవితాలు మనకి దర్శనమిస్తాయి. ఈ కారణంగానే మోడీ హయాంలో ప్రైవేటు పెట్టుబడులు ఎదుగుదల లేకుండా స్తంభించిపోయాయి. బడా పెట్టుబడిదారులకు, అందునా ఎంపిక చేసిన కొద్ది మంది క్రోనీ పెట్టుబడిదారులకు బీజేపీ ప్రభుత్వం ఎంత కొమ్ముగాసినా, ఇదే పరిస్థితి. ఇక ప్రైవేటు చిన్న పెట్టుబడిదారుల పెట్టుబడులూ స్తంభించిపోయాయి. లేదా తరిగిపోయాయి. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలు, నిరంకుశమైన లాక్‌డౌన్‌లతో ఈ రంగం నడుము విరిగిపోయింది. కార్పొరేట్ సంస్థల లాభాలలో పెరుగుదల ఉన్నా, వారి పెట్టుబడులలో మాత్రం స్తంభనే కొనసాగుతోంది. తనకు వచ్చిన లాభాలను బట్టి కాకుండా, మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి పెట్టుబడులు పెట్టడం జరుగుతుందన్నది వాస్తవం.

అయితే పెట్టుబడుల వ్యయం ఏటికేడూ పెరుగుతోందని ప్రభుత్వం వాదించవచ్చు. తన బడ్జెట్ ప్రసంగంలోనూ ఆర్థిక మంత్రి ఇదే వాదన చేశారు. ఇలా పెరగడం వల్ల ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రైవేటు పెట్టుబడిదారులకు కావలసిన మార్కెట్ విస్తరణ జరుగుతుందని, అప్పుడు వారి నుంచి పెట్టుబడులు పెరుగుతాయని ఆ వాదన అంటుంది. అయితే ఇక్కడ జరిగిందేమంటే ప్రభుత్వం వైపు నుండి పెరిగిన పెట్టుబడుల వ్యయం ప్రభావం దేశీయ మార్కెట్‌లోకన్నా అంతర్జాతీయ మార్కెట్‌లో ఎక్కువగా వ్యక్తమవుతోంది. అందుచేత దేశీయ మార్కెట్‌లో పెట్టుబడుల పెరుగుదల లేదు. ఇక ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహంలోని మరో భాగం ప్రభుత్వరంగ బ్యాంకుల ద్వారా ప్రైవేటు పెట్టుబడిదారులకు భారీగా రుణాలివ్వడం. ఇలా రుణాలు పొందిన వారిలో క్రోనీ పెట్టుబడిదారులు కూడా ఉన్నారు. "మౌలిక వసతుల కల్పన రంగం"లో పెట్టుబడులు పెట్టడానికి వారికి ఈ రుణాలు ఇస్తున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. దీని పర్యవసానంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల దగ్గర పాత బకాయిలు పెద్ద మొత్తాల్లో పేరుకుపోయాయి. అంటే ప్రైవేటు పెట్టుబడిదారులు తీసుకోవలసిన రిస్క్‌ను ప్రభుత్వ రంగ బ్యాంకులు తీసుకోవలసి వస్తోందన్నమాట. ఇలా రిస్క్ తీసుకున్నా, ఆ పెట్టుబడులలో అధిక భాగం విదేశీ మార్కెట్‌లోని డిమాండ్‌ను పెంచడానికే దోహదపడుతోంది.

మోడీ ప్రవచించిన "సత్యం" కారణంగా ఈ బడ్జెట్ ఎందుకూ కొరగాకుండా పోయింది. అలాగాక, ఏ దేశమైనా ప్రజల వాస్తవ పరిస్థితులను గనుక బడ్జెట్ పరిగణనలోకి తీసుకుని వున్నట్లైతే అది ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుని వుండేది. నేరుగా ప్రజలకు నగదు బదిలీ చేయడం కాని, కనీస వేతనాల స్థాయిని పెంచి చట్టబద్ధంగా అమలు చేయడం కాని ప్రతి పాదించి వుండేది. ఈ రెండింటిలో రెండూ కాని, ఏ ఒక్కటి కాని చేసినా ప్రజలకు నేరుగా ప్రయోజనాలు లభి స్తాయి. అంతేగాక దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక ఊపు వచ్చి వుండేది. మార్కెట్ బలపడి, ప్రైవేటు పెట్టుబడులు పెరిగి, ఉపాధి అవకాశాలు పెరిగి వుండేవి.

కాని మన పాలకులకు అటువంటి విధానాలు నిషిద్ధం. నిజానికి దానికి పూర్తి వ్యతిరేక దిశలో నడుస్తున్నారు. ఆహారం, ఎరువులు, ఇంధనం మీద ఇచ్చే సబ్సిడీని రూ.4.13 లక్షల కోట్ల నుండి రూ.3.81 లక్షల కోట్లకు తగ్గించారు. ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు ఏ మాత్రం పెంచలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మాదిరిగానే రూ.86,000 కోట్లకే పరిమితం చేశారు. ఈ విధంగా చేయడం "ఆర్థిక విజ్ఞత"ను సూచిస్తోందని భజంత్రీ మీడియా మెచ్చుకుంది. ఇటువంటి

**మిగతా 11వ పేజీలో**

# బలుపు పార్టీలకే ఎలక్టోరల్ బాండ్స్




- రాఘవ శర్మ

ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. మోడీ ప్రభుత్వం 2018లో తీసుకొచ్చిన ఈ ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని సార్వత్రిక ఎన్నికల ముందు అత్యున్నత న్యాయస్థానం నిలిపివేయడం మోడీ ప్రభుత్వానికి ఆర్థికంగా, రాజకీయంగానే కాకుండా, నైతికంగా కూడా పెద్ద దెబ్బ. ఈ ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని నిలుపుదల చేయాలని, దీన్ని సవాలు చూస్తూ 2018లోనే అనేకమంది ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. కానీ, దీనిపైన స్టే విధించడానికి తిరస్కరించిన సుప్రీంకోర్టు గడిచిన జనవరిలో దీనిపైన విచారణ చేపట్టింది. ఈ ఆలస్యం వల్ల ఎలక్టోరల్ బాండ్ల రూపంలో ఇప్పటివరకు వందల కోట్ల విరాళాలు రాజకీయ పార్టీలకు చేరిపోయాయి.

**ఈ పథకం వల్ల ఎవరు లబ్ధి పొందారు ?**

సుప్రీంకోర్టు విచారణను ఆలస్యం చేయడం వల్ల ఎవరు లబ్ధి పొందారు ? అన్నది ప్రశ్న. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమాచారం మేరకు ఇప్పటి వరకు వివిధ రాజకీయ పార్టీలకు రూ.16,518.11 కోట్ల ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విరాళాలు అందాయి. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో వెచ్చించడానికి ఎల క్టోల్ ద్వారా కార్పొరేట్ సంస్థలు ఇచ్చే అంతులేని నిధులతో స్వేచ్ఛాయుతమైన ఎన్నికలు జరపడం ప్రాథమిక హక్కుకు భంగకరమని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేసింది. ఏ రాజకీయ పార్టీకి ఎవరు ఎంత మేరకు నిధులు ఇస్తున్నారనే సమాచారాన్ని రహస్యంగా ఉంచడం ద్వారా సమాచార హక్కు చట్టాన్ని, రాజ్యాంగంలోని 19(1)ఏను అతిక్రమించడమేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆధ్వర్యంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పు వెల్లడిం చింది. భారతదేశం వంటి ప్రజాస్వామిక దేశంలో సమాచారం తెలుసుకోవడంతోపాటు, రాజకీయ పార్టీలకు ఎక్కడి నుంచి నిధులు వస్తున్నాయనే సమాచారాన్ని తెలుసుకునే హక్కు ప్రజల కు ఉంటుందని స్పష్టం చేసింది. ఇది క్విడ్ ప్రోకోకు దారి తీస్తుం దని న్యాయమూర్తి హెచ్చరించారు. ఎలక్టోరల్ బాండ్లను విడుదల చేయడానికి 2017 ఆర్థిక బిల్లు ద్వారా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు కల్పించిన అధికారాన్ని వెంటనే నిలిపి వేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పటి వరకు అమ్మిన ఎలక్టోరల్ బాండ్లను ఏ పార్టీ కోసం ఎవరు, ఎంతెంత కొన్నవనే వివరాలను వెల్లడించాలని,




వాటిని మార్చి 31వ తేదీలోగా ఎన్నికల కమిషన్‌కు పంపాలని ఆదేశించింది.

ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని 2017లో తీసుకొచ్చిన ఆర్థిక బిల్లు ద్వారా ప్రవేశపెట్టారు. ప్రజాప్రాతినిధ్య చట్టం (ఆర్పీఏ) 1951, ఆదాయపన్ను చట్టం 1961, కంపెనీల చట్టం 2013, విదేశీ నిధుల క్రమబద్దీకరణ చట్టం 2010లకు సవరణలను తీసుకు రావడం ద్వారా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934లోని సెక్షన్ 31ను సవరించడం ద్వారా దీన్ని నోటిపై చేశారు. "ప్రామిసరి నోట్ల రూపంలో విడుదల చేసిన బాండ్లు ఎవరు, ఏ రాజకీయ పార్టీ కోసం కొన్నారనే విష యాన్ని బహిరంగ పరచరాదు" అని ఈ పథకంలో నిర్వచిం చారు. ఈ పథకం ప్రకారం వెయ్యి రూపాయలు, పది వేల రూపాయలు, లక్ష రూపాయలు, పది లక్షల రూపాయల విలువ గల బాండ్లను విడుదల చేశారు. ఈ ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగ వ్యతిరేకమైనదని, దాన్ని సవాలు చేస్తూ అనేక పిటీష న్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. ఈ పథకాన్ని సవాలు చేసిన వారిలో కాంగ్రెస్ నాయకుడు జయఠాకూర్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(మార్క్సిస్టు), అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ప్రముఖమైనవి. రాజ్యాంగంలోని 14, 19(1)ఏ, 21వ అధికరణాలు కల్పించిన ప్రాథమిక హక్కులకు ఉల్లంఘించడ మేనని ఈ ఫిర్యాదిదారులు సుప్రీంకోర్టులో పేర్కొన్నారు. ఈ పథకం ప్రజాస్వామ్య మూలాలలను తినేస్తుందని వాదించగా, 'ఎన్నికల్లో నల్ల ధనాన్ని, అవినీతి డబ్బును' నిర్మూలిస్తుందని ప్రభుత్వ వాదన. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 29సి. సెక్షన్ ప్రకా రం (రాజకీయ పార్టీలు స్వీకరించిన విరాళాల వెల్లడి), ఏ రాజకీ

య పార్టీ అయినా ఒక వ్యక్తి నుంచి ఇరవై వేల రూపాయలకు మించి విరాళంగా తీసుకున్నట్టయితే, ఆ విషయాన్ని ఎన్నికల కమిషన్‌కు తెలియచేయాలి. ప్రజాప్రాతినిధ్య చట్టానికి 2017 లో తెచ్చిన సవరణ ద్వారా ఎలక్టోరల్ బాండ్ల నుంచి తీసుకున్న వివరాలను వెల్లడించనవసరం లేదు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా నిధులు పొందాలంటే ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 296 ప్రకారం రిజిస్టరైన రాజకీయ పార్టీ అయి ఉండాలి. గడిచిన పార్లమెంటుకు కానీ, శాసనసభకు కానీ జరిగిన ఎన్నికల్లో కనీసం ఒక్క శాతానికి తక్కువ కాకుండా ఓట్లు పోలై ఉండాలి. వీళ్ళు మాత్రమే ఈ పథకానికి అర్హులవుతారు.

కంపెనీల చట్టం ప్రకారం రాజకీయ పార్టీలకు ఏదైన కార్పొరేట్ సంస్థ విరాళాలు ఇవ్వాలంటే, గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఆయా వ్యక్తులు కానీ, సంస్థలు కానీ పొందిన సగటు లాభాల్లో 7.5 శాతానికి మించకుండా ఇవ్వవచ్చు. రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాల నిషేధం, పరిమితులు తప్పనిసరిగా ఉండాలనే కంపెనీల చట్టంలోని 182 సెక్షన్ను ప్రజాప్రాతినిధ్య చట్టానికి 2017లో తెచ్చిన సవరణతో తొలగించారు. ఏ రాజకీయ పార్టీకి ఎంత విరాళం ఇచ్చేది వెల్లడించాలని చెప్పే ఈ చట్టంలోని 182(3) సెక్షన్ను కూడా సవరించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టానికి చేపట్టిన ఈ సవరణ తర్వాత ఏ రాజకీయ పార్టీకి ఎవరు విరాళం ఇచ్చారనే విషయాన్ని బహిరంగ పరచనవసరం లేదు. ఏ పార్టీకి ఎంత మొత్తం ఎంత విరాళం వచ్చిందనేది మాత్రమే వెల్లడిస్తారు. ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 13 ఏను సవరించక ముందు ఏ రాజకీయ పార్టీకైనా ఎవరైనా విరాళాలు ఇస్తే, ఆ వ్యక్తి పేరు, చిరునామా సహా అతని వివరాలను ఆ రాజకీయ పార్టీ రికార్డులో స్పష్టంగా నమోదు చేయాలి. అలా నమోదు చేయడం వల్ల ఇచ్చిన విరాళం మేరకు ఆదాయపు పన్ను నుంచి అతనికి మినహాయింపు లభిస్తుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టానికి తెచ్చిన సవరణ వల్ల ఏ రాజకీయ పార్టీ కూడా తమకు ఎవరు విరాళం ఇచ్చింది, ఎంత విరాళం ఇచ్చిందీ నమోదు చేయవలసిన అవసరం లేకుండా పోయింది. విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ చట్టం ప్రకారం రాజకీయ పార్టీలు కానీ, ప్రభుత్వ ఉద్యోగులు కానీ విదేశాల నుంచి విరాళాలు సేకరించరాదు. ఈ సవరణ ద్వారా విదేశీ విరాళాల సేకరణకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయి. ఈ ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని 2018లో ఎన్నికల కమిషన్ తీవ్రంగా వ్యతిరేకించిన విషయం గమనార్హం.

### ఏ పార్టీకి ఎంత మొత్తం విరాళాలు ! ?

మొత్తం ఎలక్టోరల్ బాండ్ల విలువ 2017-18 నుంచి 2022-23 మధ్య 12,008 కోట్ల రూపాయలు అమ్ముడుపోగా, బీజేపీకి 55 శాతం, అంటే 6,564 కోట్ల రూపాయలు విరాళాలుగా లభించాయి. కాంగ్రెస్ పార్టీకి కేవలం 9 శాతంతో అయిదేళ్ళకు గాను 1,135 కోట్ల రూపాయలు విరాళాలు లభించాయి. కాంగ్రెస్ పార్టీకి సమీపంగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి 1.096 కోట్ల రూపాయలు విరాళంగా వచ్చాయి.

'ద హిందూ' పత్రికలో వచ్చిన సమాచారం ప్రకారం 2022-23 సంవత్సరంలో మొత్తం ఎలక్టోరల్ బాండ్లలో 54 శాతంతో బీజేపీకే సింహభాగం దక్కింది. అంటే 2,120.06 కోట్ల రూపాయలు అధికార బీజేపీకి దక్కాయి. 'అసోసియేషన్ ఆఫ్ డెమాక్రటిక్ రిఫార్మ్స్' ప్రకారం గడిచిన ఆరేళ్ళలో, 2018-2023 మధ్య బీజేపీకి 52 శాతం నిధులు విరాళంగా లభించాయి. అంటే 5271 కోట్ల రూపాయలు దక్కాయి. కాంగ్రెస్ పార్టీకి 2022-23 సంవత్సరంలో కేవలం 171 కోట్ల రూపాయలు మాత్రమే ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విరాళాలు లభించాయి. ప్రాంతీయ పార్టీలకు కూడా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా పెద్ద మొత్తంలో విరాళాలు లభించాయి. ప్రాంతీయ పార్టీల్లో 2022-23 సంవత్సరానికి గాను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కి అత్యధికంగా 529 కోట్ల రూపాయల విరాళాలు లభించాయి. తరువాతి స్థానంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి 329 కోట్ల రూపాయలు లభించాయి. భారతీయ జనతాదళ్(బీజేడీ)కి రూ.152 కోట్లు లభించగా, వైసీపీకి రూ.52 కోట్లు మాత్రమే లభించాయి. బీఆర్ఎస్ మినహా మిగతా ఈ నాలుగు ప్రాంతీయ పార్టీలకు 2021-22లో పెద్ద మొత్తంలో విరాళాలు లభించాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.528 కోట్లు, డీఎంకేకు రూ.306 కోట్లు, భారతీయ జనతాదళ్‌కు 291 కోట్లు, వైసీపీకి రూ.60 కోట్లు లభించాయి. 'బ్లూమ్ బర్గ్' నివేదిక ప్రకారం 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికలు ప్రపంచం కనీవినీ ఎరుగని అత్యంత ఖరీదైన ఎన్నికలుగా నమోదయ్యాయి. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు 8.7 బిలియన్ డాలర్లు ఖర్చు పెట్టాయి. ఈ మొత్తాన్ని గమనిస్తే 2014 ఎన్నికల్లో ఖర్చు పెట్టిన డబ్బుకు రెట్టింపు వెచ్చించినట్టు లెక్క. ఇప్పటికే ఈ డబ్బును రెండు సాధారణ ఎన్నికలకు, అనేక రాష్ట్రాల శాసనసభ ఎన్నికలకు వెచ్చించారు. ఎలక్టోరల్ బాండ్లను తొలిసారిగా ప్రవేశపెట్టినప్పుడు ఇది పారదర్శకంగా లేదని హక్కుల కార్యకర్తలు అనేక అభ్యంతరాలు లేవనెత్తారు. ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా ఈ పథకాన్ని ప్రవేశ పెట్టినట్టు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ పథకం ద్వారా రాజకీయ పార్టీలకు, పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు మధ్య క్విడ్ ప్రోకోను ప్రోత్సహించినట్టు అవుతుందని, ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద విఘాతమని ఉన్నత న్యాయస్థానంలో అనేక మంది దీన్ని సవాలు చేశారు. ఏడేళ్ళు ఆలస్యమైనప్పటికీ, ఎట్టకేలకు ఎలక్ట్రోల్ బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని తీర్పు చెప్పడం ద్వారా అత్యున్నత న్యాయస్థానం తన ఉనికిని, గౌరవాన్ని కాపాడుకుంది. ❑ **(నేటి మన తెలంగాణ)**

# నరేంద్ర మోదీ నిర్దేశిస్తున్న రాజనీతి



- ఎ.కృష్ణారావు

**'మీరు నేతగా ఎన్నికయ్యారు. ముందు వరుసలోకి వెళ్లండి' అని 2021 సెప్టెంబర్‌లో గుజరాత్‌లో జరిగిన బీజేపీ శాసన సభా పార్టీ సమావేశంలో చివరి వరుసలో వున్న భూపేంద్ర భాయి పటేల్‌కు ఒక ఎమ్మెల్యే చెప్పారట. 'నేనిప్పుడు నేతనే కదా' అని భూపేంద్రభాయి అంటే, 'మీరు మొత్తం శాసన సభా పార్టీకే నేతగా ఎన్నికయ్యారు.. అంటే మీరే ముఖ్య మంత్రి' అని ఆ ఎమ్మెల్యే చెప్పడంతో ఆయన ఉబ్బితబ్బిబ్బ య్యారు. చప్పట్ల మధ్య తేరుకుని ముందుకు వెళ్లారు. 'అరే, ముందే తెలిసి ఉంటే కనీసం మంచి షర్ట్ అయినా తొడుక్కుని వచ్చేవాడిని కదా' అని ఆయన అన్నారు.**

మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కూడా ఇప్పుడు ఇలాంటి సీన్‌లే కనపడ్డాయి.. మధ్యప్రదేశ్ శాసనసభా పార్టీ సమావేశంలో మొదటి వరుసలో శివరాజ్‌సింగ్ చౌహాన్, కైలాష్ విజయ్ వర్గీయ, ప్రహ్లాద్ సింగ్ పటేల్ లాంటి హేమాహేమీలు కూర్చుని ఉన్నారు. మూడో వరుసలో కూర్చుని ఉన్న మోహన్ యాదవ్‌కు తననే శాసనసభా పార్టీ నేతగా ఎన్నుకుంటారని ఏ మాత్రం అంచనా లేదు. 'అసలు మా ఇంట్లో కనీసం చర్చ కూడా లేదు' అని ఆయన కుటుంబ సభ్యులు మీడియాతో చెప్పారు. మధ్యప్రదేశ్‌లో పార్టీని బలోపేతం చేసి, లాడ్లీ యోజన వంటి అనేక పథకాలను సమర్థంగా అమలు చేసిన శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు తనకు ఈసారి ముఖ్యమంత్రి పదవి లభించదని రెండు రోజుల ముందే తెలిసింది. 'అందరికీ రామ్ రామ్' అంటూ చేతులు జోడించి వున్న తన ఫొటోతో ఆయన ట్వీట్ చేసి వీడ్కోలు చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న రమణ్‌సింగ్‌ను శాసనసభలో స్పీకర్‌గా వెళ్లమని చెబితే ఆయన కిమ్మనకుండా సరేనన్నారు. ఆ రాష్ట్రంలో ఎవరూ ఊహించని విధంగా ఒక ఆదివాసీ నేత విష్ణుదేవ్ సాయిని సీఎంగా ప్రకటించడంతో నేతలంతా ఆశ్చర్యపోయారు. అన్నిటి కన్నా ఆశ్చర్యకరంగా రాజస్థాన్‌లో మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన భజన్‌లాల్ శర్మను సీఎం పదవి వరించింది. అక్కడ బలమైన నేతగా అందరూ పరిగణించే వసుంధరా రాజే నోటి ద్వారానే భజన్‌లాల్ పేరును చెప్పించారు ! మంగళవారం ఉదయం వరకూ వసుంధరా రాజే సీఎం పదవి కోసం చేయని ప్రయత్నమంటూ లేదు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాకు ఫోన్ చేసి తనకు కనీసం ఒక ఏడాది వరకైనా ముఖ్యమంత్రి పదవి ఇప్పించాలని కోరారు. కాని నడ్డా తానేమీ చేయలేనని నిస్సహాయత వ్యక్తం చేశారని సమాచారం. కావాలంటే స్పీకర్ పదవి చేపట్టమని నడ్డా కోరితే రాచకుటుంబానికి చెందిన వసుంధర అందుకు నిరాకరించారు. నిజానికి ఆమెకు గత ఏడాది ఉపరాష్ట్రపతి పదవి ఇచ్చేందుకు బీజేపీ అధిష్ఠానం సుముఖత వ్యక్తం చేసింది. కాని వసుంధరారాజే అందుకు ఒప్పుకోకుండా రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటానని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒకసారి తప్పించాలని నిర్ణయించిన తర్వాత హరిహర బ్రహ్మాదులైనా అడ్డుకోగలరా ? మోదీ మాట విని ఉంటే వసుంధరా కనీసం రాజ్యసభ చైర్మన్‌గానైనా కాలక్షేపం చేసి ఉండేవారు. ఇప్పుడు తన భవిష్యత్ ఏమిటో ఆమెకే తెలియదు.

మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కొత్త ముఖాలు వచ్చిన తర్వాత బీజేపీలో అద్వానీ హయాంలో వెలుగులోకి వచ్చిన నేతల తరం దాదాపు ముగిసినట్లే. వసుంధరా రాజే, శివరాజ్ సింగ్ చౌహాన్, రమణ్‌సింగ్ ముగ్గురూ అద్వానీ హయాంలో పార్టీలో ఎదిగినవారే. ఇప్పుడు మోదీ మంత్రివర్గంలో ఉన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ భవిష్యత్ ఏమిటో 2024 ఎన్నికల తర్వాత తేలుతుంది. మూడు ఉత్తరాది రాష్ట్రాల్లో జరిగిన ఈ పరిణామం బీజేపీలో జరుగుతున్నదేమిటో మరింత స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి పదవుల్లో నరేంద్రమోదీ ఎవర్ని కావాలంటే వారినే కూర్చోపెట్టగలరని, ఎక్కడ కూర్చోమంటే అక్కడ కూర్చునే కీలుబొమ్మనే ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని, ఎలాంటి హేమాహేమీలనైనా తీసి పారేయగలరని తేలిపోయింది. 'భృత్యస్య భృత్య ఇతిమాం స్మరలోక నాథ' అని కులశేఖర ఆళ్వార్ ముకుంద మాలలో భగవంతుడిని కీర్తించినట్లే తనను ఆమోదించిన వారినే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గుర్తిస్తారన్న విషయం పార్టీ నేతలకు తెలిసిపోయింది. బహుశా కేంద్రం నుంచే రాష్ట్రాల్లో పరిపాలన సాగించడానికి తనకు అనుకూలమైన యంత్రాంగాన్ని రాష్ట్రాల్లో ఏర్పర్చుకోవాలని మోదీ నిర్ణయించినట్లు కనపడుతోంది.

పైకి డబుల్ ఇంజన్ సర్కార్ అని ప్రధానమంత్రి ఎంతగా చెబుతున్నప్పటికీ ఒక రకంగా దేశమంతటా ఒకే ఇంజన్ సర్కార్ సాగేందుకు ఆయన చర్యలు తోడ్పడుతున్నాయి. మోదీ అనుసరిస్తున్న ఈ వ్యవహార శైలి ఆయనకు లోక్‌సభ ఎన్నికల్లో ఉపయోగపడుతుందా? తానొక్కడే సర్వం తానై అన్నట్లుగా

అరివీర భయంకరుడిలా దేశంలో ప్రచారం చేస్తుంటే మిగతా నేతలంతా చప్పట్లు కొడుతూ తాను మూడోసారి ప్రధాని అయ్యేందుకు దోహదం చేస్తారా అన్నది వేచి చూడాల్సి ఉన్నది.

ప్రజాస్వామ్యంలో అతి ఆధిపత్య ధోరణి బెడిసికొట్టే అవకాశాలు కూడా లేకపోలేదని అనేక సందర్భాల్లో రుజువైంది. కాంగ్రెస్ అలా వ్యవహరించే మొదటికే మోసం తెచ్చుకున్నది. అయినప్పటికీ మూడు ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ గెలుపుతో దేశంలో రాజకీయ పరిణామాలు మోదీకి అనుకూలంగా మారుతున్నాయనుకుంటే మరో రెండు పరిణామాలు కూడా దేశంలో మోదీ అనుకూల వాతావరణాన్ని ఏర్పర్చే అవకాశాలు ఉన్నాయి. జమ్ము-కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దును సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమర్థించడం మోదీ నిర్ణయాలకు తిరుగులేదన్న విషయాన్ని మరింత స్పష్టం చేసింది. కశ్మీర్‌లో జరిగిన హింసా కాండను, మానవ హక్కుల ఉల్లంఘనను సత్య పూర్వకంగా అంగీకరించి, వాటిని సరిదిద్ది సుహృద్భావ వాతావరణం ఏర్పర్చేందుకు సత్యశోధన, సమన్వయ కమిషన్ ఏర్పర్చాలని జస్టిస్ కౌల్ స్వతంత్రంగా ఇచ్చిన తీర్పు చెప్పుకోదగ్గదే. కాని దాన్ని మోదీ ప్రభుత్వం అమలు చేసే అవకాశాలు లేవు. ఈ దేశంలో కులం పేరిట, మతం పేరిట జరిగిన అత్యాచారాలు, మారణ హోమాలు ఎన్నో. పాత గాయాల్ని గెలికి, సత్య పూర్వకంగా అంగీకరించే ప్రాయశ్చిత్తం చేసుకునే ధైర్యం అధికారంలో ఉన్న వర్గాలకు ఉంటుందా?

ఏమైనా కశ్మీర్ తీర్పును తమ విధానాల పట్ల తీర్పుగా ప్రచారం చేసేందుకు బీజేపీ నేతలు వెంటనే రంగంలోకి దిగారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ స్వయంగా ఆగమేఘాలపై వ్యాసం రాసి ఇది ప్రతీ భారతీయుడు గర్వించే తీర్పుగా అభివర్ణించారు, దేశంలోని అన్ని భాషలకు, ప్రాంతాలకు చెందిన దాదాపు అన్ని పత్రికలు ఈ వ్యాసాన్ని ప్రచురించడం సాధారణమైన విషయం కాదు. బీజేపీకి సంబంధించి మరో ముఖ్య పరిణామం జనవరి 22న అయోధ్యలో రామాలయాన్ని ప్రారంభించడం. ఈ ప్రారంభోత్సవానికి ముఖేశ్ అంబానీ, రతన్ టాటా, గౌతమ్ అదానీ, సచిన్ టెండుల్కర్, విరాట్ కోహ్లీలతోపాటు పలువురు సినీతారలను, న్యాయమూర్తులను, శాస్త్రవేత్తలను, సాహితీ వేత్తలను, కనీసం 50 దేశాల ప్రతినిధులను ఆహ్వానించి బృహత్తర ఘట్టంగా నిర్వహించబోతున్నారు. 2024 ఎన్నికలకు కశ్మీర్, రామమందిరం అంశాలు తమకు ఎనలేని ప్రయోజనాలు చేపట్టేందుకు వీలుగా బీజేపీ వాటిని మార్కెటింగ్ చేసుకోబోతున్నదన్న విషయంలో సందేహం లేదు.

ఈ నేపథ్యంలో బీజేపీని ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ ఎదుర్కోగలదా అన్నది చర్చనీయాంశం. మూడు రాష్ట్రాల్లో పరాజయం తర్వాత బీజేపీతో ముఖాముఖి తలపడే స్థానాలపై కాంగ్రెస్ తన శక్తియుక్తులను మరింత బలంగా కేంద్రీకరించాల్సి ఉంటుంది. గత ఎన్నికల్లో బీజేపీతో ముఖాముఖి తలపడిన 190 లోక్‌సభ సీట్లలో బీజేపీ 175 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 15 సీట్లు మాత్రమే సొంతం చేసుకోగలిగింది. ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీ, కాంగ్రెస్‌కూ మధ్య ఓట్ల శాతంలో పెద్ద తేడా లేదని, 2018-19లో జరిగినట్లుగా అసెంబ్లీ ఎన్నికలకూ, లోక్‌సభ ఎన్నికలకూ ప్రజలు వేర్వేరుగా ఓటు వేస్తారని యోగేంద్ర యాదవ్ లాంటి సామాజిక శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నప్పటికీ ప్రజల ఆలోచనా విధానాన్ని గణాంకాల ఆధారంగా అంచనా వేయడం సాధ్యం కాదు.

**మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ దెబ్బతిన్న తర్వాత ఆ పార్టీకి దేశంలో ఇతర పార్టీల అవసరం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఇతర ప్రతిపక్షాలు కూడా ఈ పరిణామాలతో ఆత్మ రక్షణలో పడ్డాయి. కాంగ్రెస్, ఇండియా కూటమిలోని ఇతర పార్టీలు అహాన్ని వదిలి కలిసికట్టుగా పనిచేయకపోతే మోదీ సారథ్యంలోని బీజేపీని అంత అవలీలగా ఎదుర్కోలేమన్న విషయం అవి గ్రహించినట్లు కనపడుతోంది.**

మూడు రాష్ట్రాల్లో గెలుపు తర్వాత వచ్చిన మోదీ మరింత కసితో ప్రతిపక్షాలను తొక్కేసేందుకు, విమర్శించిన వారిని ఏరి వేసేందుకు ప్రయత్నిస్తారనడంలో సందేహం లేదు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రాను పార్లమెంట్ నుంచి బహిష్కరించిన తీరు మోదీ ప్రభుత్వ ఆధిపత్య ధోరణికి, విమర్శలను సహించలేని తత్వానికి నిదర్శనంగా అనేకమంది భావిస్తున్నారు. గతంలో ఎంపీలను పార్లమెంట్ నుంచి బహిష్కరించినప్పటికీ వారు డబ్బు తీసుకున్న దృశ్యాలు ప్రజల ముందుకు వచ్చాయి. ఇక్కడ అలాంటిదేమీ రుజువు కాలేదు. ఎంపి పోర్టల్ లాగిన్, పాస్‌వర్డ్‌ను ఇతరులతో పంచుకునే విషయంలో పార్లమెంట్ ఎలాంటి నిబంధనలనూ రూపొందించలేదు. ఆమెకు వ్యతిరేకంగా ఎథిక్స్ కమిటీ 480 పేజీల నివేదికను సమర్పించడం. దానిపై పెద్దగా చర్చ లేకుండానే అరగంటలోనే ఆమెను బహిష్కరించాలని నిర్ణయించడం ఒక కక్ష సాధింపునే సూచిస్తున్నాయి. దానివల్ల ఆమె తప్పు చేసిందనే అభిప్రాయం ఏర్పడడంకన్నా సానుభూతినే కలిగించేందుకు అవకాశాలు ఉన్నాయి.

దీనిపై కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావడం వారి ఐక్యతకు సంబంధించి సరైన పరిణామమే అని భావించవచ్చు. కాని ఈ ఐక్యత సరిపోదు. బీజేపీని, ముఖ్యంగా మోదీని ఎదుర్కోగల సైద్ధాంతిక బలం, నాయకత్వ శక్తి తమకున్నదని, కొత్త ఆలోచనలతో, కొత్త నాయకత్వంతో ముందుకు రాగలమని కాంగ్రెస్, ప్రతిపక్షాలు నిరూపించుకోగలవా అన్నదే చర్చించాల్సి ఉన్నది. ❑

# అటు ఆ రాముడూ ఇటు ఆత్మారాముడూ



- కె.శ్రీనివాస్

**శ్రీరామచంద్రుడి ఆహారంలో ఏ ఏ పదార్థాలుండేవి అన్న చర్చ ఆ మధ్య జరిగింది. అదే విషయం మీద అదేదో సినిమాను ఒక ఓటీటీ వేదిక వెనక్కి తీసుకుంది కూడా. ఆ కాలంలో రాముడు తాను పుట్టిన దేశంలో వంశంలో కులంలో ఏమి ఆహారం తినే ఆనవాయితీ ఉండేదో అదే తిని ఉంటాడు. కావాలంటే, వాల్మీకి రామాయణాన్ని సంస్కృతంలో చదువుకుని లేదా పుల్లెల శ్రీరామచంద్రుడు వంటి విద్వాంసుడి అనువాదాలు చదువుకుని తెలుసుకుంటే సరిపోతుంది.**



శ్రీరాముడు దేవుని అవతారమే తప్ప తానే దేవుడు కాదు కదా ? ధర్మానికి ఏదో గ్లాని కలిగిందని మానవజన్మ ఎత్తి భూలోకం మీదికి వచ్చాడు. మనిషి పుట్టుక ఎత్తినందుకు, ఆహార నిద్రలు కష్టసుఖాలు వివాహ సంతానాలు అన్నీ తప్పవు. మనలాగే జీవించి, మనలాగే బాధలూ బాదర బందీలూ అనుభవించాడు కాబట్టి, రాముడు మనసుకు దగ్గరగా అనిపిస్తాడేమో? కించిత్ కష్టానికి కూడా రామా అనుకుంటాం, అపచారం జరిగితే హేరామ్ అంటాం. తెగదెంపులు చేసుకోవాలంటే రాంరాం అనేస్తాం. రాముడెంతగా మన సంస్కృతిలో భాగమయ్యాడంటే, ఎంత రంగనాయకమ్మ అయితే మాత్రం రామ రామ అనుకోరా? అని శ్రీ రమణ గారు చమత్కరించారు! ఆకలేసినప్పుడు ఆత్మారాముడు అల్లాడిపోతున్నాడంటాము. అంటే మన లోపల ఉన్నది రాముడేనని అర్థం. ఆయనను పస్తు పెట్టకూడదు కదా ? త్యాగరాజులూ రామదాసులు కూడా రాముడిని పాడుకుంటూ అన్నంలో కూడా రాముడిని చూసుకున్నారు కానీ, ఉపవాసాలు ఉండలేదు. తనకు మాలిన ధర్మం ఉండదన్నట్టే, దైవం కూడా ఉండదు. అన్నానికీ రాముడికీ మధ్య పోటీ రాకూడదు ! ఆత్మారాముడికీ రాముడికీ పంతం వస్తే, రెండు వైపులా రాములే కదా? ఎవరు గెలవాలి?

రాముడిని అడ్డం పెట్టుకుని ఈ ఏడాది ఎన్నికలను అమోఘంగా, అమేయంగా గెలిచేయాలని నరేంద్రమోదీ ఆయన పరివారం అనుకుంటున్నారు. బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కలిగించిన భక్తి పారవశ్యాలు దేశప్రజలలో సజీవంగా ఉన్నాయని, పోలింగ్ దాకా పదిలంగా ఉంటాయని నమ్ముతున్నారు. శతాబ్దాల ఆరాటం ఫలించిన శుభ తరుణం అనీ, కూలిన ఆత్మాభిమాన కేతనం తిరిగి రెపరెపలాడుతోందని చెప్పుకుంటున్న మాటలు రాజకీయ ఎంపికను తిరుగు లేకుండా ప్రభావితం చేస్తాయని ఆశిస్తున్నారు. వాళ్లు అనుకోవడమే కాదు, మీడియా కూడా అదే వాస్తవాన్ని మోదీ ఇంటి కోడై కూస్తోంది. జట్టు కట్టలేని బల హీనతతో తమంతట తామే ఓటమి భావనలోకి కుంగిపోతున్న ప్రతిపక్షం కూడా మూడోసారి మోదీ విజయాన్ని ముందస్తుగానే అంగీకరిస్తున్నట్టు కనిపిస్తున్నది. మోదీ బృందానికి ఇప్పుడు కావలసినది కేవల విజయం కాదు, ఘనాతి ఘన విజయం! దేన్నైనా తిరగరాయగల, దేన్నైనా నిర్వచించగల, వెయ్యేళ్ల భవితవ్యాన్ని శాసించగల తిరుగులేని విజయం !

మరి రాముడు అందుకు సహకరిస్తాడా ? అంతగా సహకరిస్తాడా ? తనకొక ఆలయం నిర్మించినందుకు కొంత ప్రసన్నత కలిగి ఉండవచ్చును. కానీ, అంతకుమించిన విచక్షణ ఆ రామచంద్ర ప్రభువుకు ఉంటుంది కదా ? ఎదుటి పక్షంలో రావణాసురుడు నిలబడి సవాల్ విసురుతుంటే, బహుశా, బాలరాముని కరుణా కటాక్షం మోదీపైనే ప్రసరించే అవకాశం ఉండవచ్చు. కానీ, అవతలి పక్షంలో అశేషప్రజానీకంలోని 'ఆత్మా రాముడు' నిలబడితే, శ్రీరాముడికి పెద్ద సంకటమే వచ్చి పడుతుంది. ఇప్పుడటువంటి క్లిష్టపరిస్థితి ఏదో వచ్చిపడుతున్నట్టుంది. అసలుకే మోసం రాకపోయినా, 400 సంఖ్య చుట్టూ పెట్టుకున్న ఆశలకు గండి పడే ప్రమాదం కనిపిస్తోంది.

కొంత మంది కేంద్ర మంత్రులు ఆ మాట అననే అన్నారు. దేశప్రజలు రామభక్తి తాదాత్మ్యంలో ఓలలాడుతుంటే, వారి దృష్టి మళ్లించడానికి ప్రతిపక్షం ఏవేవో వివాదాలు తెస్తోందని. ఉత్తరం-దక్షిణం తగాదా గురించి ఆ మాట వచ్చింది. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో రాష్ట్రాలు ఇచ్చే పన్ను ఆదాయం, రాష్ట్రాలకు దక్కే కేంద్ర కేటాయింపుల గురించిన ప్రస్తావన వచ్చింది. 'ఇట్లాగైతే కష్టం మరి, దక్షిణాది వాళ్లం ఆలోచించుకోవలసి వస్తుంది' అని కర్ణాటకకు చెందిన ఒక నాయకుడు అన్నాడు. తరువాత, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏకంగా ఢిల్లీలో ధర్నా చేశాడు. ఆయనకు కేరళ నుంచి, తమిళనాడు నుంచి మద్దతు వచ్చింది. ఇండియా కూటమిలోని ముఖ్యమంత్రులందరూ ఢిల్లీకి వెళ్లడమో, మద్దతు చెప్పడమో చేశారు. 400 గమ్యం చేరాలంటే దక్షిణ దిక్కున కూడా కొన్ని విజయాలు కావాలి. ఈ వివాదం

వాతావరణాన్ని దారి మళ్లిస్తోందని బీజేపీకి అనిపించింది. అనిపిస్తే, దాన్ని విస్మరించి అప్రధానం చేయాలి కదా, లేదు. ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రి దీనికి జవాబు ఇచ్చే క్రమంలో మరింత ప్రాధాన్యం సమకూర్చారు !

ఈ ఉత్తర, దక్షిణ చర్చ ఏదో సాధిస్తుందని కాదు కానీ, రామాలయ వాతావరణంలో దక్షిణాది ఎడంగా, పెడగా ఉండడమే మోదీ ప్రభుత్వానికి జీర్ణం కావడం లేదు. దేశంలో ఈ వైవిధ్యం ఏమిటి ? ఇంకా ప్రశ్నలు మిగిలి ఉండడమేమిటి ? కేంద్రాన్ని పట్టుకుని లెక్కలూ పత్రాలూ అడగడమేమిటి ? ఈ పరిస్థితి కొనసాగకూడదని ఉన్నది కానీ, 400 లక్ష్యం చేరితే తప్పితే ఇటువంటి 'అరాచకాలు' సరిదిద్దడం కూడా సాధ్యం కాదు మరి!

బడ్జెట్ సమావేశాలు కాగానే, అవసరమైన రాచకార్యాలూ తీసుకోవలసిన కీలక నిర్ణయాలూ తీసుకుని ఎన్నికల షెడ్యూలు ప్రకటించవచ్చుననుకుంటే, ఇప్పుడీ ఢిల్లీ ముట్టడి ముప్పు వచ్చి పడింది. ఈ వారం పది రోజుల్లో ఎన్నికల తేదీల ప్రకటన వచ్చాక, రాజకీయ ప్రచార కార్యక్రమాల షెడ్యూలు ఒకటి, ఆధ్యాత్మిక కార్యక్రమాల షెడ్యూలు ఒకటి, విడివిడిగా రంగం లోకి దిగుతాయి. శోభాయాత్రల సందడి ఎన్నికల హడావిడికి సమీపంగా ఉంటే బాగుంటుందన్న ఆకాంక్షలూ ఉంటాయి. భక్తి వాతావరణం నుంచి రాజకీయ లాభం పిండుకోవాలని ఆశిస్తుంటే, ఏమిటి ఈ పంజాబ్ హర్యానా రైతులు మద్దతు ధర అంటూ వార్తావరణాన్ని అంతటినీ ఆక్రమిస్తున్నారు ?

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం ఆర్థికవ్యవస్థను కుప్పకూల్చడమే అంటూ మార్కెట్ వాదులు సిద్ధాంతాలు చేస్తున్నారు. ఆ డిమాండ్ ఆమోదించే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. కానీ, వ్యవసాయోత్పత్తుల ధరలు ఏ ప్రాతిపదికన నిర్ణయించాలో సిఫారసు చేసిన స్వామినాథన్‌కు, మద్దతు ధర కోసం ఉద్యమించి స్వయంగా రైతు నాయకుడైన చరణ్‌సింగ్‌కు ఈ ప్రభుత్వమే భారతరత్న ప్రకటించింది! ప్రభుత్వం మీద ఒత్తిడి పెట్టడమెలాగో తెలియడమే కాదు, దీర్ఘకాలం నిర్బంధాన్ని సహించగలిగిన సత్తా కూడా కలిగిన రైతాంగం ఇప్పుడు దేశరాజధానిలో మోహరించింది. వారు ఎంతవరకు విజయం సాధిస్తారో తెలియదు కానీ, ఇప్పుడు మాత్రం మోదీ పరివారం కోరుకున్న ఉద్వేగాల వ్యాప్తిని నిరోధించే ప్రయత్నం చేస్తున్నారు.

పరిస్థితి చేతిలో లేకుండా పోయిందని, జన హృదయాలను ఆవరించడంలో మోదీ విజయవంతమయ్యారని బాధపడడం మానేసి, ప్రతిపక్షాలు ప్రజల వాస్తవ సమస్యలను మళ్లీ రంగం మీదికి తేవడానికి తమవంతు ప్రయత్నం చేయడం మంచిది. మహాబలశాలి అయిన ప్రత్యర్థిని నిలువరించడానికి చిన్నదో పెద్దదో ఏదో చేయలేకపోతే, పిల్లిలో ఎలుక ఐక్యం అయిపోయినట్టు, అధికార స్రవంతిలో కలిసిపోవడం మంచిది. ప్రజల ధ్యాసను తమ వైపే నిలుపుకోవడానికి వివిధ పక్షాలు ప్రయత్నించడం సహజం. అన్ని రకాల శక్తి యుక్తులూ హంగులూ కలిగిన పక్షం, ఆ ప్రయత్నం విజయవంతంగాను, విస్తృతంగానూ చేయగలదు. అలాగని, ప్రజలు ఎప్పుడూ తమ ఆలోచనల మీద, మనోభావాల మీద అదుపు లేకుండా ఉంటారని అనుకోవడం కూడా పొరపాటు. అతి పెద్ద కృత్రిమ సరంభం నుంచి కూడా ఆకులు అల్లాడిన సవ్వడి వైపు వారు దృష్టి మళ్లించుకోగలరు. కాకపోతే, అందుకు మానవప్రయత్నం కావాలి. దేవుడిని తమ పార్టీలో చేర్చుకున్నామని గర్విస్తున్నవాళ్లు కూడా, చేసింది మానవప్రయత్నమే.

**రాముడు ఆలయాల్లోనే కాదు, అందరిలోనూ ఉన్నాడని ఆధ్యాత్మికవాదులే చెబుతుంటారు. చరాచర ప్రకృతిలో, సమస్త జీవరాశిలో దైవం ఉనికిని గుర్తించడమే గొప్ప తాత్వికత అని నమ్ముతారు. మనుగడ పోరాటం చేస్తూనే, దైవాన్ని ధ్యానించుకోవాలని తుకారాం, కబీర్ వంటి వారు బోధించారు. ప్రజలు తమ జీవనపోరాటం చేయవలసిందే, అధిక ధరల మీద, అవినీతి మీద, విద్వేష వాతావరణం మీద, నిరుద్యోగం మీద, ఆర్థిక అంతరాల మీద పోరాడవలసిందే. మరో మార్గం లేదు. తన నామాన్ని జపించుకుంటూ కర్తవ్యాన్ని విస్మరిస్తే రాముడు సంతోషించడని భక్తులకు తెలుసు. గాలిలో దీపం పెట్టి దేవుడా అంటే లాభం లేదని పెద్దలే చెబుతారు. ఆత్మారాముడి ఆకలి తీర్చకపోతే, రాముడి ఆకలి మాత్రం ఎట్లా తీరుతుంది? ❑**

# కేంద్ర బడ్జెట్ - తిరగబడిన తర్కం

**(5వ పేజీ తరువాయి)**

"ఆర్థిక విజ్ఞత"ను ప్రదర్శించినందువలన విదేశీ పెట్టుబడులు బాగా తరలి వస్తాయని ప్రభుత్వం చెప్పుకుంటోంది. అందువలన మన వృద్ధిరేటు ఇంకా పెరుగుతుందని కూడా చెప్తోంది. మన "ఆర్థిక విజ్ఞత" ఎంత గొప్పగా ఉన్నా మన క్రెడిట్ రేటింగ్ (ఆర్థిక స్తోమతను అంచనా వేసే రేటింగ్) మాత్రం చాలా హీనంగానే కొనసాగుతోంది. ఇండోనేషియా కన్నా ఒక మెట్టు దిగువన, థాయ్‌లాండ్ కన్నా రెండు మెట్లు దిగువన మనం ఉన్నాం. జంక్ బాండ్లు (దివాలా ఎత్తిపోయిన కంపెనీల వాటాలకు సంబంధించినవి) కన్నా ఒక్క మెట్టు మాత్రమే మనం పైన ఉన్నాం. అంటే అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడికి మన "ఆర్థిక విజ్ఞత" అంతగా రుచించలేదన్న మాటేగా! ❑

# దైవ ఉన్మాదం కాదు..
# ప్రజాస్వామ్య పరివ్యాప్తి జరగాలి



- అశోక్ కుంబము

**కొన్ని మంచి రచనలు ఎంత ఉత్తేజితులను చేస్తాయో, అలాగే కొన్ని దుర్మార్గమైన రచనలు అంతగా కలవర పెడతాయి. అలా కలవరపెట్టిన రచనల్లో ఒకటి వంశీ జూలూరి రాసిన "ప్రజాస్వామ్య దేవుడు కాదు, రాముడే సర్వోన్నతుడు!" అనే వ్యాసం. ఇది నిత్యం రామ జపం చేసే గాంధీ వర్ధంతి రోజున (2024 జనవరి 30) ఆంధ్రజ్యోతిలో ప్రచురింపబడింది. దానిలోని అప్రజాస్వామిక, లౌకికభావ వ్యతిరేక, రాజ్యాంగ విరుద్ధ అంశాలను ఎత్తిచూపుతూ వెంటనే ఈ వ్యాసం రాసి ఆ పత్రికకు పంపాను. కాని, అది ఇంత వరకు అచ్చు కానందున ఇక్కడ మీతో పంచుకుంటున్నాను.**

వంశీ జూలూరి రచన దుర్మార్గమని ఎందుకంటున్నానంటే అందులో బ్రాహ్మణీయ పెత్తనం వుంది. బహుళత్వాన్ని రద్దు చేసే ఏకత్వ దాడి వుంది. భారతదేశమంటే రామ రాజ్యమనే హిందుత్వ ఫాసిస్టు కుట్ర వుంది. ఇవేవి రచయిత కేవలం అమాయకంగానో, అజ్ఞానంతోనో రాసినవి కాదు. ఎందుకంటే ఆయన అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో యూనివర్సిటీలో మీడియా స్టడీస్ ప్రొఫెసర్. గత కొన్నేళ్లుగా హిందుత్వ వాదనను ప్రవాసంలో బలంగా వినిపిస్తున్న వాడు. ఆయన ఒక హిందుత్వ ప్రవచనకర్తగా ఆ వ్యాసంలోని అంశాలు రాసి వుంటే అందులో ఆశ్చర్యపోవాల్సింది ఏమీ లేదు. కాని ఒక కరడుగట్టిన పెట్టుబడి దారీ దేశంలో ఆధునికత, ఉదారవాద భావాల పునాదిగా నడిచే ఒక విశ్వ విద్యాలయంలో అధ్యాపకులుగా పనిచేస్తూ తిరోగమన వాదాన్ని, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి మద్దతును కూడగట్టే భావనలను తెలుగు ప్రజల ముందు పెట్టడం కొంత ఆశ్చర్యంగానే వుంది. అసలు ఆయన రాసిన వాటిలో అభ్యంతరాలు ఏమిటో చూద్దాం.

వంశీ జూలూరి తన వ్యాసంలో ఒక భావోద్వేగం, ఒక "దైవ ఉన్మాదం"(ఇది ఆయన వాడిన మాటనే) గురించి ప్రస్తావించారు. భావోద్వేగం "అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ" సందర్భం గురించి. ఆ భావోద్వేగాన్ని "మన జాతి, నాగరికత" అనుభవించిందని, మనది ఒకే జాతని, ఒకే నాగరికతని హిందుత్వ ఏకత్వ సిద్ధాంతాన్ని చెప్పకనే చెప్పారు. అంతటితో ఆగక రాముడి విగ్రహానికి, దేశమంతా నిర్మాణమైన జాతీయ, రాజకీయ నాయకుల విగ్రహాలతో ఒక పోలిక చేస్తూ ఆ వ్యవహారాన్ని "దైవ ఉన్మాదమని" అభివర్ణించారు. వివిధ రాజకీయ పార్టీలు వారి రాజకీయ ప్రయోజనాల కోసం వారి నాయకుల విగ్రహాలు పెట్టుకుంటే తప్పులేనప్పుడు బీజేపీ తమ ప్రయోజనం కోసం రాముడి విగ్రహాన్ని పెట్టుకుంటే తప్పే ముందని చెప్పడం ఆయన భావన. ఇక్కడ రెండు అభ్యంతరకరమైన అంశాలున్నాయి.

**మొదటిది :** ప్రభుత్వమంటేనే హిందుత్వ అనేలా, దేశ ప్రధానమంత్రే తన ఇంటి కార్యంగా ఆ కార్యక్రమాన్ని నిర్వహించడం. దాని ద్వారా మొత్తం హిందూ సమాజాన్ని ఒక ఉద్వేగానికి గురిచెయ్యడం.

**రెండవది :** సారంలో నాయకుల విగ్రహాలు, రాముడి విగ్రహాలు కలిగించే ఉద్వేగం ఒకటే అయినప్పుడు, ఒకటి ఉన్మాదం అయితే మరొకటి కూడా ఉన్మాదమే!

ఆయన చాలా నాయకుల పేర్లు ప్రస్తావించినా అంబేద్కర్ విగ్రహాల మీద ప్రత్యేక కసిని ప్రదర్శించారు. ఆయనను అందరి నాయకుల "ప్రజాస్వామ్య దేవుడు" అని వ్యంగంగా అంటూ, ఆయనే "దేవుడని ఆరాధించే" ఆయన "ప్రతినిధులను" దైవ ఉన్మాదులుగా చూపే ప్రయత్నం చేశారు. తమకి నచ్చని రాజకీయాలను ఉన్మాదులుగా, తీవ్రవాదులుగా చిత్రీకరించడం బ్రాహ్మణీయ హిందుత్వ సంప్రదాయం కదా!

వంశీ జూలూరి ఒక మంచి ప్రశ్నతో మరో వాదనను వినిపించే పనిచేశారు. ఆ ప్రశ్నేమంటే, **"మన ఆధునిక సంవేదనలు, 'శాస్త్రీయ దృష్టి' ఎందుకు మనలను ఆలయాలు నిర్మించేవారిని, ఆరాధనలకు, ప్రాణప్రతిష్ఠలకు నిధులు సమకూర్చే వారిని తిరోగామి శక్తులుగా, అవన్నీ నిరుపయో గమైన పనులుగా ఎందుకు చూస్తున్నాయి?"** నిజానికి ఈ ప్రశ్నను చాలా లోతుగా హేతుబద్ధంగా సమాధానం చెబుతారే మోనని వడివడిగా చదువుకుంటూ పోయేసరికి నాకు నిరాశే మిగిలింది. ఆ ప్రశ్నకు ఎటూ తేల్చకుండానే తన తల్లితండ్రులు (సినీ నటి జమున, ఆమె భర్త – పేరు ప్రస్తావించలేదు) ఆర్థిక సహకారంతో 1975లో దుగ్గిరాల అనే గ్రామంలో నిర్మించిన నవగ్రహ విగ్రహాల దేవాలయం కలిగించే 'ప్రయోజనాలు' చెప్పుకుంటూపోయారు. ఏమిటా ప్రయోజనాలంటే,

**"నిరుద్యోగులు తమకు ఉద్యోగం వచ్చేలా చూడాలని ఒక గ్రహాన్ని పూజిస్తారు. దీర్ఘకాలిక రుజాగ్రస్తులు ఉపశమనం కోసం మరో గ్రహానికి నైవేద్యం సమర్పిస్తారు. యువ దంపతులు మంచి బిడ్డల కోసం ప్రార్థిస్తారు."** ఇలాంటి ప్రయోజనాల కోసమే అయోధ్యలో రామాలయం అవసరమని పరోక్ష సంబంధాన్ని ఏర్పరిచే ప్రయత్నం చేశారు. అంతేకాదు "మనం ఇప్పుడు ఒక విద్దూరమైన, అనాగరికమైన – సాంస్కృతికంగా పర్యావరణ పరంగా ఒక విషపూరిత ఆధునికీకరణ దశలో ఉన్నాం" కాబట్టి దానికి విరుగుడుగా అశాస్త్రీయత వైపునకు, మధ్యయుగాల వైపునకు అడుగులు వెయ్యాలని సూచిస్తున్నారు. ఇలాంటి మూర్ఖపు విశ్వాసాలను ప్రజలలోకి భక్తి పేరిట చొప్పించాలని చూడడాన్ని తిరోగమనవాదమే కాదు. తిమిరవాదం అని కూడా అంటారు. ఈ మాటలను ఆధునికవాదులే కాదు, చివరికి గరికపాటి వంటి హిందుత్వ ప్రవచనకర్తలు ఒప్పుకోరు.

ఇక్కడ మరో సామాజిక అంశం ఏమంటే అసలు వంశీ జూలూరి ఈ సర్వరోగ నివారిణిని (విగ్రహాలను ప్రతిష్టించడం) ఎవరికోసం ప్రస్తావిస్తున్నారో అర్థం చేసుకోవాలి. సమాజాన్ని విగ్రహాల చుట్టూ తిప్పితే బలపడే, దోపిడీ చేసే కులాలు, వర్గాలు, లింగాలేంటివో గుర్తించాలి. చివరికి బాధితులుగా మిగిలిపోయే వారెవరో అర్థం చేసుకోవాలి. ఈ ప్రశ్నలు అడగకుండా దళిత, బహుజనుల మీద మతం మత్తు చల్లుతున్నారు. మనం మతాన్ని నమ్మినా నమ్మకపోయినా ప్రతి మతం కొన్ని ఆధ్యాత్మిక విషయాలను చెబుతూనే దాని మనుగడ కోసం భావోద్వేగాలను ప్రేరేపించే కార్యాక్రమాలను ఆ మత విశ్వాసాలలో భాగం చేస్తుంది. అయితే ఆధ్యాత్మిక విషయాలపై కొందరికే నియంత్రణ ఇచ్చి, భావోద్వేగాలను మాత్రం మొత్తం సమాజం మీద రుద్దుతుంది. నిజానికి రామమందిరం వ్యవహారంలో హిందూ మతంలో ఉందని చెప్పుకునే ఆధ్యాత్మికతను చంపేసి కేవలం భావోద్వేగాలనే రెచ్చగొట్టారు. ఆ భావోద్వేగాన్ని చూసి వంశీ జూలూరి గారు పరవసించి పోతున్నారు. ఎంతగా అంటే అది దైవ ఉన్మాద దశకు చేరిందని తెలుసుకోలేనంతగా !

వంశీ జూలురి విశ్వాసం ఎంతో దృఢమైన విశ్వాసాలను ప్రకటించారు. ఆయన మాటలు వింటుంటే ఇక దేశ చరిత్రను రామాలయం ముందు, తర్వాతగా విడదీసి రాయాల్సిందేమో అనిపిస్తుంది. చూడండి ఎంత విశ్వాసమో : "మన జాతి, నాగరికత ఇప్పుడు అదే విధమైన భావోద్వేగంలో ఉన్నది. ఒక విలక్షణ స్ఫూర్తిని ఆవాహన చేసుకొంటూ, వర్తమాన సమస్యలను అధిగమించేందుకు అయోధ్యలో నిర్మించిన భవ్య రామ మందిరంతో శక్తిని పొందుతోంది. పరిపూర్ణ ఆత్మవిశ్వాసంతో భవిష్యత్తును ఆవాహన చేసుకొంటోంది." అంటే దీనర్థం **ఇప్పటి వరకు మనకు ఒక విలక్షణ స్ఫూర్తి, సమస్యలను అర్థం చేసుకుని అధిగమించే శక్తి, భవిష్యత్తును ఆవాహన చేసుకునే ఆత్మ విశ్వాసం ఏవీ లేవని, ఇక రామాలయంతో అవన్నీ పొంది పేదరికం, హింస, దోపిడీ, పీడనలు అంతరించిపోతాయని వంశీ జూలూరి ప్రగాఢ విశ్వాసం.** అయితే భక్తులెవరైనా ఇప్పటి వరకు అయోధ్యలో రామమందిరం లేదు కాని, దేహమే దేవాలయంగా ఆత్మారాముడు ఎప్పుడూ వున్నాడు కదా అని అమాయకపు ప్రశ్న వెయ్యకండి, దేశద్రోహులుగా మిగిలి పోతారు! మరొక వాదనను చూడండి. "శాస్త్రీయ దృష్టిని అలవరచుకోవాలని తొందరపెట్టే వారు ముహూర్తం, వాస్తును పరిహసించడం పరిపాటి. అయితే క్రూర ఏకేశ్వరోపాసన సంప్రదాయాలు విస్తరించక ముందు యావత్ప్రపంచమూ అనుసరించిన పద్ధతులు అవి. ఇప్పుడు మనలను ఆవహించిన రామభక్తి అంతకంతకూ అంతరించిపోతున్న ఆ పురాతన జ్ఞాపకాన్ని మళ్లీ మన మనస్సుల్లో నింపుకోవాలనే ఆరాటమే". అంటే మూఢనమ్మకాలను, అశాస్త్రీయతలను కాపాడే ఒక శక్తిని రామభక్తి కలిగిస్తుందని చెబుతున్నారు. ఇక్కడ "పురాతన జ్ఞాపకాలు" అనే ఒక గంభీరమైన పదం వాడారు. కాని ఆ జ్ఞాపకాలలో కేవలం భక్తి, ముహూర్తాలే లేవు. అందులో హింస, పెత్తనం దాగివున్నాయి. ఈ పురాతన జ్ఞాపకాల వ్యవహారమంతా సమాజంలో బ్రాహ్మణ్యాన్ని మరింత బలోపేతం చెయ్యడం కోసమే. అంబేద్కర్ అన్నట్లు బ్రాహ్మణీయతలో ఎలాంటి సమానత్వం, ఉదారత్వం, స్వేచ్ఛ ఉండవు. కాబట్టి పీడిత కులాలు, వర్గాలు, లింగాలు బ్రాహ్మణీయ భావజాల బూజును (మావో మాటల్లో చెప్పాలంటే) ప్రతిరోజు ఇల్లు తుడుచుకున్నట్లు తుడిచెయ్యాలి. దానికోసం హేతువాద సూత్రాలను, లౌకిక ప్రజాస్వామిక విలువలను ఆయుధాలుగా చేపట్టాలి. అంతేకాదు సామాజికశాస్త్రాలను క్రిటికల్ గా మన సామాజిక పరిస్థితులకు అన్వయించి అర్థం చేసుకోవాలి. వంశీ జూలూరి వంటివాళ్ళు అలాంటి ప్రయత్నాల మీద నీళ్ళే కాదు, నిప్పులు కూడా చల్లుతారు. ఆయన ఏమంటారంటే, "సామాజిక శాస్త్రాల భావనలు, సిద్ధాంతాలు వస్తాయి, పోతాయి. వాటికి ఆవల, వాటన్నిటికీ అతీతంగా వేల్పులు నిశ్చలంగా నిలబడి వుంటారు. వారి ఉనికి సుస్థిరమైనది, స్ఫూర్తిమంతమైనది." అసలు అమెరికాలో విద్యార్థులకు పాఠాలు చెప్పే ఒక అధ్యాపకుడు ఇలాంటి భావాలను వ్యక్తపరచడం ఆశ్చర్యాన్ని మాత్రమే కాదు, ఆ విద్యార్థుల మీద జాలి కూడా కలిగిస్తుంది. ఆయన మాటల్లో ఎలాంటి తర్కం లేదు. కేవలం మూర్ఖత్వం తప్ప.

వంశీ జూలూరి తన వ్యాసాన్ని ఒక అత్యంత ప్రమాదకరమైన వాక్యంతో ముగించారు. అదేమంటే, "మీ రాజ్యాంగం, మీ ప్రజాస్వామ్యం, మీ పవిత్ర గ్రంథం–ఇవేవీ మా రాముడిని మించి సమున్నతమైనవి కావు. వ్యవహరించాల్సి వస్తే దాని

**(మిగతా 19వ పేజీలో)**

# ఇటు లౌకిక వేదికలు.. అటు బీజేపీ పాచికలు



- తెలకపల్లి రవి

దేశ వ్యాపితంగా ఎన్నికల వేడి పెరుగుతున్న కొద్దీ తెలుగు రాష్ట్రాల్లోనూ ఆ ప్రభావం పెరగడం కనిపిస్తున్నది. ఆయా పాలక వర్గాల ప్రయోజనాలకు అనుకూలంగా మీడియా కావాలని ఇచ్చిన కథనాలు, హైప్‌లు వెనక్కుపోయి వాస్తవాలు, వారి వారి నిజరూపాలు వెల్లడవుతున్న దశ. ఇండియా వేదిక చెల్లా చెదురై పోతుంటే మోడీ 400 స్థానాలవైపు దూసుకుపోతున్నట్టు ఏకపక్షంగా ప్రచారంలో పెట్టిన దృశ్యం ఇప్పుడిప్పుడే చెదిరిపోయి భిన్నశక్తుల సమీకరణాలు, సమిష్టి ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తున్నాయి. ఏపీలో సిద్ధం అంటున్న వైసీపీ ఆర్భాటసభల ఆర్భాటం, బీజేపీ చుట్టూ ప్రదక్షణలు చేస్తూ పరువు తగ్గించుకున్న టీడీపీ, జనసేన ఒక జాబితా ప్రకటించినప్పటికీ ఈ అయోమయం మాత్రం మరింత పెరుగుతున్నదే గానీ తగ్గడం లేదని తేలిపోయింది. ఈ అవకాశవాద విన్యాసాలు పదవీ కాంక్షల పల్టీలు, మేకపోతు గాంభీర్యాలు, గోడ దూకుళ్లు, రంగు మార్పిళ్లతో ప్రజల ప్రయోజనాలు, ప్రజాస్వామ్య లౌకిక విలువల పరిరక్షణ ఎలాగన్నదే ఎప్పుడూ కీలక ప్రశ్న. ఆ దిశలో లభిస్తున్న పరిణామాలు సమాచారాలు ఎలా ఉన్నాయన్నది ఒకసారి తేరిపారచూడాల్సి వుంటుంది.

## ఏపీలో చర్చలు, దేశంలోనూ మార్పులు

ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆహ్వానంపై ఉభయ కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు విడివిడిగా సమావేశమై సమిష్టిగానూ చర్చించి కలసి పనిచేయాలని నిర్ణయించుకున్నాయి. అదేవిధంగా ఎన్నికలలోనూ బీజేపీకి దాని అనుకూల పార్టీలకూ వ్యతిరేకంగా పోరాడాలని ప్రాథమికంగా అంగీకరించాయి. త్వరలోనే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఏపీకి వస్తుండటం ఈ క్రమంలో భాగమే. షర్మిల కాంగ్రెస్ ప్రవేశం నాటి నుంచి కేవలం అన్నాచెల్లెళ్ల తగాదాగా చూపించడమే టీడీపీ అనుకూల మీడియాలో ప్రధానంగా జరిగింది. మరో వైపున వైసీపీ అనుకూల మీడియా కూడా ఆమెను చంద్రబాబు పథకం మేరకు పనిచేసే నేతగానే చిత్రించింది. అయితే కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఆమె టీడీపీతో కలసి వెళ్లడం కుదిరేపని కాదని అందరికీ తెలుసు. జాతీయ స్థాయిలో 'ఇండియా' వేదికలో పాలు పంచుకుంటూ బీజేపీపై పోరాటంలో ముఖ్యపాత్ర వహించవలసిన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆ పనిచేయడం సాధ్యం కాదనీ తెలుసు. నాటకీయమైన సంచలనాల కోసం మొదట్లో మీడియా అలాటి అంశాలపై కేంద్రీకరించినా నెల గడిచేసరికి కాంగ్రెస్ నేతలు వామపక్షాలతో కలసి మతతత్వ నిరంకుశ రాజకీయాలపై పోరాటంలో కలసిరాక తప్పలేదు. 20వ తేదీన విజయవాడలో జరిగిన సదస్సులో పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పాల్గొనడం, ఆ తర్వాత కమ్యూనిస్టు నాయకులు కాంగ్రెస్ కార్యాలయానికి వెళ్లి చర్చలు జరిపి భవిష్యత్ ప్రణాళిక పంచుకోవడం సంభవించింది. ఈ విధంగా ఏపీలో ఒక కొత్త రాజకీయ కూటమికి రంగం సిద్ధమైంది. ఇదే సమయంలో దేశ వ్యాపితంగానూ ఇండియా భాగస్వాముల సీట్ల సర్దుబాట్లు ఒక కొలిక్కి వస్తుండడం గమనించదగ్గది. కావాలని ఈ కూటమి పాత్రను తక్కువ చేసేందుకు చాలా ప్రయత్నాలే జరిగాయి. బీహార్‌లో అవకాశవాద యూటర్న్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఇండియా నుంచి వైదొలగడం పెద్ద పరిణామంగా ప్రచారమైంది. అదే సమయంలో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌ను ఈడీ అరెస్టు చేసి సంక్షోభం సృష్టించింది. ఆ ప్రభుత్వం కూలిపోతుందని బీహార్‌లోనూ ఎన్‌డీఏ పెరిగిపోతుందని అంచనా వేశారు. అయితే జరిగింది వేరు. బీహార్‌లో నితీశ్ ఒంటరిపాటై బీజేపీ చక్రబంధంలో చిక్కుకుపోగా ఆర్జేడి నేత తేజస్వి యాదవ్ నిలదొక్కుకున్నారు. ఇండియా కూటమి బలంగా కొనసాగింది. ఇక జార్ఖండ్‌లో కొత్త ముఖ్యమంత్రి బల నిరూపణ చేసుకున్నారు. ఇవి బీజేపీ ఆశించిన దానికి భిన్నం. బీహార్ పరిణామాల తర్వాత ఇండియాకు ఊపు తగ్గిపోతుందనుకున్నారు. ఇండియా టు డేలో రాజ్‌దీప్ సర్దేశాయి, ఎన్‌డీ టీవీలో రాహుల్ కునాల్ వంటివారు అదే చిత్రణ ఇచ్చారు. కానీ ఆప్, కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ వంటివి వాస్తవాలు గ్రహించి సర్దుబాటు దిశలో అడుగులు వేశారు. ఇప్పుడు చూస్తే ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలలోనూ ఆప్ 4, కాంగ్రెస్ 3 పోటీ చేయాలని అవగాహనకు వచ్చారు. ఆప్ బలం పెంచుకున్న గుజరాత్‌లోనూ ఇరు పార్టీలు కలసి వ్యవహరించాలని అంగీకారానికి వచ్చాయి. ఇక యూపీలో ఎస్‌పీ నేతలు కాంగ్రెస్‌ల మధ్య చెడిపోయినట్టేనని ఊదరగొట్టిన కథనాలు వెనక్కుపోయి 17 స్థానాలు కాంగ్రెస్‌కు కేటాయిస్తూ అవగాహన కుదిరింది. రాహుల్‌గాంధీ న్యాయయాత్రకు అఖిలేశ్ యాదవ్ హాజరయ్యారు. అదే సమయంలో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ఎస్‌పీకి ఒక సీటు ఇస్తున్నది. ఇది మొన్నటి అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితికి పూర్తిభిన్నం. కాకపోగా బెంగాల్‌లో మాత్రం మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్‌తోనూ కాంగ్రెస్‌కు

అవగాహన పెరిగిందని చెబుతున్నా మళ్లీ తామే మొత్తం 42 పోటీ చేస్తామని వారి నాయకుడు వివేక్ డేబ్రియన్ చెబుతున్నారు. సీపీఐ(ఎం) వరకూ తృణమూల్‌తో పొత్తు వద్దని పోరాటమే జరగాలని చెబుతున్నందున ఈ ప్రభావం పెద్ద లెక్కలోది కాదు. మరో పెద్ద రాష్ట్రమైన మహారాష్ట్రలోనూ ఎన్ని చీలికలు తెచ్చినా ఇండియా పార్టీలు సర్దుబాటు దిశలోనే వున్నాయి. హర్యానా, గోవాలలోనూ సర్దుబాట్లు జరగొచ్చు.

### ఎదురు దెబ్బలతో కక్ష సాధింపు

అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్టకుతోడు తానే పెద్ద బీసీనంటూ బీసీ వాదం తీసుకొచ్చారు. అంతకుముందు కాలంలో మండల్ వర్సెస్ కమండల్ అని బీజేపీని అపహాస్యం చేసేవారు. ఈ సారి అలా జరగకుండా తనే మండల్ కమండల్ కూడా తీసుకునేందుకు ప్రయత్నించింది. మార్కెట్ శక్తులను సంతోషపెట్టడం, ముస్లింలకు వేరే ప్రత్యామ్నాయం లేదన్న వాతావరణం కల్పించి తిప్పుకోవడం సంఘ పరివార్ ఎజెండాలో పెట్టుకుంది. అయితే వరుసగా జరిగిన పరిణామాలు ఆ ప్రయత్నాలను వమ్ముచేశాయి. పైగా ఎన్నికల బాండ్లను సుప్రీంకోర్టు కొట్టివేయడం నైతికంగా దెబ్బతీసింది. బరితెగించి ఆ తీర్పుకు బీజేపీ వ్యతిరేక వ్యాఖ్యలు చేసినా ఎవరూ ఆమోదించకపోవడంతో వెనక్కు తగ్గింది. పులి మీద పుట్రలా చంఢఘర్‌లో మేయర్ ఎన్నిక రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇవన్నీ భరించలేని మోడీ కృష్ణుడికి కుచేలుడు అటుకులు ఇచ్చినా లంచం అంటారని చమత్కార వికారం చేశారు. దృష్టి మళ్లించడం కోసం కాంగ్రెస్ ఖాతాలు స్తంభింపచేయడం, ఏకపక్షంగా ఆదాయ పన్ను కింద రూ.67 కోట్లు విత్‌డ్రా చేయడం అన్నీ కక్ష సాధింపులే. కానీ ఈ సమయంలోనే రైతాంగ ఆందోళనపై కాల్పులలో ఒకరు మరణించడం విమర్శలకు దారితీసింది. మీడియా రాహుల్ గాంధీకి సంబంధించి ఏదో ఒక విషయాన్ని పెద్దది చేసి దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తుంటే స్వయంగా మోడీనే వాటిని అందిపుచ్చుకుంటున్నారు. అయోధ్య మందిరం దగ్గర ఐశ్వర్యరాయ్, అమితాబ్ బచ్చన్ వంటి పెద్ద వారికి తప్ప పేదలకు ప్రాధాన్యత లేదని రాహుల్ అంటే దాన్ని మహిళల కోణంలోకి మళ్లించారు. కర్నాటకలో ఆలయాలపై పన్ను వేశారని మరో దుమారం లేవదీశారు. కేరళ ప్రభుత్వంపైనా అనేక విధాలైన కతలు ప్రచారంలో పెట్టారు. ఈ ప్రచారాలకు తోడు ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి సివిల్ కోడ్, అస్సాంలో ముస్లిం వ్యతిరేక శాసనాలు మత వివాదాలను పెంచే ప్రయత్నాలుగా మొదలైనవే. రాబోయే రోజులలో ఈ పోకడలు పెరిగేవే.

### ఏపీ, తెలంగాణల్లో జరగాల్సింది..

ఇన్ని విధాలుగా రాజ్యాంగ వ్యతిరేక అప్రజాస్వామిక మతతత్వ చర్యలకు పాల్పడుతున్న బీజేపీకి, దానికి మద్దతిచ్చే పార్టీలకూ వ్యతిరేకంగా పోరాడాలని వామపక్షాలు చర్యలు ప్రారంభించాయి. తెలంగాణలోనూ ఒక లోక్‌సభ సీటులో పోటీ చేయాలని, మిగిలిన చోట్ల ఇండియా వేదిక భాగస్వాములకు మద్దతివ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర ప్లీనరీ నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీపై పోరాడాలని కూడా బి.వి.రాఘవులు సూచించారు. తమకు ఒక స్థానం కేటాయించాలని సీపీఐ నేత నారాయణ కోరారు. ఈ విధంగా తెలుగు రాష్ట్రాలలో బీజేపీని ఓడించే పోరాటం తీవ్రం చేయాలని ప్రయత్నాలు జరుగుతుంటే మరోవైపున మోడీ పాలనపై పోరాడవలసిందిపోయి బీజేపీకి వంతపాడటానికే సిద్ధమయ్యాయి.

ఏపీలో మూడు ప్రాంతీయ పార్టీలు, ముఖ్యమంత్రి జగన్ పార్లమెంటులో వారి సభ్యులు ఎప్పుడూ బీజేపీ మద్దతునిస్తూ వచ్చారు. తెలుగుదేశం కూడా ఇందుకు భిన్నం కాదు. ఈ సారి ఎన్నికలలో జగన్‌ను ఓడించేందు కోసం బీజేపీతో కలిసి పోటీ చేయాలని టీడీపీ, జనసేన నిర్ణయానికి వచ్చాయి. జనసేన ఎన్‌డీఏ కూటమిలో భాగస్వామిగా వుంది కూడా. టీడీపీ అధినేత చంద్రబాబు అమిత్ షాతో చర్చలు జరిపి వచ్చారనీ, తమ మధ్య పొత్తు వుంటుందని ఈ పార్టీ నాయకులు చెబుతూ వచ్చారు. ఏపీకి సంబంధించినంత వరకూ ప్రత్యేకహోదా, అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు, లోటు భర్తీ వంటి అనేక విషయాల్లో మోడీ సర్కారు అన్యాయం చేయడం వారికి సమస్యగా కనిపించదు. అయితే ఈ విషయంలో బీజేపీ మాత్రం రకరకాలుగా మాట్లాడుతూ రాజకీయ చెలగాటమాడుతున్నది. తామెంత పాకులాడినా బీజేపీ నుంచి స్పందన లేకపోవడంతో ఈ రోజు జనసేన టీడీపీ ప్రధాన ఎన్నికల జాబితా ప్రకటించాయి. 24 సీట్లలో జనసేన పోటీ అంటూ అయిదు సీట్లు ప్రకటించగా టీడీపీ 94 స్థానాలలో అభ్యర్థులను ప్రకటించింది. అయితే బీజేపీతో ఏదో చెలిమి కుదిరి పోయిందనే కథనాలపై ఉభయులూ ఇరు రకాలుగా మాట్లాడటం విశేషం, బీజేపీ పెద్దల ఆశీస్సులతో తాము అవగాహనకు వచ్చామని పవన్ అంటే, ఆయన చెప్పినట్టు బీజేపీ పొత్తుకు వస్తే కొన్ని సీట్లు కేటాయిస్తామని చంద్రబాబు అన్నారు. ఉభయులూ కేంద్రం గురించి పల్లెత్తు మాటనకుండా జగన్ సర్కారు తప్పిదాలపైనే ధ్వజమెత్తారు. తమను ఇంత నిర్లక్ష్యం చేసిన బీజేపీతో పొత్తు గురించి ఈ నేతలు ఎలా మాట్లాడుతున్నారో అర్థం కాదు. ఈ రోజు కూడా బీజేపీ నేతలు పురందరేశ్వరి, జీవీఎల్ నరసింహారావులు పొత్తుల విషయమై తమకు ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర, దేశ ఎన్నికల చరిత్రలో పొత్తుల పేరిట ఇంత దయనీయ పరిస్థితిని ఏ పార్టీ ఎదుర్కొని వుండదేమో గానీ టీడీపీ, జనసేన కోరి కోరి బీజేపీ చుట్టూ పరిభ్రమిస్తున్నాయి.

మిగతా 20వ పేజీలో..

# బీజేపీ నిజానికి ఒక హిందూ వ్యతిరేక పార్టీ

- బండ్ల శ్రీనివాస్,
- నెల్లూరు నరసింహారావు,
- నలమాటి లక్ష్మణరావు

- 1.ఇది ఎన్నికల సమయం. బీజేపీ తన మాకియావెల్లియన్ వ్యూహాల ద్వారా కేంద్రంలో మళ్లీ అధికారాన్ని చేజిక్కించు కోవాలని ప్రయత్నిస్తోంది. "ముస్లింల పట్ల విద్వేషం "రాముడు", "రామరాజ్యం"పై ఆశలు కల్పించడం," నకిలీ విశ్వగురు" నినాదాలను చొప్పించడం ద్వారా హిందువుల ఓట్లను రాబట్టేందుకు కోట్లాది మంది ఉత్తర భారతీయ హిందువుల మనస్సులను బీజేపీ స్వాధీనం చేసుకుంది. నిజానికి, స్వతంత్ర భారతదేశంలో మునుపెన్నడూ చూడని విధంగా బీజేపీ ప్రభుత్వం తన పెట్టుబడిదారీ మిత్రులకు అక్రమ మార్గాలలో సహాయం చేసి సంపన్నులను చేసింది. సమాజంలో అసమానతలను పెంచింది. సామాన్య ప్రజల జీవితాలను, వారి జీవనోపాధిని నాశనం చేసింది. 90 శాతం భారతీయుల, ముఖ్యంగా హిందువుల, జీవితాలను మెరుగు పరచడంలో విఫలమైన బీజేపీ, హిందువుల మతపరమైన మనోభావాలను రెచ్చగొట్టడం ద్వారా 2024 ఎన్నికలలో గెలవాలని ప్రయత్నిస్తోంది.
- 2. ఫాసిస్ట్ మరియు మతతత్వ బీజేపీని తిరిగి రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకోకుండా ఆపాలి. తద్వారా మన దేశాన్ని, ప్రజలను రక్షించడానికి ఇది తగిన సమయం. ప్రతిపక్ష పార్టీలు మరియు పౌర సమాజ సమూహాలు తమ ఎన్నికల ప్రచార సమయంలో పదే పదే హిందుత్వ, రాముడు, మతతత్వం, మత ధ్రువీకరణ మరియు ఫాసిజం గురించి మాట్లాడే అవకాశం ఉంది. కానీ అలాంటి ప్రచారం ఇంకా ఎక్కువ మంది హిందువులను బీజేపీ గుప్పిట్లోకి నెట్టివేయవచ్చు, తద్వారా బీజేపీ రాజకీయ అధికారాన్ని నిలబెట్టుకోవడానికి సహాయపడవచ్చు. అందువలన, హిందుత్వ మరియు రాముడి గురించి మాట్లాడే బదులు, బీజేపీ తనని తాను "హిందూ అనుకూల" పార్టీ అని పైకి చెప్పుకుంటున్నప్పటికీ, బీజేపీ ఒక "హిందూ వ్యతిరేక" పార్టీ అనే నిజమైన దృక్పథాన్ని ప్రజలకు అందించాలి. అందువల్ల, 100 సంవత్సరాలుగా సంఘ్ పరివార్ వ్యాప్తి చేస్తున్న "మత ద్వేషం", "మైనారిటీల, పాకిస్తాన్ల పట్ల భయం" మరియు "హిందుత్వ" అనే విషయాల నుండి చర్చను ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లుగా భారతీయులందరిపై, ముఖ్యంగా 110 కోట్లపై సంఖ్యలో ఉన్న అమాయక హిందువులపై, చేసిన "ఆర్థిక విధ్వంసం" వైపు మార్చాల్సిన అవసరం ఉంది.
- 3. భారతదేశంలో ఆర్థిక అసమానతలపై ఆక్స్ఫామ్ (Oxfam) నివేదిక (2022) ప్రకారం, భారత జనాభాలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్నటువంటి 1% శాతం మంది సంపన్నులు, మన జాతీయ సంపదలో 42.5% కలిగి ఉన్నారు. మొత్తం ఉన్నత స్థానంలో ఉన్న మొదటి 10% మంది, మన జాతీయ సంపదలో 77% కలిగి ఉన్నారు. అయితే, భారతదేశం యొక్క దిగువ 50% ప్రజలు మాత్రం, మన జాతీయ సంపదలో కేవలం 2.8% మాత్రమే కలిగి ఉన్నారు. గత ఏడాదిలో, ఉన్నత స్థానంలో ఉన్న మొదటి 1% మంది ధనికుల యొక్క సంపద 46% పెరగ్గా, దిగువ 50 శాతం మంది సంపద 3% శాతం మాత్రమే పెరిగింది. మిగిలిన 90% భారతీయులను ఆర్థికంగా ఇబ్బంది పెట్టడం ద్వారా, అటువంటి 10% మంది సంపన్నులను మరింత సంపన్నం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం 2014 నుండి కృషి చేస్తోంది. ఈ దుర్మార్గమైన ఆర్థిక విధానాల ద్వారా కూడగట్టుకున్న అపఖ్యాతిని కప్పిపుచ్చడానికి, బీజేపీ 80:20, అంటే దేశ జనాభాలో 80% హిందువులు మరియు 20% మైనారిటీలు, అనే దుర్బుద్ధితో కూడిన ఒక విభజన ఆలోచనతో ముందుకు వచ్చి, ద్వేషం, హింస మరియు చట్టాల ద్వారా దేశాన్ని మతపరంగా విభజించి, అధిక సంఖ్యలో ఉన్న హిందువుల ఓట్లను తమకు అనుకూలంగా రాబట్టేందుకు ప్రయత్నాలు చేస్తోంది. బీజేపీ యొక్క మతతత్వం, ఫాసిజం, చట్టాలు, విధానాలు మరియు నిర్ణయాలు మైనారిటీలను సామాజికంగా, ఆర్థికంగా మరియు రాజకీయంగా నాశనం చేయడమే కాకుండా, బీజేపీ యొక్క పలు చర్యలు దేశ జనాభాలో 80% మంది హిందువులయిన మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, పేద మరియు నిరుపేద ప్రజల ఆర్థిక వ్యవస్థలను, వారి జీవనోపాధిని కూడా నాశనం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఎస్సీల, ఎస్టీల, ఓబీసీల, రైతుల, కార్మికుల, యువత, మహిళల, మరియు వయో వృద్ధుల జీవితాలను బీజేపీ తుంగలో తొక్కింది. గత దశాబ్దంలో హిందువుల (అగ్ర 10% మినహా) జీవితాలను మెరుగుపరిచేందుకు బీజేపీ

కృషి చేస్తున్నట్లుగా చేసే వాదనలు కేవలం అపోహలు మాత్రమే.

**నిజానికి, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అన్ని ప్రభుత్వాల కంటే ఎక్కువ మంది హిందువులను పేదరికంలోకి నెట్టింది బీజేపీ ప్రభుత్వమే. బీజేపీ హిందువుల కోసం పని చేస్తుందని ప్రచారం చేయడం బూటకపు కథనం. ఇది దేశాన్ని, ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేది మరియు హిందువులకే కాదు భారతీయులందరికీ హానికరం.**

బీజేపీ యొక్క ఈ నకిలీ కథనాన్ని ఒకే స్వరంలో తిప్పి కొట్టడానికి, మరియు బీజేపీ ఒక "హిందూ వ్యతిరేక" పార్టీ అని నిరూపించడానికి మనం శక్తివంతమైన మరియు వాస్తవమైన ఒక కథనాన్ని రూపొందించుకోవాలి. బీజేపీ నిజ స్వరూపం గురించి హిందువులందరికీ ప్రత్యేకంగాఉత్తర భారతదేశంలోని హిందువులకు జ్ఞానోదయం చేయడానికి సోషల్ మీడియా ద్వారా ఈ నిజమైన కథనాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి. బీజేపీ ఒక "హిందూ వ్యతిరేక" పార్టీ అనే కథనం క్రింది పంక్తులలో వివరించబడింది:

- 4. జాతీయ ఆస్తులన్నీ వివిధ వర్గాలకు లేదా సమూహాలకు వారి జనాభా శాతం ప్రకారం చెందినవని భావిస్తే, పన్ను చెల్లింపుదారుల ప్రతి 100 రూపాయలలో, జాతీయ ఖనిజాలలో, అటవీ వనరులలో మరియు ప్రజా మౌలిక సదుపాయాల ఆస్తులలో, బీజేపీ ప్రభుత్వం గత దశాబ్దంలో తన చర్యల ద్వారా క్రోనీ కార్పొరేట్లకు అప్పగించిన వాటిలో 80 రూపాయల కంటే లేదా 80% ఆస్తుల కంటే ఎక్కువ హిందువులకు చెందినవని, మరియు 20 రూపాయలు లేదా 20% ఆస్తుల కంటే తక్కువ మైనారిటీలకు చెందినవని అర్థమవుతుంది. భారతదేశంలో మైనారిటీలు వారి జనాభా శాతంతో పోలిస్తే అసమానంగా తక్కువ ఆర్థిక స్థితిని మరియు ఆస్తులను కలిగి ఉన్నారు. దీంతో బీజేపీ ప్రభుత్వ చర్యలు హిందువులకు ఎక్కువ ఆర్థిక నష్టాన్ని కలిగించినట్లు నిరూపించబడుతోంది.
- 5. బీజేపీ ప్రభుత్వ చర్యలయిన "ప్రభుత్వ రంగ సంస్థలను" తక్కువ ధరలకు అన్యాయంగా ప్రైవేటీకరించడం, "ప్రభుత్వ మౌలిక సదుపాయాలను" క్రోనీ క్యాపిటలిస్టులకు తక్కువ ధరలకు లీజుకు ఇవ్వడం వల్ల, ఈ సామాజిక ఆస్తుల్లో 80 శాతం వాటా కలిగియున్న హిందువులకు ఆర్థికంగా భారీ నష్టాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, ప్రధానంగా, ఎస్సీ, ఎస్టీ, ఒబిసిల మరియు ఆర్థికంగా బలహీన వర్గాల ప్రజల ఉపాధిని దెబ్బతీస్తుంది. ఎందుకంటే, అటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను కొనుగోలు చేసే ప్రైవేట్ సంస్థలకు ఉద్యోగాలలో రాజ్యాంగబద్ధంగా నిర్దేశించిన రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత ఉండకపోవచ్చు. తద్వారా ఈ వాటాదారులు తమకు రాజ్యాంగపరంగా ఇవ్వబడిన అర్హతలను కోల్పోతారు. తద్వారా బీజేపీ, మైనారిటీల జీవనోపాధి కంటే హిందూ సమాజానికి చెందినవారి జీవనోపాధినే ఎక్కువగా దెబ్బతీస్తోంది.
- 6. ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి క్రోనీ క్యాపిటలిస్టులు తీసుకున్న రూ.15.4 లక్షల కోట్ల రుణాలను బీజేపీ ప్రభుత్వం మాఫీ చేసింది. ఈ మొత్తాలు దిగువ, మధ్యతరగతి మరియు వేతన జీవులు పొదుపు చేసుకొని బ్యాంకుల్లో దాచుకున్న కష్టార్జితం, మరియు వీరిలో 80% కంటే ఎక్కువ మంది హిందువులు. ఈ విధంగా, బీజేపీ ప్రభుత్వం ధనవంతులను ఆదుకోవడానికి సాధారణ హిందువులను ఆర్థికంగా దెబ్బతీసింది.
- 7. ఈ బీజేపీ ప్రభుత్వం, నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులకు పన్ను చెల్లింపుదారుల వేలాది కోట్ల రూపాయల సొమ్ముతో మూలధనాన్ని సమకూర్చింది. ఆ పన్నుల్లో 80% హిందువుల ద్వారా చెల్లించబడుతుంది. భవిష్యత్తులో కూడా, క్రోనీ క్యాపిటలిస్టులు తీసుకున్న లక్షల కోట్ల రుణాలను మాఫీ చేస్తూ, తద్వారా నష్టపోయిన ప్రభుత్వ రంగ బ్యాంకులకు పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో మూలధనాన్ని సమకూరుస్తూ, పేద మరియు అమాయక హిందువులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేసే ఇదే ధోరణిని బీజేపీ ప్రభుత్వం కొనసాగించవచ్చు.
- 8. బీజేపీ ప్రభుత్వం యొక్క "నోట్ల రద్దు", సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల రంగాన్ని మరియు చిన్న వ్యాపారాలను నాశనం చేసిందిబీ దిగువ, మధ్యతరగతి మరియు పేద ప్రజలు లక్షలాది ఉద్యోగాలు కోల్పోవడానికి దారితీసిందిబీ మరియు వారిని అప్పులపాలు చేసి ఆత్మహత్యలకు ప్రేరేపించింది. వారిలో 80% మంది హిందువులు. అయితే, ఈ ప్రక్రియ వలన "నల్ల ధనం" వెలికి తీయబడలేదని రద్దు చేసిన నోట్లన్నీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకి తిరిగి రావడం వలన నిరూపించబడింది.
- 9. 80% కంటే ఎక్కువ వ్యవసాయ భూమి హిందూ సమాజానికి చెందిన చిన్న మరియు సన్నకారు రైతుల యాజమాన్యంలో ఉంది. మరియు లక్షలాది మంది హిందూ కౌలు రైతులచే సాగు చేయబడుతోంది. బీజేపీ ప్రభుత్వం రూపొందించిన మూడు "నల్ల వ్యవసాయ

చట్టాలు" హిందూ రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టి కార్పొరేట్‌లకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో ఉన్నాయి. పెరిగిన ముడి సరుకుల ఖర్చులు, సరిపోని రుణ సదుపాయాలు, సహాయపడని బీమా పథకం, ప్రకృతి వైపరీత్యాలు మరియు ధరల అస్థిరత మొదలగునవి ఈ హిందూ రైతుల ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి మరియు వారి కుటుంబాల దుస్థితిని మరింతగా దిగజారుస్తున్నాయి.

- 10. బీజేపీ ప్రభుత్వం క్రోనీ క్యాపిటలిస్టులకు ప్రయోజనం చేకూర్చడానికి కార్పొరేట్ పన్నులను 30% నుండి 22%కి తగ్గించి, ప్రభుత్వ ఖజానాకు భారీ పునరావృత ఆదాయ నష్టాన్ని కలిగించింది. అయినప్పటికీ, వారు అదనపు పెట్టుబడికి లేదా కొత్త ఉద్యోగాల కల్పనకు తోడ్పడలేదు. తద్వారా, సామాన్యులకు బహుళ రంగాలలో తీవ్రమైన ఎదురుదెబ్బ తగిలింది. వీరిలో కనీసం 80% మంది హిందువులు.
- 11. ఈ బీజేపీ ప్రభుత్వం, అత్యంత పేద ప్రజలు ఉపయోగించుకునే వస్తువులను మరియు సేవలను కూడా GST పరిధిలోకి తీసుకురావడమే కాకుండా, GSTని పెద్ద ఎత్తున పెంచి ప్రజలకు భారీ ఆర్థిక ఇబ్బందులను కలిగించింది. వీరిలో 80% మంది హిందువులు అని వేరుగా చెప్పనవసరం లేదు.
- 12. బీజేపీ ప్రభుత్వం ఆరోగ్యం మరియు విద్యా రంగాలను విస్మరించింది మరియు MGNREGA వంటి పేదల అనుకూల పథకాలకు నిధులను తగ్గించింది. తద్వారా సామాన్య ప్రజలలో 80% అయిన హిందువులకు తీవ్ర హాని చేసింది. కొత్త లేబర్ కోడ్‌లను అమలు చేయడం ద్వారా పారిశ్రామికవేత్తలకు సహాయం చేసి, కార్మికులకు హాని కలిగించింది. వీరిలో 80% మంది హిందువులు. ఈ ప్రభుత్వం యొక్క అనేక ఇతర విధానాలు వృద్ధులకు, మహిళలకు, విద్యార్థులకు మరియు యువతకు ఎంతో హాని కలిగించాయి. వీరిలో కూడా 80% మంది హిందువులే. నిత్యావసర వస్తువులైన కిరాణా, ఇంధనం, గ్యాస్ మరియు వివిధ సేవల ధరల పెరుగుదల సమాజంలోని మధ్య, దిగువ మరియు పేద వర్గాలను తీవ్రంగా దెబ్బతీసింది, తద్వారా ప్రధానంగా హిందువుల రోజువారీ జీవితాలను మరియు మైనారిటీల జీవితాలను కూడా అస్థిరపరిచింది. మైనారిటీలు, దళిత మహిళలపై జరుగుతున్న నేరాలు వారికి ఎనలేని అవమానాన్ని, బాధను మరియు భయాన్ని కలిగిస్తున్నాయి. ధనవంతులకు బీజేపీ చేసిన ఉపకారాల జాబితా మరియు భారతీయులందరికీ బీజేపీ చేసిన హాని, ముఖ్యంగా మెజారిటీ హిందూ సమాజానికి చేసిన ఆర్థిక నష్టం, దిగ్భ్రాంతికరమైనది మరియు అంతులేనిది.
- 13. ఈ విధంగా, బీజేపీ ఒక "హిందూ వ్యతిరేక" పార్టీ, ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల వ్యతిరేక, మధ్యతరగతి మరియు దిగువ తరగతుల వ్యతిరేక, పేద, మహిళా, యువజన, వృద్ధుల వ్యతిరేక, మరియు "మైనారిటీ వ్యతిరేక" పార్టీ కూడా. మరింత ముఖ్యంగా, బీజేపీ ఒక ధనిక మరియు కార్పొరేట్ అనుకూల పార్టీ అయితే, బీజేపీ ప్రపంచానికి మరియు దేశవాసులకు తమ పార్టీ "హిందూ అనుకూల పార్టీ" అని చెప్పుకుంటోంది. ఈ నేపథ్యంలో, హిందువులు మాత్రమే అధికారంలో ఉన్న ఈ పార్టీ (బీజేపీలో ముస్లింలు అధికారంలో లేరు) హిందువులకే అపారమైన హానిని కలిగిస్తున్న విషయం దిగ్భ్రాంతికరంబీ తద్వారా, బీజేపీ ఒక "హిందూ వ్యతిరేక" పార్టీ అని నిస్సందేహంగా నిర్ధారించబడింది.
- 14. అందువల్ల, బీజేపీ యొక్క "తప్పుడు కథనాలను", మతం మరియు కులంతో సంబంధం లేకుండా, మనమందరం సత్వరమే ఎదుర్కొని మన తోటి భారతీయులందరినీ రక్షించాల్సిన అవసరం ఎంతో ఉంది. విద్యావంతులు, మేధావులు, దేశభక్తులు, పౌర సమాజ సమూహాలు మరియు ప్రజలకు జవాబుదారీగా ఉండవలసిన ప్రతిపక్ష పార్టీలు, భారీ ప్రచారం ద్వారా బీజేపీ యొక్క నిరంకుశపాలన గురించి అమాయక హిందువులకు తెలియపరచడం తమ బాధ్యతగా స్వీకరించాలి.

మనం రూపొందించిన నిజమైన కథనాన్ని అందుబాటులో ఉన్న ప్రతి ఛానెల్ ద్వారా దేశవ్యాప్తంగా వ్యాపింపచేయాలి. తద్వారా, ఈ ప్రయత్నాలు సామాన్య హిందువులలో ఆలోచనను రేకెత్తించడానికి, బీజేపీ యొక్క తప్పుడు కథనాన్ని విజయవంతంగా సవాలు చేయడానికి, మరియు రాబోయే ఎన్నికలలో బీజేపీని ఓడించడానికి దోహదపడతాయి. 1984లో జార్జ్ ఆర్వెల్ చిత్రీకరించినట్లుగా మన ప్రియమైన భారతదేశం "డిస్టోపియన్ సమాజంగా" మారకుండా చూసుకుందాం. మనం ఇప్పుడు గెలవకపోతే ఇంక ఎప్పటికీ గెలవలేమేమో అనే స్ఫూర్తితో ఈ ప్రయత్నాన్ని ముందుకు తీసుకువెళదాం. ఐక్యంగా ఉంటే మనం గెలుస్తాం. విడిపోతే మనం ఓడిపోతాం. కాబట్టి, ఫాసిజానికి మరియు మతతత్వానికి వ్యతిరేకంగా ఒక శక్తివంతమైన మరియు సత్యమైన కథనం ద్వారా మన భారతీయులందరమూ కలిసి పోరాడుదాం, మన దేశాన్ని మరియు మన ప్రజలను కాపాడుకుందాం. ❑

# ఫ్రెంచ్ పాత్రికేయురాలి కన్నీటి నిష్క్రమణ



- వనెసా డౌనక్

భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉండడమే ప్రజాస్వామ్యం. భారత ప్రభుత్వం ఒక ఫ్రెంచ్ పాత్రికేయురాలికి ఈ స్వేచ్ఛను నిరాకరించింది. ఈ దేశం నుంచి వెళ్లిపోవలసిన అగత్యాన్ని కల్పించింది. పలు ఫ్రెంచ్ మీడియా సంస్థల దక్షిణాసియా ప్రతినిధిగా మన దేశం నుంచి పనిచేస్తున్న వనెసా డౌనక్ స్వదేశానికి వెళ్లిపోయారు. తన ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం పత్రికా స్వేచ్ఛను అణచివేసేందుకు రాజ్య వ్యవస్థ కృతనిశ్చయంతో ఉన్నదని వనెసా ఉదంతం స్పష్టం చేసింది. ఆమె 25 సంవత్సరాల క్రితం ఒక విద్యార్థినిగా మన దేశానికి వచ్చి, భారతీయుడైన సహపాఠిని ప్రేమించి, పెళ్లి చేసుకున్నారు. కుమారుడిని భారతీయ పౌరుడుగా తీర్చిదిద్దుతున్నారు. జీవనోపాధికి పాత్రికేయ వృత్తిని చేపట్టి స్వదేశానికి తిరిగి వెళ్లిపోయేంత వరకు అదే వృత్తిలో కొనసాగారు. సత్యనిష్ఠతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించారు. ఆ నిబద్ధతవల్లే, ఇప్పుడు తాను ప్రేమించే దేశానికి, సొంత కుటుంబానికి దూరమవాల్సి వచ్చింది.

తన వృత్తి నిర్వహణలో భాగంగా ఆమె మానవ హక్కులు, దేశీయ రాజకీయాలు, గ్రామీణ భారతంలో మావోయిస్టుల పార్టీ కార్యకలాపాల గురించి వివిధ ఫ్రెంచ్ పత్రికలకు వార్తా కథనాలు రాశారు. కరోనా మహమ్మారి దేశాన్ని కుదిపేస్తున్నప్పుడు ప్రభుత్వం తీరు, గంగా నదిలో మృతదేహాలు ఇత్యాది పలు పరిణామాలను లోతుగా విశ్లేషించారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు సంబంధించిన వివిధ హింసాత్మక ఘటనలను నివేదించారు. ఈ కథనాలు భారత్‌కు, హిందూ మతానికి వ్యతిరేకంగా ఉన్నాయని అధికార వర్గాలు అభిప్రాయపడ్డాయి.

ఒక భారతీయ పౌరుడి సతీమణిగా ఆమెకు భారత్‌లో శాశ్వత నివాసానికి హక్కునిచ్చే 'ఓవర్సీస్ సిటిజెన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఒసిఐ) కార్డు ఉన్నది. 2022 సెప్టెంబర్‌లో భారత ప్రభుత్వం వనెసాకు జర్నలిజం పర్మిట్ రద్దు చేసింది. ఒఐసి కార్డు ఉపసంహరణకు నిర్ణయించినట్టు హోం మంత్రిత్వ శాఖ జనవరి 24న నోటీస్ ఇచ్చింది. ఆమె పాత్రికేయ కార్యకలాపాలు 'ద్రోహ చింత'తో ప్రభావితమవుతున్నాయని, అవి భారత్ పట్ల వ్యతిరేక అభిప్రాయాన్ని కలిగించే విధంగా ఉంటున్నాయని హోంశాఖ ఆరోపించింది. ఈ ఆరోపణలకు సమాధానం ఇచ్చేందుకు ఫిబ్రవరి 2 వరకు గడువు ఇస్తున్నట్టు నోటీస్‌లో పేర్కొన్నారు. 1955 భారత పౌరసత్వ చట్టం నిర్దేశించిన విధంగా ప్రత్యేక అనుమతి తీసుకోకుండా పాత్రికేయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు, ఆ నిబంధనలను ఉల్లంఘించినట్టు ఆ నోటీస్ ఆరోపించింది. ఈ ఆరోపణలను వనెసా ఖండించారు. ఇవన్నీ ఎలాంటి రుజువులు లేని ఆరోపణలని శుక్రవారం నాడు స్వదేశానికి వెళ్లిపోతూ జారీ చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వృత్తిని మార్చుకోవాలని హోం శాఖ అధికారులు గతంలో ఇచ్చిన సలహా తనకు ఆమోదయోగ్యం కాదని, నిరూపించని ఆరోపణల కారణంగా తనకు ఇష్టపూర్వకమైన పాత్రికేయ వృత్తిని త్యజించేందుకు సిద్ధంగా లేనని, బలవంతంగా దేశాన్ని విడిచిపోవలసివస్తున్నదని ఆ సుదీర్ఘ వీడ్కోలు ప్రకటనలో ఆమె తెలిపారు.

### భారత్ నా ఇల్లు

**బాధాతప్త హృదయంతో, కన్నీటితో ఈ మాటలు రాస్తున్నాను. ఈ రోజు భారత్ వదిలి వెళ్లిపోతున్నాను. పాతికేళ్ళ క్రితం ఒక విద్యార్థిగా ఈ దేశానికి వచ్చాను. 23 సంవత్సరాలు ఈ దేశంలోనే పాత్రికేయురాలుగా పని చేశాను. ఈ దేశ పౌరుడినే వివాహం చేసుకున్నాను. నా కుమారుడిని ఇక్కడే పెంచాను. నేను నా ఇల్లుగా భావించిన దేశమిది. అయినా ఈ దేశాన్ని విడిచి వెడుతున్నాను. ఈ నిష్క్రమణ నా నిర్ణయం కాదు. ఈ దేశాన్ని వదిలిపోయేలా భారత ప్రభుత్వం నన్ను బలవంతపెట్టింది.**

పాత్రికేయురాలుగా పనిచేసేందుకు నాకున్న హక్కును పదహారు నెలల క్రితం హోం మంత్రిత్వ శాఖ నిరాకరించింది. ఎందుకు నిరాకరిస్తున్నదీ కారణాలు తెలుపలేదు. న్యాయ సమర్థనలను చూపలేదు. నా విన్నపాలను విననేలేదు. ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్హేతుక చర్యపై పునరాలోచించాలని, కనీసం వివరణ ఇవ్వాలని నేను పదే పదే చేసిన అభ్యర్థనలకు హోం మంత్రిత్వ శాఖ ఒక్కసారీ ప్రతిస్పందించలేదు. గత నెలలో నాకు ఒక నోటీస్ పంపారు. నా వ్యాసాలు 'ద్వేషపూరితం'గా ఉంటున్నాయని, భారత సార్వభౌమికతకు, సమగ్రతకు హాని చేస్తున్నాయని అందులో ఆరోపించారు. ఒక భారతీయ పౌరుడి సతీమణిగా నాకు గల 'ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్

ఇండియా' (ఒసిఐ) కార్డు ఎందుకు రద్దు చేయకూడదో నిర్దిష్ట గడువులోగా తెలపాలని పేర్కొన్నారు. నా వ్యాసాలు ఉపద్రవం కలిగించేవిగాను, శాంతిని భగ్నం చేసేవిగాను ఉన్నాయని కూడా ఆ నోటీస్ ఆరోపించింది.

భారత ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఈ దేశంపై దురభిప్రాయాలు కలిగిస్తున్నానని నాపై అన్యాయంగా ఆరోపణలు చేశారు. భారత్‌లో ఇక నివసించలేనని, నా జీవనభృతిని ఆర్జించుకోలేనని స్పష్టమయింది. ఈ ఆరోపణలకు వ్యతిరేకంగా శాసన విహితమైన సంస్థలలో నేను పోరాడుతున్నాను. న్యాయప్రక్రియలో నాకు సంపూర్ణ విశ్వాసమున్నది. అయితే ఆ ప్రక్రియ తుది ఫలితం వెలువడే దాకా నేను వేచివుండలేను. నా ఒసిఐ హోదా మీద విచారణ కార్యకలాపాలు నన్ను కలవరపరుస్తున్నాయి. ఒసిఐ కార్డు ఉన్న పాత్రికేయుల్లో, ఇతరుల్లో 'అసమ్మతి'ని అణచివేసేందుకు భారత ప్రభుత్వం విస్తృత స్థాయిలో చేస్తున్న ప్రయత్నంలో భాగంగా ఈ విచారణ సాగుతోందని నేను భావిస్తున్నాను. అధికారులు గతంలో నా వృత్తిని మార్చుకోవాలని నాకు సూచించారు. అయితే నేను ఒక జర్నలిస్టును. ఇది నాకు ఎంతో ప్రియమైన వృత్తి. రుజువులు లేని ఆరోపణల కారణంగా ఈ వృత్తిని త్యజించేందుకు నేను అంగీకరించను. నాకు ఎదురైన సమస్యకు స్పందించి నాకు మద్దతు తెలిపిన పాత్రికేయ ప్రపంచ సహచరులు, స్నేహితులు, ఇతరులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

భారత్‌లో ఒక జర్నలిస్టుగా నేను గడిపిన అసాధారణ 23 సంవత్సరాలకు అమితంగా కృతజ్ఞురాలిని. సాహసాలు, సమున్నత పరస్పర సంబంధాలతో నిండిన జీవితాన్ని నేను భారత ఉపఖండమంతటా గడిపాను. రెండు దశాబ్దాల భారత చరిత్రకు సాక్షిగా ఉండే అవకాశం నాకు లభించింది. భారత్‌లో ఒక విదేశీ పాత్రికేయురాలుగా ఈ దేశ సంకీర్ణతను, సమున్నత సంస్కృతిని నా ఫ్రెంచ్ పాఠకులతో పంచుకోవడానికి ప్రయత్నించాను. ఇది నాకు సమకూరిన ఒక ప్రత్యేక హక్కు, గౌరవం. భారత ప్రజల ఆదరం, ఔదార్య స్మృతులను, ఈ భూమి నాలో కలిగించిన సౌందర్యానుభూతి స్మృతులను నా మనసులో భద్రంగా నిలుపుకుంటాను. ఢిల్లీ నాకు ప్రియాతి ప్రియమైన నగరం. ఇక్కడే నా జీవితంలో సింహభాగం గడిచింది. ఇప్పుడు దానికి వీడ్కోలు చెప్పవలసిరావడం నాకు అంతులేని విచారాన్ని కలిగిస్తోంది. ఏదో ఒక రోజు నేను మళ్లీ భారత్ తిరిగి రాగలుగుతాననే ఆశ నాకు ఉన్నది. ❑

# దైవ ఉన్మాదం కాదు.. ప్రజాస్వామ్య పరివ్యాప్తి జరగాలి

**(15వ పేజీ తరువాయి)**

ఆధారంగా వ్యవహరించండి." ఇది కేవలం ముగింపు వాక్యం కాదు. ఒక హెచ్చరిక. రాజ్యం, రాజ్యాంగం, మొత్తం సమాజం (అన్ని మతాలు, వర్గాలు, కులాలు, లింగాలు) రాముడి ఆధారంగా, కేంద్రంగా నడవాలట. అంటే దేశంలో ఉన్న బహుళ జాతులు, మతాలు, రాజకీయ విశ్వాసాలు అన్నీ రాముడి పేరిట జరిగే బ్రాహ్మణీయ హిందుత్వానికి లొంగి బతకాలని ఒక హెచ్చరిక చేస్తున్నారు. అమెరికాలో హిందూ ఫోబియాకు వ్యతిరేకంగా హిందువుల మానవ హక్కుల గురించి మాట్లాడే వంశీ జూలూరి దేశంలో మాత్రం బ్రాహ్మణీయ హిందుత్వ పెత్తనం కొనసాగాలని కోరుకుంటున్నారు. ఇక్కడ అన్ని ఇతర మతాల, జాతుల హక్కులను రాముడి సాక్షిగా విస్మరిస్తున్నారు.

కాని జూలూరి వారికి రాముడి మీద ఉన్నంత పట్టు ప్రజల మీద, ప్రజా ఉద్యమాల మీద లేనట్లున్నది. రామ జపం చేసుకునే గాంధీని చంపిన హిందుత్వ శక్తులు రాముడి పేరిట ఎన్ని కుట్రలు చేసినా వాటిని తప్పక గుర్తిస్తారు. ఎదిరిస్తారు. రేపు ప్రజలకు మరో దారి ఉండేలా లేదు. ముఖ్యంగా తెలుగు నేల మీద ప్రజా చరిత్ర ఇదే చెబుతుంది. అందుకే దైవం పేరిట పెట్రేగుతున్న ఉన్మాదం పోయి, ప్రజాస్వామ్యం పరివ్యాప్తి తప్పక జరుగుతుంది. ఈరోజు కాకపోతే, రేపు. ❑

# ఇటు లౌకిక వేదికలు.. అటు బీజేపీ పాచికలు

**(15వ పేజీ తరువాయి)**

మొత్తం పైన మూడు ప్రాంతీయ పార్టీలూ మోడీ భజన చేస్తున్న సమయంలో ఏపీ ప్రజలు వారికి గుణపాఠం నేర్పవలసిన అగత్యమేర్పడింది. తెలంగాణలోనూ బీఆర్ఎస్, బీజేపీకి అనుకూలమనే ప్రచారం తిరస్కరణకు దారితీసింది. మరి ఈ సమయంలోనైనా వారు మత రాజకీయాలకు వ్యతిరేకంగా కచ్చితంగా ముందుకు రావడం లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తమ మధ్య తగాదాలలో మునిగితేలుతూ బీజేపీపై పోరాటం అవసరాన్ని విస్మరిస్తున్నాయి. దాన్ని అవకాశంగా తీసుకుని బీజేపీ ఎంఎల్‌సి కవితకు సీబీఐ నోటీసులు పంపడం, కాంగ్రెస్ నేతలపై దాడులు వంటి పనులు చేయిస్తున్నది. విభజన సమస్యల పరిష్కారం చేయకుండా తగాదాలు పెంచుతున్నది. దేశవ్యాపితంగా లౌకిక పార్టీలు ఇండియా వేదికపై కలసి పోరాడుతున్న తీరు తెలుగు రాష్ట్రాల్లోనూ శక్తివంతంగా అమలు చేయవలసి వుంది. తాజా పరిణామాలు ఆ విధమైన ఆశాభావం కలిగిస్తున్నాయి. హెచ్చరికా చేస్తున్నాయి. ❑

# భారతదేశంలో తత్వశాస్త్ర పరిణామం

- టి.రవిచంద్

"తాత్విక పరిశీలనకు ప్రాథమికావసరం
నిర్భయమైన స్వతంత్ర బుద్ధి"

- కారల్ మార్క్స్

"ఎవల్యూషన్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ ఇండియా (భారత దేశంలో తత్వశాస్త్ర పరిణామం) అనే గ్రంథం సమకాలిక భారతీయ తత్వవేత్త శ్రీకొత్త సచ్చిదానందమూర్తి ముఖ్యమైన దార్శనిక గ్రంథాల్లో ఒకటి. దీన్ని 1952వ సంవత్సరంలో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ఉపన్యాసకుడు, లెక్చరర్‌గా పనిచేస్తున్న సమ యంలో రచించారు. ఈ గ్రంథ రచన తర్వాత ఆయన అనేక దార్శనిక శాస్త్ర గ్రంథాలు వెలువరించారు. తత్వశాస్త్ర రంగంలో జాతీయ, అంతర్జాతీయ వేదికల్లో ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించారు. 1938వ సంవత్సరం నుండి ఆయన గ్రంథ రచన చేస్తూనే ఉన్నారు. పధ్నాలుగేళ్ళ వయస్సులో ఆయన రాసిన "హనుమద్విజయం' పుస్తకానికి భావవిప్లవ యోధుడు శ్రీ త్రిపురనేని రామస్వామి ముందు మాట రాశారు. యువకుడిగా వున్న రోజుల్లోనే 1939-40 మధ్య కాలంలో భగవద్గీతను సంస్కృతం నుండి తెలుగులోకి అనువాదం చేసి, దానికి వివరణ రాశారు. అతిచిన్న వయస్సులో "భగవద్గీత" వంటి మత, దార్శనిక గ్రంథాన్ని సాంప్రదాయేతర కుటుంబంలో జన్మించిన యువకుడు సంస్కృతం నుండి అనువదించి, వ్యాఖ్యానించడం సామాన్యమైన విషయం కాదు. అది 1941లో ప్రచురించబడింది. ఆచార్య సచ్చిదానందమూర్తికి భారతీయ సాంప్రదాయంపై ఎంత గౌరవం వుండేదో, అదే సమయంలో దానిలోని మానవ గౌరవాన్ని, ఔన్నత్యాన్ని కించపరిచే, భంగపరిచే విషయాలపై అంత తీవ్ర వ్యతిరేకత వుండేది.



ఆచార్య సచ్చిదానందమూర్తి

భగవద్గీతలోని అతిభౌతికశాస్త్రం అనుకూలాత్మకమైనదే కాకుండా కర్మవాదానికి సన్నిహితమైనదని ఆయన ఆనాడు భావించారు. ఈ వ్యాఖ్యానాన్ని కాశీ కృష్ణాచార్య లాంటి సంస్కృత పండితుడు "గొప్ప ప్రయోజనకరమైన, మౌలిక వ్యాఖ్యానం"గా ప్రశంసించారు. 'ఎవల్యూషన్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ ఇండియా" గ్రంథాన్ని ఇరవయి ఎనిమిదేళ్ళ వయస్సులో రచించారు. ఇంత చిన్న వయస్సులోనే ఇటువంటి రచనలు చేయడం వల్లనే ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సి.ఆర్.రెడ్డి ఆచార్య సచ్చిదానంద మూర్తిని "మన అసాధారణ బాలమేధావుల్లో ఈయన ఒకరు" (He is one of our child prodigies) అన్నారు. కేవలం తత్వవేత్తగా దార్శనిక విషయాలకే పరిమితమవకుండా ఆయన అనేకశాస్త్ర విషయాల్లో ఆసక్తి కనబరిచారు. ప్రొఫెసర్ కె.ఆర్. శ్రీనివాస అయ్యంగార్ అన్నట్టు ఆచార్య సచ్చిదానంద మూర్తికి ఈ విశాల విశ్వమే అధ్యయన కేంద్రమైంది. ఆయన ఆంధ్ర రాష్ట్రంలో జన్మించినా తెలుగులో రాసింది చాలా తక్కువ. దాదాపు ఆయన రచనలన్నీ ఆంగ్ల భాషలోనే వెలువడ్డాయి. మన రాష్ట్రంలో జన్మించిన ముగ్గురు ప్రపంచ ప్రసిద్ధ తత్వవేత్తలలో ఆచార్య సచ్చిదానందమూర్తి ఒకరు. మిగిలిన ఇద్దరు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, జిడ్డు కృష్ణమూర్తి. తెలుగులో ఆయన రాసింది తక్కువే అయినా, ఆచార్య సచ్చిదానందమూర్తి సంపాదక సారథ్యంలో తెలుగులో వెలువడిన "దర్శనములు-మతములు" (విజ్ఞాన సర్వస్వం, 7వ సంపుటం, తెలుగు భాషా సమితి, 1962) ఉద్గ్రంథంలో 197 పేజీల్లో ప్రపంచ దర్శనాలపై సుదీర్ఘమైన సమీక్ష రాశారు. ఈ సమీక్షలో ప్రపంచ దర్శనాలన్నింటిని పరిశీలించారు. ఏదో ఒక దార్శనిక దృక్పథాన్ని అనుసరించి ప్రపంచ దర్శనాల్ని విశ్లేషించకుండా వస్తు గత దృష్టితో సమీక్షించారు. బహుశ భారతీయ భాషల్లో శాస్త్రీయ ప్రణాళికతో వెలువడిన విజ్ఞాన సర్వస్వాలలో ఇదే మొదటిది కావచ్చు. దీన్ని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జూలై 1963లో ఆవిష్కరించారు.

### ఆచార్య సచ్చిదానందమూర్తి రచనల్లో ముఖ్యమైనవి

- 1.ఎవల్యూషన్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ ఇండియా (ఈ గ్రంథాని కి మానవవాద తత్వవేత్త ఎం.ఎన్.రాయ్ పీఠిక రాశారు)
- 2.షడ్ దర్శన సముచ్చయ (హరిభద్ర సూరి సంస్కృత గ్రంథానికి A compendium of six philosophies పేరుతో ఆంగ్లానువాదం)
- 3.రీజన్ అండ్ రెవెలేషన్ ఇన్ అద్వైత వేదాంత (ఈ గ్రంథంలో అద్వైత వేదాంతాన్ని నిశితంగా పరిశీలించారు)
- 4.ఇండియన్ ఫారిన్ పాలసీ (1964)
- 5.మెటాఫిజిక్స్, మ్యాన్ అండ్ ఫ్రీడం (ఈ గ్రంథానికి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ తొలిపలుకు రాశారు)
- 6.ది ఇండియన్ స్పిరిట్ (1965)

- 7.నాగార్జున (ఆచార్య నాగార్జునుడి జీవిత సిద్ధాంతాలపై సంక్షిప్తంగా, సమగ్రంగా ఆంగ్లంలో వున్న ఉత్తమ గ్రంథం)
- 8.ది రెల్మ్ ఆఫ్ బిట్వీన్ (1974)
- 9.ఫార్ ఈస్ట్రన్ ఫిలాసఫీస్ (దూర ప్రాచ్య దర్శనాలపై వెలువడిన ఏకైక భారతీయ రచన)
- 10.ఇండియన్ ఫిలాసఫీ సిన్స్ 1498 (తాత్వికవ్యాసాలు, 1982)
- 11.ది క్వెస్ట్ ఫర్ పీస్ (1986)
- 12.ఫిలాసఫీ ఇన్ ఇండియా (1985)
- 13.ఆంధ్రా కంట్రిబ్యూషన్ టు బుద్ధిస్ట్ థాట్ (డా. రాధాకృష్ణ స్మారకోపన్యాసం, అంతర్జాతీయ తెలుగు సంస్థ 1980)
- 14.ఎథిక్స్, ఎడ్యుకేషన్, ఇండియన్ యూనియన్ అండ్ కల్చర్(కాశీ నుండి కాశ్మీరు వరకు గల విశ్వ విద్యాల యాల్లో ఆచార్య సచ్చిదానందమూర్తి ప్రసంగాలు,1991).

ఈ రచనల ద్వారా భారతీయ తత్వశాస్త్రంపై, తత్వవేత్తలపై ఆయన అభిప్రాయాలు తెలుస్తాయి. ఆయన తాత్విక దృక్పథాన్ని కూడా వీటిని అధ్యయనం చేయడం ద్వారా గ్రహించగలం.

## భారతదేశంలో తత్వశాస్త్ర పరిణామం

ఆచార్య సచ్చిదానందమూర్తి మేధా పరిణామాన్ని, దార్శనిక వికాసాన్ని తెలుసుకోవాలంటే మొదటగా 1952లో ఆయన రచించిన "ఎవల్యూషన్ ఆఫ్ పిలాసఫీ ఇన్ ఇండియా (భారత దేశంలో తత్వశాస్త్ర పరిణామం) గ్రంథాన్ని గురించి తెలుసు కోవాలి. ఈ గ్రంథంలోని అనేక ప్రతిపాదనలతో నేడాయన ఏకీభవించటం లేదు. అయినప్పటికీ మూడు పదుల వయస్సు కూడా నిండని దశలో రచించిన ఈ గ్రంథం భారతీయ తత్వ శాస్త్ర చరిత్రలో ఒక సంచలనాత్మక సంఘటన. దీనిలో భారతీయ తత్వశాస్త్ర వికాసాన్ని ఒక విలక్షణ రీతిలో, సాంప్రదా యేతర దృష్టితో పరిశీలించారు. అప్పటి వరకు వెలువడిన తత్వశాస్త్ర గ్రంథాలలో (డా.ఎస్.ఎన్.దాస్‌గుప్త, డా.రాధాకృష్ణన్, ప్రొ॥హిరియన్న) చోటు చేసుకొనని అనేక అంశాల్ని ఆచార్య సచ్చిదానందమూర్తి సామాజిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో విశ్లేషించారు. ఏ దార్శనికుడిని, దర్శనాన్ని అమూర్తంగా (abstract) చూడకూడదని, ఏ దార్శనికుడయినా, దర్శనమయినా నాటి సామాజిక పరిస్థితుల నుండే ఆవిర్భ విస్తారని, ఆవిర్భవిస్తాయని గ్రహించాలని ఆయన ఈ రచనలో పేర్కొన్నారు. అప్పటి వరకు వెలువడిన ఏ తత్వశాస్త్ర గ్రంథం లోనూ ఏ రచయితా ప్రధానమయిన ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. (అయితే ఇక్కడ ఒక మినహాయింపు వుంది. సామాజిక, ఆర్థిక సంబంధాల నేపథ్యంలో భారతీయ తత్వ శాస్త్రాన్ని 1932లోనే "హైందవ భౌతిక వాదంలో అధ్యయనాలు' అనే గ్రంథంలో డా.కె.బి. కృష్ణ పరిశీలన చేశారు. వారి రచన నేటి వరకు వెలుగు చూడలేదు). "ఎవల్యూషన్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ ఇండియా 25 అధ్యాయాలుగా విభజించబడింది. మొదటి అయిదు అధ్యాయాలు రచయిత ఎంచుకున్న పరిశీలనా పద్ధతిని తెలియచేస్తాయి. ఆరో అధ్యాయం "తత్వశాస్త్రమంటే ఏమిటి?" లో తత్వశాస్త్రమంటే రచయిత ఏమనుకుంటున్నారో తెలియ చేస్తుంది. ఈ అధ్యాయంలో తత్వశాస్త్రానికి మతానికి గల సంబంధాన్ని గురించి చర్చించారు. తత్వశాస్త్రాన్ని మతాన్ని రెండు భిన్నమైన విషయాలుగా పరిగణించాలని పేర్కొన్నారు. మిగతా అధ్యాయాల్లో భారతీయ తత్వశాస్త్రాన్ని గురించి విపులం గా చర్చించారు. "ఫిలాసఫి ఇన్ వేద" (వేదంలో తత్వశాస్త్రం) అధ్యాయంలో రుగ్వేదాన్ని సరియైన చారిత్రక నేపథ్యంలో అర్థం చేసుకోవాలని, అభిమాన, దురభిమానాలతో అటువంటి గ్రంథాన్ని పరిశీలించకూడదన్నారు. సాంప్రదాయ వాదులవలె అభిమానంతో ప్రపంచ విజ్ఞానమంతా దానిలో (వేదంలో) వుందని కానీ సాంప్రదాయ వ్యతిరేకుల మాదిరి దానిలో ఏమీ లేదు, అది అంతా పనికిమాలిన చెత్తగా కానీ పరిగణించడం సరియైందని కాదని ఆయన భావించారు. ఈ రెండు దృక్పథాలు పాక్షికమైనవే. రుగ్వేదాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేస్తే అది ఎలా ఆవిర్భవించిందో, తత్వశాస్త్రం క్రమేణా ఎలా రూపొందిందో గ్రహించగలమంటారు. రుగ్వేదంలోని కొన్ని సూక్తాలలో తాత్విక దృష్టి కనిపిస్తున్నదని, అది చాలా ప్రాథమిక స్థాయిలోవుందని పేర్కొన్నారు. ముఖ్యంగా నా సదీయ సూక్తం" (the Hymn of non being)లోని సృష్టి వివేచన ఆసక్తి కలిగిస్తుంది. ఇది రుగ్వేదంలోని దశమ మండలంలోని 129వ సూక్తం. దీన్ని సృష్టిసూక్తం (Hymn of creation) అని కూడా అంటారు. ఈ సూక్తంలో ఏడు రుక్కులున్నాయి. ఈ సూక్తాన్ని పరిశీలిస్తే విశ్వాన్ని, విశ్వ సృష్టినీ గురించి రుగ్వేదార్యులు ఎంత నిశితంగా ఆలోచించారో తెలుస్తుంది. ఈ సూక్తంలో కానీ సృష్టికి సంబం ధించిన ఇతర సూక్తాలలో కానీ తాత్వికంగా కొన్ని ముఖ్యమైన ప్రశ్నలే కనిపిస్తాయి. కాని, వాటికి సమాధానం వీటిలో లేదు. ఒకవేళ వున్నా అది చాలా ప్రాథమిక స్థాయిలో వుంది. అందువల్ల స్పష్టమైన తాత్విక చింతన రుగ్వేదంలో కనిపించదు. అయినా నాసదీయ సూక్తం రుగ్వేదంలో విశిష్టమైన సూక్తం. తాత్విక చింతనాపరులకు నాటికీ, నేటికీ ఈ సూక్తం ఆసక్తిని, ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆచార్య సచ్చిదానందమూర్తి ఈ సూక్తాన్ని గురించి ఇలా అన్నారు. "It is genuinely philosophical in spirit." ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి ఈ రచనలో మతాన్ని, తత్వశాస్త్రాన్ని వేరు వేరు విషయాలుగా పరిగణించాలని, ఆ రెండింటిని కలగాపులగం చేసి చిత్రించిన రచనలే ఇప్పటి వరకు భారతీయ తత్వశాస్త్రంపై వెలువడ్డాయని చెప్పారు. ఈ అభిప్రాయం నాటికీ, నేటికీ నిజమే! మతాన్ని, మార్మికవాదాన్ని, పౌరాణికాంశాల్ని దార్శనిక వికాసంలో అంతర్భాగంగా చూడటం వల్ల తత్వశాస్త్ర పరిణామం

భారతదేశంలో అనేక విపరీత ధోరణులకు, అశాస్త్రీయ అంశాల కు నెలవైంది. అటు వంటి అశాస్త్రీయ ధోరణి నుండి బయట పడాల్సిన అవసరాన్ని, ఆవశ్యకతను ఈ రచన నొక్కి చెబుతుంది.

అయితే ఇదే సమయంలో భారతీయులకు తత్వశాస్త్రం అంటే తెలియదని, మతభావాలు, మతదృష్టినే తత్వశాస్త్రంగా భ్రమ పడుతున్నారనీ పాశ్చాత్య దార్శనికుల్లో అగ్రగణ్యుడైన హెగెల్ (1770 – 1831), తత్వశాస్త్ర చరిత్రకారుల్లో సుప్రసిద్ధుడైన తిల్లీ లాంటి వారు భావించారు. తత్వశాస్త్ర చరిత్ర అంటే పాశ్చాత్య దేశాల తత్వశాస్త్ర అధ్యయనమేనని, దాని ప్రారంభాన్ని గ్రీకు దర్శనాలతోనే ప్రారంభించాలనే ధోరణి ఒకటి పాశ్చాత్య చరిత్రకారులలో బలీయంగా వుండేది. అందువల్ల పాశ్చాత్యుల తత్వశాస్త్ర రచనల్లో భారతీయ, చైనా తత్వ శాస్త్రాలకు స్థానమే లేకుండా పోయింది. భారతీయ తత్వశాస్త్ర చరిత్ర యెడల ఇది పూర్తిగా ప్రతికూలాత్మక దృష్టి భారతీయ దర్శనాల్లో లౌకిక దృష్టి ప్రస్ఫుటంగా కనిపించే లోకాయతాన్ని, తొలిసాంఖ్యాన్ని సయితం పాశ్చాత్య తత్వశాస్త్ర చరిత్రకారులు పూర్తిగా విస్మరించారు. ఇటువంటి ధోరణికి సన్నిహితమైనదే భారతీయ పండితుల్లో కనిపిస్తుందని, అందులో ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి ప్రముఖులని సోవియట్ రచయిత ఎన్.పి.అనెకీవ్ విమర్శించారు. ఈ సోవియట్ రచయిత భ్రమపడినట్టు ఆచార్య సచ్చిదానందమూర్తి ఈ గ్రంథ రచనలో అటువంటి ప్రతికూలాత్మక, నిషేధాత్మక ధోరణిని అనుసరించలేదు. అటువంటి ధోరణికి ఈయన ప్రతినిధీ కాదు. ఎంతో ప్రతిభావంతులైన మన దార్శనికులు, శాస్త్రజ్ఞుల రచనల్లో పరస్పర విరుద్ధాలైన మత భావాలు, మార్మికదృష్టి శాస్త్రజ్ఞానం ఎలాచోటు చేసుకున్నాయన్న పరిశీలనే ఈ గ్రంథ రచనా లక్ష్యంగా కనిపిస్తుంది. అంతేకాని ఫ్రాంక్ తిల్లీ 'తత్వశాస్త్ర చరిత్ర"లో భావించినట్టు భారతీయులకు స్పష్టమైన తత్వశాస్త్రం లేదనీ, పౌరాణిక, నైతిక సిద్ధాంతాలే భారతీయుల దార్శనిక చింతనలో భాగమనీ, అందువల్ల తత్వశాస్త్ర అధ్యయనాన్ని పాశ్చాత్య దేశాలకే పరిమితం చేయాలని ఆచార్య సచ్చిదానందమూర్తి భావించలేదు. మన తత్వశాస్త్ర వికాసంలో మతం, మార్మికవాదం నిర్వహించిన ప్రతికూలాత్మక పాత్రను వివరిస్తూ, మన దర్శనాల నుండి మతాన్ని వేరు చేసి చూస్తే, అసలు సిసలైన దర్శనాలుగా ఎన్ని మిగులుతాయో ప్రతిభావంతంగా చూపారు. మతభావాల్ని, కట్టు కథల్ని వదిలేసి పూర్తిగా హేతువు మీద ఆధారపడి యోచిస్తే, పరిశీలిస్తే రెండే రెండు దర్శనాలుగా మిగులుతాయని, అవి లోకాయత, సాంఖ్య దర్శనాలని ఆయన స్పష్టంగా ప్రకటించారు. అందువల్ల అప్పటి వరకు ప్రచారంలో వున్న భావాలన్నింటినీ నిశిత పరిశీలన చేసి, అశాస్త్రీయాంశాల్ని నిరసించడం వల్ల ఆచార్య సచ్చిదానందమూర్తిని భారతీయ తత్వశాస్త్ర చరిత్రకారుల్లో విగ్రహ విధ్వంసకుడి(iconoclast)గా అంటే అనూచానంగా వస్తున్న విశ్వాసాలను ఖండించిన వాడిగా విమర్శకులు భావిస్తున్నారు. ఏమయినా గాఢ నిద్రలో వున్న తత్వశాస్త్ర మేధావుల్ని ఈ గ్రంథం తట్టి లేపింది. ఆలోచింప చేసింది. అందుకే ఎం.ఎన్.రాయ్ వంటి భౌతిక వాద చింతకుడు ఈ గ్రంథ రచయిత దృక్పథాన్ని ఇలా తెలిపారు A courageous rejection of the conformist, conventional and patriotic view in favour of the objective, scholarly and critical has enabled the author to discover that Indian Philosophy was never differentiated from Theology.(అవతారిక, ఎవల్యూషన్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ ఇండియా, 1952, పే.1).

భారతదేశంలో మౌలిక చింతనకు ప్రాముఖ్యత గల యుగంగా పరిగణించబడే కాలం క్రీ.పూ.500 నుండి క్రీ.శ.1200తో అంతమౌతుంది. ఆ తర్వాత సృజనాత్మక చింతన స్థానంలో వివరణలు, విమర్శలకే పరిమితమైంది భారతీయ తాత్విక చింతన. నిజానికి భారతీయ తత్వశాస్త్రంలో పరిణామం, వికాసం, పరివర్తన అనేవి ఉన్నవా అని ప్రశ్నించుకుంటే లేవనే ఆచార్య సచ్చిదానందమూర్తి ఈ గ్రంథంలో అభిప్రాయపడ్డారు. భారతీయ తాత్విక చింతన పునర్జన్మ భావంతో తీవ్రంగా ప్రభావితమయి దాని నుండి విడుదల, మోక్షమే(release) ఆచరణాత్మక ప్రేరణగా నిలిచిపోయి, భారతీయ తాత్విక వికాసం కుంటుపడిందని ఆయన భావించారు.

ఇటువంటి ప్రవృత్తికి మన దేశ వాతావరణ పరిస్థితులు, భౌగోళిక, మత, సామాజిక పరిస్థితులు చాలా వరకు కారణ భూతమయ్యాయి. అందువల్ల దార్శనిక 'సమస్యలుగా ఆత్మ, కర్మ, పునర్జన్మ, మోక్షం వంటి మిథ్యాభావాలు ప్రధాన స్థానమాక్రమించాయి. అదే సమయంలో ఈ మిథ్యా భావజాలం నుండి బయటపడి నిజమైన దర్శనాలుగా నిలిచినవి లోకాయతం, తొలి సాంఖ్య దర్శనం. ఒక దశలో భారతదేశంలో భౌతికవాద తాత్విక చింతన శక్తివంతమైన స్థానంలో వుండేదని, అందువల్ల ఈ దర్శనాన్ని విమర్శిస్తూ మన భావవాద దార్శనికులు రచనలు వెలువరించారని ఆయన చెప్పారు. సాంఖ్య దర్శనం వినా భారతీయ తత్వశాస్త్రంలో లోకాయతాన్నే ఆయన హేతువాద దర్శనంగా పరిగణించారు. సాంఖ్యం హేతువాద, నాస్తిక(atheistic) దర్శనమయినా, వేదాధికారాన్ని బహిరంగంగా ప్రశ్నించ లేదని, అందువల్లనే అది ఇంతకాలం మనగలిగిందని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. గార్బె భారతదేశంలో అతిప్రాచీనమైన, అసలు సిసలైన దార్శనిక వ్యవస్థగా సాంఖ్య దర్శనాన్ని పేర్కొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, సాంఖ్యం పుట్టుక పరిణామాన్ని తెలుసుకోవాలంటే, తొలిసాంఖ్య దర్శనం స్వరూప స్వభావాల్ని తెలుసుకోవాలని ఆచార్య సచ్చిదానందమూర్తి అన్నారు. తొలి సాంఖ్యమంటే ఏమిటో తెలుసుకోగలిగితేనే సాంఖ్యదర్శన

పరిణామాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోగలుగుతామని ఆయన భావించారు. ఆచార్య సచ్చిదానందమూర్తి భారతీయ తత్వ శాస్త్రంలో నిజమైన దర్శనాలుగా వేటినయితే పేర్కొన్నారో, ఆ రెండు దర్శనాల్ని తర్వాత కాలంలో(1959) దేవీప్రసాద్ చటోపాధ్యాయ తన 'లోకాయత' గ్రంథంలో పరిశీలించారు. "లోకాయత' గ్రంథంలో తొలి సాంఖ్యంపై ప్రత్యేకంగా ఒక అధ్యాయమే వుంది. 1952లో ఆచార్య సచ్చిదానందమూర్తి భారతీయ తత్వశాస్త్రంలో వేటినయితే నిజమైన దర్శనాలుగా పరిగణించారో, వాటిపైన విపులమైన పాండిత్యంతో 1959లో గ్రంథాన్ని వెలువరించిన రచయిత ఆచార్యమూర్తి రచనను ఎక్కడా పేర్కొనకపోవడం ఆశ్చర్యంగా ఉంది. మతం, తత్వ శాస్త్రం రెండూ భిన్నవిషయాలుగా పరిగణించడం భారతీయ చింతనలో ఎప్పుడూ జరగలేదు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని భారతీయ తత్వ శాస్త్ర రచన చేసిన వారు నాటికి (1952) ఎవ్వరూ లేరు. ప్రాచీన మధ్యయుగ భారతంలో దార్శనిక శాస్త్ర గ్రంథాలుగా నిలిచేవి బహుకొద్ది మాత్రమే వున్నాయి. మత నమ్మకాలు, మూఢ విశ్వాసాలు, అవ్యవస్థీకృత భావాలు ఇవే మన దర్శన శాస్త్ర గ్రంథాలలో దర్శనమిస్తుంటాయి.

ఈ విషయంలో శంకర, రామానుజ, మధ్వుల రచనలు అతీతం కాదు. అయితే ఆచార్య నాగార్జునుని మూల మాధ్యమిక కారికలు, గౌడపాదుని మాండూక్య కారికలు, ఈశ్వర కృష్ణుని సాంఖ్య కారికలు ఇటువంటి మూఢ నమ్మకాలకు, మత విశ్వాసాలకు దూరంగా నిలిచాయి. ఈ రచనల్లో దార్శనిక భావాల విశ్లేషణకు, విమర్శకే ప్రాముఖ్యం వుంది. అందువల్ల వీటినే నిజమైన దార్శనిక గ్రంథాలుగా పరిగణించాలన్న ఆచార్య సచ్చిదానందమూర్తి అభిప్రాయం ఎంతో సముచితమైనది. స్వచ్ఛమైన దార్శనిక చింతన మనకు ఈ రచనల్లో దర్శనమిస్తుంది. ఇలాగే ఇంకా కొన్ని దార్శనిక శాస్త్ర గ్రంథాలు బౌద్ధ దార్శనికులవి వున్నాయి. భారతదేశం సృజించిన ఇద్దరు గొప్ప దార్శనికులు ఆచార్య నాగార్జునుడు, గౌడపాదుడు అంటారు ఆచార్య సచ్చిదానంద మూర్తి. శంకరుడు దార్శనికుడు కాదు కేవలం దైవ శాస్త్రజ్ఞుడు (Theologian) మాత్రమేనని ఆయన అభిప్రాయం. త్రిమతాచార్యులుగా పేర్కొనబడుతున్న శంకర, రామానుజ, మధ్వాచార్యులు తమ కాలంనాటి సామాజిక పరిస్థితుల్ని అధిగమించి ఎదగలేదు. కుల వ్యవస్థను ఖండించ లేదు. ఈ ముగ్గురు ఆచార్యులు "బ్రహ్మజ్ఞానం' పొందటానికి క్రింది కులాలు, వర్గాలు అనర్హులుగా భావించారు. బ్రహ్మ సూత్రాల్లోని అపశూద్రాధికరణంపై త్రిమతాచార్యులు ఒకే విధంగా వ్యాఖ్యానించారు. శూద్రులు బ్రహ్మజ్ఞానానికి అర్హులు కారనే ముగ్గురు వేదాంతాచార్యుల స్పష్టమైన అభిప్రాయమని ఆచార్య సచ్చిదానందమూర్తి అన్నారు. తద్వారా వేదాంతం మధ్యయుగాల్లో సామాజికంగా అభివృద్ధి నిరోధక పాత్ర నిర్వహించిందనే చెప్పాలి.

అరిస్టాటిల్ వంటి దార్శనికుడు భారతదేశంలో జన్మించలేదని, మనకు స్పష్టమైన శాస్త్రీయ దృష్టి లేదని కేవలం హేతువుపై ఆధారపడి మన దార్శనికులు రచనలు చేయలేదని పరస్పర విరుద్ధములైన, అసంగతములైన అనేక విషయాలు ప్రసిద్ధ దార్శనికులుగా, శాస్త్రజ్ఞులుగా పరిగణించబడుతున్న నాగార్జున, వరాహమిహిరుడు, ఆర్యభట్టు, బ్రహ్మగుప్తుడు, చరకుడు, శుశ్రుతుడు వంటి వారి రచనల్లో, జీవితాల్లో మనకు కనిపిస్తాయని, అదే సమయంలో వీరు తమ శాస్త్రరంగాల్లో అద్భుతమైన సిద్ధాంతాలు రూపొందించారని, వీరి భావాల్ని గ్రీకులు, అరబ్బులు స్వీకరించారని చెప్పారు. ఇంతటి విశిష్టమైన, విలక్షణమైన సిద్ధాంతాల్ని రూపొందించిన వీరికి స్పష్టమైన శాస్త్రీయ దృష్టి, స్పృహ లేదని అభిప్రాయపడ్డారు. ఈ విమర్శ చారిత్రకంగా కొంత వరకు వాస్తవమే. ఇటువంటి ప్రసిద్ధులైన దార్శనికులు, శాస్త్రజ్ఞుల జీవితాల్లో, రచనల్లో పరస్పర విరుద్ధాలైన విషయాలు ఎందుకు చోటు చేసుకున్నాయన్న ప్రశ్నను సరైన చారిత్రక దృష్టితో ఆచార్య సచ్చిదానందమూర్తి లేవనెత్తలేదనిపిస్తుంది. మనదేశ భౌగోళిక పరిస్థితులు, జాతి తత్వం మనలో పరస్పర విరుద్ధ భావాలకు కారణమయినా, మరొక ముఖ్యమైన కారణం మన చారిత్రక పరిశోధకులకు నేడు కనిపిస్తుంది. స్మృతికారులు, బ్రాహ్మణమతం మన దార్శనిక శాస్త్రానికి, విజ్ఞాన శాస్త్రానికి చేసిన ద్రోహం, అన్యాయం మధ్య యుగాల్లో పాశ్చాత్యదేశాల్లోని క్రైస్తవ మతాధిపతులు కూడా చేయలేదనేది వాస్తవం. విజ్ఞాన శాస్త్ర రంగంలో విశిష్టమైన సిద్ధాంతాల్ని, రచనల్ని చేసిన మన శాస్త్రజ్ఞుల రచనలు పరస్పర విరుద్ధ భావాలతో, మత భావజాలంతో, బ్రహ్మణీయ సంస్కృతీ ప్రభావంతో దర్శనమిస్తుంటాయి. దానికి కారణాల్ని వివరించడంలోను ఆచార్య సచ్చిదానందమూర్తి విఫలమయ్యారు. అందుచేతనే ఈ పరస్పర విరుద్ధమైన భావాలకు కారణం.మన శాస్త్రజ్ఞులకు, దార్శనికులకు శాస్త్రీయ దృష్టి లేకపోవడంగా భావించారు. నిజానికి మన దేశంలో ప్రాచీన, మధ్యయుగాల్లో దార్శనిక శాస్త్ర విజ్ఞాన వికాసానికి బ్రాహ్మణ మతం, ధర్మశాస్త్రకారులు చేసిన ద్రోహాన్ని నేటి పరిశోధకులు తమ పరిశోధనల్లో వెల్లడించారు. (దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ, సైన్స్ అండ్ సోసైటీ ఇన్ ఏన్షియంట్ ఇండియా). చివరగా "భారతీయ తత్వశాస్త్రం" అనే పదంపై ఆచార్య సచ్చిదానంద మూర్తి. సంచలనాత్మకమైన ఒక అభిప్రాయాన్ని పాఠకుల దృష్టికి తెస్తాను. భారతీయ తత్వశాస్త్రం అనే పదమే కలవరం కలిగిస్తుంది. ఎవరు కూడా భారతీయ ఖగోళశాస్త్రం, భారతీయ జీవశాస్త్రం అని మాట్లాడరు. అటువంటప్పుడు భారతీయ తత్వశాస్త్రం అనే పదం ఎందుకు ఉపయోగించాలి? అర్థశాస్త్రం, భూగర్భశాస్త్రం, వాతావరణ శాస్త్రం అని ప్రయోగించినట్టే

'తత్వశాస్త్రం" అంటే సరిపోతుంది. ఈ వివిధ శాస్త్రాల వికాసానికి, అభివృద్ధికీ ప్రపంచంలోని వివిధ దేశాల ప్రజలు ఏదో మేరకు కృషిచేశారు. అటువంటప్పుడు ఈ విజ్ఞాన శాస్త్రాలను వివిధ దేశాల పేర్లతో పిలవటం సంకుచిత దృక్పథమౌతుంది. అది తత్వశాస్త్రానికి వర్తిస్తుంది. అందువల్ల భారతీయ తత్వశాస్త్రం, గ్రీకు తత్వశాస్త్రం, చైనా తత్వశాస్త్రాలు వుండవు తత్వశాస్త్రమే మిగులుతుంది అంటారు. ఇది నేటికీ ఆలోచింపదగిన విషయమే!

ఇటువంటి విశిష్టమైన, ఆలోచనాత్మక గ్రంథంలోని ప్రతిపాదనలతో చాలా వరకు గ్రంథకర్త ఆచార్య సచ్చిదానంద మూర్తి నేడు ఏకీభవించడం లేదు (చూడు: మతములు – దర్శనములు, ఆద్యేయ గ్రంథపట్టిక, పే.830, మొదటి ముద్రణ 1962 ఫిలాసఫీ ఇన్ ఇండియా, పే. 49, మొదటి ముద్రణ 1985). గ్రంథకర్త నేడు తమ గ్రంథంలోని భావాలతో ఏకీభవించినా ఏకీభవించకపోయినా, సామాజిక – రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వివిధ మానవ శాస్త్ర రంగాల్లో ఆధునిక పరిశోధనా ఫలితాలు వెలుగులో భారతీయ తత్వ శాస్త్ర వికాసాన్ని నిశితంగా అధ్యయనం చేయగోరిన వారందరికీ 'ఎవల్యూషన్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ ఇండియా" నేటికీ ప్రేరణాత్మక రచనగా నిలుస్తుంది. అందువల్లనే గ్రంథ రచయిత దృక్పథాన్ని ప్రముఖ భారతీయ తత్వశాస్త్ర చరిత్రకారుడు డా.ఎస్.ఎన్. దాస్గగుప్త ఇలా ప్రశంసించారు: "ఆచార్య కె.సచ్చిదానంద మూర్తి రచన భారతదేశంలో తత్వశాస్త్ర పరిణామం ఎంతో ఆనందంతో, ఆసక్తితో చదివాను. రచయిత విస్తృతంగా అధ్యయనం చేశారు. ఆయన తన పాండిత్యంతో భారతీయ చింతనా వ్యవస్థలోని బలహీనాంశాల్ని బహిర్గతం చేశారు." ❑


**సంప్రదించిన రచనలు :**


- 1.Evolution of Philosophy in India - K. Satchidananda Murty, Andhra University, Waltair, 1952.
- 2. మతములు – దర్శనములు, విజ్ఞాన సర్వస్వము, వాల్యూం 7, తెలుగు భాషా సమితి, హైదరాబాద్, 1962.
- 3. Philosophy in India - K.Satchidanda Murty, Motilal Banarasidass, New Delhi, 1985.


**(మిసిమి సౌజన్యంతో)**

# హనుమద్విజయము పుస్తకానికి త్రిపురనేని ముందుమాట

**ప్రముఖ తత్వశాస్త్రవేత్త కొత్త సచ్చిదానంద మూర్తి శతజయంతిని పురస్కరించుకుని ఆయన రచనలను, కొన్ని అనువాదాలను ముద్రిస్తున్నారు. అందులో భాగంగా ఆయన 14 ఏళ్ల వయసులోనే రాసిన "హనుమద్విజయము" పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ పుస్తకానికి కవిరాజు త్రిపురనేని రామస్వామి గారు రాసిన "ముందు మాట"ను ప్రచురిస్తున్నాము.**




## ముందుమాట

కొత్త సచ్చిదానంద మూర్తిచే వ్రాయబడిన 'హనుమద్విజయమ'ను గ్రంథమును పూర్తిగా చదివితిని. హనుమచ్చరిత్రమొక గ్రంథమున లేదు. ఒకరి చేతయూ వ్రాయబడి యుండలేదు. అట్టిచో వివిధ గ్రంథావ లోకనమున గల వలయు ఘట్టములను స్వీకరించి, ఉటంకిం చుట సులభమగు కార్యము కాదు. అట్టి కార్యములను బాలుండయ్యు నీ కవి నిపుణతతో నిర్వహించినందులకు మిగుల సంతసించుచుంటిని. 'హనుమద్విజయము' యొక్క భాష నిర్దుష్టముగను, శైలి శ్రవణానందముగను నున్నయది. వీరింట నుండు హనుమద్భక్తియే ఈ కుమారుని నింత శ్రమకు లోబఱిచి ఈ గ్రంథము వ్రాయించి యుండునని తలంచెద. రామాయణమును గూర్చి రాద్ధాంత సిద్ధాంతము లు పెక్కులు గలవు. హనుమద్విజయమున జెప్పబడిన కథ గ్రంథపరం పరగాను, వంశపరం పరగాను ఆంధ్రదేశమునకు అందజేయబడినది. ప్రస్తుత మీల వాదోపవాదములతో పనిలేదు. బహుళ గ్రంథావలోకమున నీ కవి కుమారుడీ గ్రంథమును వ్రాయగల్గుటయే యానందకంబు. రసస్ఫూర్తి కొఱకు బూర్వ కవుల శ్లోకములను, బద్యములను సందర్భాను సారంగా నిందు కూర్చు చేసియున్నాడు. ఇది ఇతని యౌచితిని దెల్పుచు న్నది. ఈ గ్రంథము వ్రాయుటకు వ్యయ పెట్ట బడిన విచక్షణా, పరిశీలనా పటిమ, ఇక ముందు మరియొండు మార్గమున నుపయోగింపబడి, యుత్కృష్ట గ్రంథములు ఈ కవిచే సృజింపబడునని యాశించు చు, నట్టి మహత్కార్యమునకు నన్ని విధముల సామాగ్రిని సమ కూర్చుకొను ప్రతిభ గల్గు గాకయని యాశీర్వదించుచుంటిని.

**త్రిపురనేని రామస్వామి(కవిరాజు, శతావధాని, బారిష్టరు),**
**తెనాలి, సూతాశ్రమము, 31-05-1938.**

(గతంలో "ఇదీ భారతీయం" పుస్తక పరిచయం ప్రచురించాం)
ఈ పుస్తకాల కోసం డా.రఘునాథ్ – 98480 47584

# తెలుగు సాహిత్యంలో తొలి మానవవాది 'కవిరాజు'



- డాక్టర్ దేవరాజు మహారాజు

**మల మల మాడుపొట్ట, తెగ మాసిన బట్ట**
**కలంత పెట్టగా విలవిల ఏడ్చుచున్న నిరుపేదకు జాలిని**
**జూపకుండా నుత్తల పడిపోయి జీవ రహితంబగు బొమ్మకు**
**నిండ్లు, వాకిళల్ పొలమును బొట్ర నిచ్చెడి ప్రబుద్ధుల నిచ్చమెచ్చెదన్.**

**తిండి, గుడ్డ, నీడ లేని నిరుపేదలను అశ్రద్ధ చేసి, జీవం లేని బొమ్మలకు ఇళ్లు, వాకిళ్లు, పొలమూ, పుత్రా సమకూర్చి, పెండ్లీ, గిండ్లీ చేసే ప్రబుద్ధులను కవిరాజు త్రిపురనేని రామ స్వామిచౌదరి (15 జనవరి 1887-16 జనవరి 1943) తీవ్రంగా నిరసించారు.**

తమిళులకు పెరియార్ రామసామి నాయకర్ ఉన్నట్టే, మన తెలుగు వారికీ ఒక రామస్వామి ఉన్నారు. ఆయన నాయకర్‌ను వదిలేసినట్టే, ఈయన చౌదరిని వదిలేశారు. ఇద్దరూ ఉన్నతశ్రేణి హేతువాదులు. మానవీయ విలువల్ని నిలుపడానికి ఈ ఇద్దరూ జీవితాంతం కృషి చేశారు. త్రిపురనేని రామస్వామి జయంతి, వర్ధంతులు ప్రతి సంవత్సరం ఒక్కరోజు తేడాతో వస్తాయి. ఆయనను స్మరించుకుని, ఆయన ఆశయాల్ని నిలబెట్టడానికి మనం నిరంతరం కృషి చేయాలి. మన ముందు తరాల వారిని అందుకు సిద్ధం చేయాలి!? తెలుగు సాహిత్య రంగంలో కవిరాజుది, ఆయన కుమారుడైన గోపీచంద్‌ది గణనీయమైన స్థానం. 1987లో కవిరాజు శత జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం తపాల బిళ్ల విడుదల చేయగా 24 ఏండ్ల తరువాత ఆయన కుమారుడు గోపీచంద్ శతజయంతి సందర్భంగా 2011లో మరో తపాలా బిళ్ల విడుదల చేసింది. భారత ప్రభుత్వం ఇలా ఉన్నత శ్రేణి రచయితలైన తండ్రీ కొడుకుల స్మృతిలో తపాలా బిళ్లలు విడుదల చేయడం చాలా అరుదైన విషయం. ఈ తండ్రీ కొడుకులిద్దరూ హేతువాదులే! హైదరా బాద్ టాంక్ బండ్ మీదున్న తెలుగు వెలుగుల విగ్రహాలలో కవిరాజు రామస్వామి విగ్రహమూ ఉంది. నేటి యువతీ యువకులు అటు వెళ్లినప్పుడు తప్పకుండా చూడాలి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం త్రిపురనేని రామస్వామి స్మారకార్థం ప్రతి ఏటా ఒక పురస్కారం అందిస్తోంది.

**ఒకరుడు 'వేదమే' భగవదుక్తమటంచు నుపన్యసించు**
**నింకొకరుడు 'బైబిలే' భగవదుక్తమటంచును వక్కణించు**
**వేరొకండు మా 'ఖొరాన్' భగవదుక్తమటంచును వాదులాడు,?**
**నీ తికమకలేల పెట్టెదవు తెల్పగ రాదె నిజంబు నీశ్వరా!**

నిజము తెల్పుమని ఇక్కడ ఈశ్వరుణ్ణి కవి అడుగుతున్నాడంటే - ఆయన ఉనికిని గుర్తిస్తున్నట్టు కాదు. ఇది ఒక వ్యంగ్య వ్యాఖ్య. లేని దేవుణ్ణి జనం మీద రుద్ది ఏ మహిమా లేని పవిత్ర గ్రంథాల ప్రసక్తి తెచ్చి పబ్బం గడుపుకుంటున్న వారిని హేళన చేయడం ఇందులో ఉంది. ఇతర రంగాలలో ప్రముఖులయినా సరే, కొందరు దేవుడి విషయానికి వచ్చే సరికి గోడ మీది పిల్లి వాటం గా వ్యవహరిస్తుంటారు. అలాంటి చర్యకు రామస్వామి స్వస్తి చెప్పారు. ధైర్యంగా తన హేతువాద దృక్పథాన్ని తన జీవితంలో పాటించి చూపారు. అదే తన సాహిత్యంలోనూ నమోదు చేశా రు. అందుకే తెలుగు సమాజానికి ఓ సూత పురాణం, ఓ శంభు క వధ, ఓ ఖూనీ, ఓ ధూర్త మానవా శతకం, కొన్ని సూతాశ్రమ గీతాలు. దక్కాయి. ఈ పుస్తకాల్ని నేటి యువతీ యువకులు వెతుక్కుని చదవాలి. వాటి స్ఫూర్తితో సమకాలీన సమాజాన్ని హేతువాత, మానవవాద ఆలోచనా ధోరణిలోకి నడిపించాలి.

త్రిపురనేని రామస్వామి 15 జనవరి 1887న కృష్ణా జిల్లా అంగలూరులో ఒక సంపన్న రైతు కుటుంబంలో పుట్టారు. తల్లిదండ్రులు రామమాంబ-చలమయ్య అప్పట్లో బాల్య వివాహాలు జరిగేవి కాబట్టి 1898లో పున్నమ్మ అనే బాలికతో పెద్దలు వివాహం జరిపించారు. అప్పటికి ఆయన వయసు 11. 1910లో ఆయనకు 23 యేట కుమారుడు గోపీచంద్ పుట్టాడు. మరోవైపు ఆయన మెట్రిక్యులేషన్ కూడా పాసయ్యాడు. ఆ రోజుల్లో చదువులు అలా ఆలస్యంగానే జరిగేవి. మెట్రిక్ తర్వాత అదే 23వ యేట యవ్వన దశలో ఎన్నో రచనలు సమాజం మీదికి సంధించారు. పల్నాటి యుద్ధం ఆధారంగా 'కారెంపూడి కదనం' రాశారు. మహాభారత యుద్ధం ఆధారంగా 'కురుక్షేత్ర సంగ్రామం' రాశారు. చిత్రమేమంటే ఈ రచనలో ఆయన పాండవులకు రాజ్యాధికారం లేదని నిరూపించి ఒప్పిం చారు. కారెంపూడి కదనం, కురుక్షేత్ర సంగ్రామం రెండూ నాటికలే

**ఇక కవిరాజు ఇతర రచనలు :** పల్నాటి పౌరుషం, గోపాలరాయ శతకం, కొండవీటి పతనం, రాణా ప్రతాప్, భగవ ద్గీత - మొదలైనవి. భగవద్గీత రచన భగవద్గీతను సమర్థిస్తూ రాసింది కాదు. విమర్శిస్తూ వెలువరించిన ఒక వ్యంగ్యరచన. అలాగే, రాణా ప్రతాప్ రచన విషయంలో ఒక విచిత్రం జరిగింది. అది అచ్చులో ఉండగానే అందులోని విషయం ఎలా బయటికి చేరిందో, అది నాటి ప్రభుత్వ దృష్టికి ఎలా వెళ్లిందో తెలియదు. కానీ, ఆ రచన అచ్చవుతూ ఉండగా ప్రెస్‌లోనే నాటి

బ్రిటీష్ ప్రభుత్వ నిషేధానికి గురైంది. 1911లో బందరు నోబెల్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివారు. అప్పుడే చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి శిష్యరికం చేసి మొదట అష్టావధానం, తర్వాత శతావధానం చేయగలిగారు. ఆ వయసులో అంతటి ధారణా శక్తిని, సాహిత్యం మీద సాధికారతను సాధించడం మామూలు విషయం కాదు. అయితే చదువు పూర్తిచేసి ఏదో వృత్తిలో స్థిరపడాల్సి ఉంది గనుక, అవధానాలు మానేసి న్యాయ శాస్త్రం చదవడానికి 1913లో బొంబాయి వెళ్లారు. ఏదో కారణం వల్ల వెంటనే తిరిగొచ్చారు. 1914లో ఐర్లాండ్‌లోని డబ్లిన్ యూనివర్సిటీకి వెళ్ళి అక్కడ న్యాయశాస్త్రం చదివారు. దానితోపాటు ఆంగ్ల సాహిత్యాన్నీ చదివారు. అయితే అక్కడ కూడా ఆయన పంచె కట్టుతోనే గడిపేవారు. 'ఏ దేశంలో ఉంటే ఆ దుస్తులే వేసుకోవాలి గానీ ఇదేమిటని' – అక్కడ ఒక బ్రిటీష్ మహిళ హేళన చేసింది. అయితే ఆయన ఖాతరు చేయలేదు. తన తెలుగుతనాన్ని, పంచెనూ వదులుకోలేదు. ఇక్కడ చెప్పుకోవాల్సిన విషమేమంటే, ఆయన డబ్లిన్‌లో ఉన్నా – ఆయన మనసు ఇక్కడ తెలుగు నేల మీదే ఉండేది. డబ్లిన్ నుంచి ఇక్కడి కృష్ణా పత్రికకు వ్యాసాలు రాసేవాడు. అంతేకాదు 'శంభుక వధ' అనే ప్రసిద్ధ రచన ఆయన డబ్లిన్‌లో ఉండగా రాసిందే! అనిబిసెంట్ చేస్తున్న హోంరూల్ ఉద్యమానికి మద్దతుగా రాశారు. మద్దతివ్వండని ఇక్కడి ప్రజల్ని ప్రోత్సహించారు. అక్కడి నుండే ఎన్నో దేశభక్తి గీతాలు అందించారు. ఆ రకంగా హేతువాదం, మానవవాదం తెలుగు సాహిత్యంలో ప్రవేశపెట్టినవాడిగా కవిరాజు త్రిపురనేనికి గుర్తింపు వచ్చింది. డబ్లిన్ నుంచి తిరిగి వచ్చి త్రిపురనేని 1917లో తొలుత మచిలీపట్నంలో న్యాయవాదిగా నాలుగైదేళ్లు ప్రాక్టీసు చేశారు. 1922 లో అక్కడి నుండి తెనాలికి మారి, న్యాయవాదిగా అక్కడ స్థిర పడ్డారు. వృత్తితోపాటు, సామాజిక అన్యాయాల్ని, మత అరాచకాల్ని ఎదిరించే తన ప్రవృత్తిని మేల్కొల్పారు. రాజరామ్మోహన్‌రాయ్, రానడే, కందుకూరి, గురజాడ వంటి వారి ఆదర్శాల్ని ప్రజల్లోకి తీసుకెళ్ళేవారు. ఇలాంటి సంఘ సంస్కరణ కార్యక్రమాల వల్ల ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారు. ఫలితంగా 1925లో తెనాలి పురపాలక సంఘానికి జస్టిస్ పార్టీ తరపున ఎన్నికయ్యారు. అయితే ఆయన సంస్కరణ వాదం ఆయన పదవికి ముప్పుతెచ్చింది. పురపాలక సంఘ అధ్యక్షునిగా జంతు బలులను నిషేధిస్తే – అవిశ్వాస తీర్మానం పెట్టి ఆయనను పదవి నుండి దింపేశారు. త్రిపురనేని వారు కంగారు పడలేదు. ఆ వెంటనే జరిగిన ఎన్నికల్లో మళ్లీ ఘన విజయం సాధించి పదవి చేజిక్కించుకున్నారు. జంతు బలులను నిషేధించారు. అంతే–ప్రత్యర్థులు దిక్కుతోచక తోకముడిచారు.

ఈ సంఘటనతో మనకు నిరీశ్వరవాది, బ్రిటీష్ పార్లమెంట్ మెంబర్ ఛార్లెస్ బ్రాడ్లా(1833–1891) విషయం గుర్తుకొస్తుంది. ఆయన దేవుడి మీద ప్రమాణం చేయమని అన్నందుకు, ఆత్మసాక్షిగా మాత్రమే చేస్తానన్నందుకు వేధించి, వేధించి డిస్మిస్ చేశారు. అయినా ఆయనే మళ్లీ ఎన్నికై వచ్చారు. చివరకు ఆనాటి బ్రిటీష్ పార్లమెంట్ వ్యవస్థే దిగొచ్చింది. ఎవరి ఇష్ట ప్రకారం వారు ప్రమాణ స్వీకారం చెయ్యొచ్చని 1888లో బిల్లు పాస్ చేసుకుంది. సంఘ సంస్కర్తగా కృషి చేస్తూ వచ్చిన కవిరాజు తను నివాసమున్న ఇంటికి 'సూత్రాశ్రమం' – అని పేరు పెట్టుకున్నారు.

**వేదాలు, పురాణాలు ఎంత నీతి బాహ్యంగా ఉన్నాయో చెప్పడానికి తన ఆత్మీయమిత్రుడు కుప్పుస్వామి పేరుతో 'కుప్పుస్వామి శతకం' (1930) రాశారు. "పరుల నీ ముందు దిట్టెటి వాడు నిన్ను / నొరిని ముందు దిట్టక యుండబోడు / చదువు రవ్వంత వానికి ఒసంగరాదు / ముప్పు ఒచ్చున్ దప్పక దాన గుప్పుస్వామి" నీ ముందు వేరేవాళ్ళను తిట్టేవాడు. వేరే వాళ్ళ ముందు నిన్ను తిట్టడని నమ్మకమేమిటీ ? అలాంటి వాడికి ఏ మాత్రమూ చదువు ఇవ్వగూడదని హెచ్చరిస్తూ చెప్పిన పద్యం ఇది.**

మరోవైపు అస్పృశ్యతకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తూ, మంత్రాలు లేని పెళ్లి విధానానికి సరళమైన తెలుగులో ఒప్పందాలు – ప్రమాణాలతో ఒక పెళ్లి విధానం (వివాహ విధి 1930) రూపొందించారు. దాని ప్రకారం ఎన్నో కులాంతర వివాహాలు జరిపించారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆయన పురపాలక సంఘ అధ్యక్షుడిగా నిరాఘాటంగా 13 ఏళ్లు నిలదొక్కుకున్నారు. ప్రజాభిమానం ఎంతగా పెరిగిపోయిందంటే, 1940లో గుడివాడలో ఆయనతో గజారోహణం చేయించి, ఘనంగా సన్మానించుకున్నారు. ఆ రోజుల్లోనే ఆంధ్ర మహాసభ 'కవిరాజు' బిరుదునిచ్చి గౌరవించు కుంది. 1941లో ప్రఖ్యాత మానవవాది ఎం.ఎన్.రాయ్ తెనాలి లోని వీరి సూత్రాశ్రమాన్ని సందర్శించారు. కవిరాజు ఖ్యాతి దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించిందనడానికి ఇదొక మంచి ఉదాహరణ.

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి మూడుసార్లు సెనెట్ మెంబరయ్యారు. వీర గంధము తెచ్చినారము వీరుడెవ్వడో తెల్పుడీ పూసి పోదుము మెడనువైతుము పూలదండలు భక్తితో– అనే ప్రసిద్ధ గీతం అందరికీ తెలిసిందే. అది కవిరాజు త్రిపురనేని రామస్వామి రచనే. ఒక స్వాతంత్ర్య సమరయోధుడిగా ఆయన బ్రిటీష్ పాలకులపైకి తన జీవితాంతం అక్షర తూటాలను సంధిస్తూ వచ్చారు. కేవలం 56 ఏళ్లు జీవించిన వీరు, ఎన్ని రంగాలలో ఎంతెంత కృషి చేస్తూ కూడా ఒక హేతువాదిగా, ఒక మానవవాదిగా అజేయంగా నిలబడడం సామాన్యమైన విషయం కాదు. అందువల్ల ఆయన రాసిన ఆ ప్రసిద్ధ గీతంలోని వీరుడెవరో కాదు నిస్సందేహంగా ఆయనే! అందువల్ల కవిరాజా త్రిపురనేని రామస్వామి అందించిన స్ఫూర్తిని నిలబెట్టుకుంటూ మనం ముందుకు సాగాల్సి ఉంది! ❑

# ఆశను వాగ్దానం చేస్తున్న స్త్రీలు

**'ట్రోల్' పుస్తకానికి ముందుమాట**

- కాత్యాయనీ విద్మహే



**భిన్న మత, తాత్విక జీవన విధానాల పట్ల, భిన్నాభిప్రాయాల పట్ల సమాజంలో అసహనం పెరుగుతోంది. సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో వీటి ప్రతిఫలనాల గురించి ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 2014 నుండి సీరియస్‌గా మాట్లాడుతున్నది. ఆ అసహనం ఈ పదేళ్లుగా మరింత వ్యవస్థీకృతం అవుతూ హేయమైన రీతులలో వ్యక్తం అవుతోంది. ఫాసిజం, అన్ని జీవిత పార్శ్వాలనూ, మానవ సంబంధాలను విషపూరితం చేయడానికి కొన్ని సాంకేతిక సాధనాలను సమకూర్చుకుంటున్నది. అలాంటివాటిలో ట్రోలింగ్ ఒకటి.**

సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ సహజమేమో అన్నంతగా పాతుకుపోయింది. సామాజిక మత రాజకీయ అంశాలపై పని చేసేవారు కూడా దీనికి మినహాయింపు కాదు. యాక్టివిస్టులు, రచయితలు, ఉపన్యాసకులు, నిజాలు నిర్భయంగా వెలికితీసే జర్నలిస్టులు మొదలైన వారిపై గురిపెట్టి, అశ్లీల, అసభ్య పదజాలంతో, వ్యక్తిత్వ హననం లక్ష్యంగా బెదిరింపులతో దాడులు చేయటం చూస్తున్నాం. పని విధానాలు, ప్రగతిశీల రచనలు, సమాచార విషయ వినిమయ విశ్లేషణలలో విమర్శనాత్మక దృక్పథం పట్ల అసహనం యొక్క అవాంఛనీయ వ్యక్తీకరణ అది. ఆయా రంగాలలో చురుకుగా పనిచేస్తున్న మహిళల ఆలోచనలు, అభిప్రాయాల పట్ల విద్వేష ప్రకటన అనేక రూపాలలో బహిర్గతం కావటం ఎప్పటికప్పుడు గమనిస్తూ, బాధపడుతూ, బాధిత స్త్రీలకు మద్దతుగా తన గొంతుకను ఇస్తూ వచ్చింది ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక.




ప్రతులకు సంప్రదించండి
వెల 180, మలుపు బుక్స్,
కాత్యాయిని విద్మహే,
94405 50379

ఆధునిక సమాజాలలో స్త్రీల ద్వారా జరుగుతున్న మతవ్యాప్తి గురించి హెచ్చరికతో వ్యాసం వ్రాసినందుకు మాలో ఒకరు అలా ట్రోలింగ్‌కు గురైన సందర్భం-సంస్థగా దీనిని గురించి ఆలోచించవలసిన, పని చేయవలసిన అవసరాన్ని గుర్తు చేసింది.

సమకాలీన సామాజిక రాజకీయ అంశాల మీద పని చేస్తున్న అనేకమంది మిత్రులు తరుచుగా ట్రోలింగ్‌కి, బెదిరింపులకి గురవడం రచయితలుగా మమ్మల్ని కలవరపెట్టింది. ఈ సందర్భాలను అర్థం చేసుకుని వారికి మద్దతు ప్రకటిస్తూ ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 2024 ఫిబ్రవరి 10, 11 తేదీలలో జరిగే ఏడవ మహాసభల సందర్భంగా ట్రోలింగ్ పైనే సభలు జరపాలని నిర్ణయం తీసుకుంది. ట్రోల్‌కు గురైన స్త్రీల అనుభవాలతో పుస్తకం తీసుకు రావాలన్న ఆలోచన వచ్చింది. 'మలుపు' ప్రచురణ సంస్థ ముందు ఈ ప్రతిపాదనని ఉంచాము. ఇది తప్పక రావలసిన పుస్తకమని ఎంవీ బాల్‌రెడ్డి గారు సహ ప్రచురణకర్తగా ముందుకు వచ్చారు. దాని ఫలితం ఈ పుస్తకం. ట్రోల్ వస్తువుగా పుస్తకం అనుకున్నప్పటి నుండి దాని చరిత్ర ఏమిటి, తత్వం ఏమిటి, ట్రోల్ నేపథ్యంలో ఎలాంటి సాహిత్యం వచ్చింది అన్న ప్రశ్నలతో కుతూహలంతో అధ్యయనం ప్రారంభించాం.

సంప్రదాయ స్కాండినేవియా కథలలో కొండల మీదనో, గుహలలోనో అసహ్యకరమైన చిత్రరూపాలతో ఉండే మాంత్రిక శక్తి గల చిన్నాపెద్దా జీవులు 'ట్రోల్' అన్న పేరుతో చెప్పబడ్డాయి. జానపద మానవుల భావనాత్మక ఊహాత్మక సృజనశక్తి మూలం 'ట్రోల్'. మానవులలోని బలహీనతలతో ఆడుకొనే ఆ జీవులను వీరోచితంగా ఎదుర్కొని విజయం సాధించటం గురించిన కథలు అక్కడినుండే పుట్టాయి. 1980లలో అంతర్జాలం మానవ జీవితంలో నిశ్శబ్ద విప్లవం తెచ్చింది. ప్రపంచం చిన్నదయింది. వినియోగదారుల మధ్య మొదలైన వెక్కిరింపులు, వేధింపులతో కూడిన సంభాషణకు- దాని ప్రత్యేక స్వభావాన్ని బట్టి- ట్రోల్ అనేమాట వాడుకలోకి వచ్చింది. అల్లరి, దురుద్దేశం, తప్పుడు సమాచారం, ఆధార రహిత ఆరోపణలు, విద్వేషం, విధ్వంసం మొదలైన వాటితో రాను రాను ఇది హానికర ప్రక్రియగా మారి పోయింది. అసాంఘిక చర్య అయింది. అహం కేంద్రీకృత భావాలు, మోసం, విషయాలను తారుమారు చేసే ధోరణి, సానుభూతి రాహిత్యం, మొహమాటం లేకపోవటం, ఇతరులను మాటలతో చేతలతో బాధపెట్టి ఆనందపడే తత్వం, విధ్వంసంలో

సంతృప్తి-ట్రోలింగ్ కారకాలుగా గుర్తించబడ్డాయి. పేరును, ముఖాన్ని దాచుకొని అంతర్జాలం వేదికగా ఆడే విద్వేష క్రీడ ట్రోలింగ్. అయితే ట్రోలింగ్ వ్యక్తులను, భావజాల సమూహాలను ఉద్దేశించింది మాత్రమే కాదు. కార్పొరేట్ ప్రయోజనాలకు విస్తృతమైన మార్కెట్లను అంతర్జాలం నిర్మించింది. ఇందులో గ్లోబల్ మార్కెట్‌ను ప్రభావితం చేసే ట్రోల్ ప్రపంచం కూడా ఉంది. అమ్మకపు కొనుగోలు వేదికల మీద ఆయా ఉత్పత్తుల గురించి వినియోగదారులు చేసే సమీక్షలు, వ్యక్తం చేసే సందేహాలు ఆయా ఉత్పత్తులకు సంబంధించిన సమాచారాన్ని వినిమయం చేయటం ద్వారా కొనుగోలుదారులను పెంచటానికో, తగ్గించటానికో ఉపయోగపడతాయి. అదే సమయంలో వినియోగదారుల అసందర్భ సమీక్షలు, అసంగత ప్రశ్నలు, అసభ్యకర, అసాంఘిక వ్యాఖ్యలు అమ్మకందారులను ఇరుకున పెట్టేవిగా, వేధించేవిగా ఉండటం కూడా తరచు జరిగేదే. ట్రోల్ చేసే అవకాశాలను గుర్తించే నేర్పు, మెసేజ్‌ని చక్కగా తయారుచేసి పెట్టే సామర్థ్యం, సమయోచిత, సందర్భోచిత స్పందన వున్నప్పుడు అది ఒక వినోదాత్మక క్రీడగా ప్రయోజనకరం అన్న అభిప్రాయం కూడా ఉంది. వ్యక్తీకరణలో వైవిధ్యం అంటూ అందుకు సమ్మతిని సమకూర్చే ప్రయత్నం చూస్తాం. మార్కెట్ మనుగడ, అవసరాలు, ప్రయోజనాల దృష్ట్యా ట్రోలింగ్ అక్కడ ఆమోదయోగ్యమే అవుతుంది.

ఇంటర్నెట్-మనిషి జీవితంలో, చదువులలో, వృత్తి వ్యాపార వ్యవహారాలలో విడదీయరాని భాగం అయిన తరువాత ఆన్‌లైన్‌లో ఉండే పిల్లల నుండి పెద్దల వరకూ ఏదో ఒక సమయంలో, సందర్భంలో ట్రోలవడానికి అవకాశాలు ఎక్కువ అని ప్రపంచ వ్యాప్తంగా అధ్యయనాలు, పరిశోధనలు చెబుతున్నాయి. అందువల్ల భయానికి, మానసిక ఒత్తిడికి, అనారోగ్యాలకు గురవుతూ, ఒక్కొక్కసారి తమ జీవన రంగాల నుండి దూరం అవుతూ ఒంటరితనంలోకి కుంగిపోతున్న వాళ్ళ గురించి ఆందోళనపడుతూనే దానిని ఎదుర్కొని నిలబడటం గురించి హెచ్చరించాయి. వాటిని పట్టించుకోకపోవటం, స్పందించక పోవటమే మంచిదని చెప్పాయి. Dont feed the Troll అన్నది సుప్రసిద్ధ ఉపదేశవాక్యం.

ట్రోల్‌ను ఉపేక్షించవలసిందే కానీ వాటితో యుద్ధం చేయాలనుకొంటే అవి ద్విగుణం, త్రిగుణం, బహుళం అవుతాయని వివరించి ఒప్పించటానికి seven ways to Trick a Troll(Lise Lunge-Larsen) వంటి చిత్రపటాలతో కూడిన పుస్తకాలు వచ్చాయి. ట్రోల్స్ జానపద గాథల ప్రకారం ఆకారంలో పెద్దవి, అసహ్యకరమైనవి, ప్రమాదకరమైనవి కావచ్చు. కానీ వాటి మెదడు వాల్నట్‌కన్నా చిన్నది అన్న విషయం అర్థం చేసుకొంటే విద్వేషపూరిత ట్రోల్‌ను ఎదుర్కొనటం సులభం అని. సహనం, దయ, ధైర్యం, సత్వర ఆలోచన ట్రోల్స్‌ను ఎదుర్కొనే ఉత్తమ మార్గాలని చెబుతాయి ఇలాంటి పుస్తకాలు. ఈ విషయంలో పిల్లలను సంసిద్ధం చేయటానికి వచ్చిన బొమ్మలతో కూడిన చిన్న కథల పుస్తకాలు అనేకం ఉన్నాయి.

ఇంటర్‌నెట్ రావటానికి ముందు కూడా ఇతరులను వేధించడం, బాధించడం, హాని తలపెట్టడం వుంది. అది సాంస్కృతిక సమస్య. సమాజంలో స్థిరపడివున్న పితృస్వామిక, మనుధర్మ విలువల సాపేక్షతలో సాహిత్య చరిత్ర పొడుగునా రచయితలు, సాహిత్య సందర్భాలు వేధింపులకు గురవుతున్న సందర్భాలు ఉన్నాయి. స్త్రీల విషయానికి పరిమితమై చూసినా రామాయణ కవులలో మొల్లను అల్ప ప్రజ్ఞురాలిగా పదేపదే చెప్తూ అధ్యయనానికి దూరం పెట్టటం, తెలుగులో తొలి సాహిత్య చరిత్రకారుడైన వీరేశలింగం పంతులు 'రాధికా సాంత్వనం' వ్రాసిన ముద్దుపళని వేశ్య అనీ, కనుకనే పచ్చి శృంగారాన్ని అలా వ్రాయగలింది అనీ, 'అది' అంటూ ఆమెను సంబోధిస్తూ న్యూనపరచి మాట్లాడటం వంటివి ఈ తరహాలోవే. తెలుగునాట స్త్రీవాద కవిత్వ ఉద్యమపు సమిష్టి వ్యక్తీకరణగా 1993లో 'నీలి మేఘాలు' కవితా సంకలనం వచ్చినప్పుడు దానిని నీలికవిత్వం అంటూ అవమానకరంగా రాసినవన్నీ ఈ పరిధిలోకే వస్తాయి.

స్వీయ అనుభవం నుండి వ్యక్తులుగా పాత్రికేయ రంగానికి చెందిన ఇద్దరు స్త్రీలు పరిశోధన చేసి వ్రాసిన పుస్తకాలు ఇచ్చిన అవగాహన ఈ పుస్తక సంపాదకత్వ పనిలో మాకు బాగా ఉపయోగపడింది. ఆ ఇద్దరు స్త్రీలలో ఒకరు స్వాతి చతుర్వేది. భారతదేశపు పాత్రికేయురాలు. ఆమె వ్రాసిన పుస్తకం I Am A Troll ; Inside the Secret world of the BJPs Digital Army(జనవరి 2017). మరొక స్త్రీ ఆస్ట్రేలియా దేశపు పాత్రికేయురాలు జింజర్ గొర్మన్ (Ginger Gorman). ఆమె వ్రాసిన పుస్తకం Troll Hunting; Inside the world of online Hate and its Human Fallout (ఫిబ్రవరి 2019).

కాశ్మీర్‌లో తీవ్రవాదాన్ని అణచివేయటం పేరుతో భారత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు స్థానికులకు ప్రమాదకరం, ప్రాణాంతకం అవుతుండటాన్ని విమర్శకు పెడుతూ వ్రాసిన కథనాల కారణంగా స్వాతి చతుర్వేది అంతర్జాలంలో విపరీతమైన ద్వేషపూరితమైన ట్రోల్‌కు గురైంది. ఆ విషయంలో పోలీసు స్టేషన్లలో కేసులు పెట్టింది. అసలీ విధమైన ట్రోల్ ఎందుకు జరుగుతున్నది ? ఎవరు కారకులు ? ఎవరు ప్రేరకులు అని లోతుగా పరిశోధించి అనేక మందిని ఇంటర్వ్యూ లు చేసి I Am A Troll పుస్తకం రాసింది. ఈ పరిశోధనలో అధికారంలో ఉన్న బిజెపి రహస్య డిజిటల్ సైన్య నిర్మాణ వ్యూహాలు బయట పెట్టింది. జింజర్ గొర్మన్ 2013లో ఇంటర్వ్యూ చేసిన స్వలింగ సంపర్కుల జంట - తమ ఇంట్లోని ఆరేళ్ళ పిల్లాడిని లైంగికంగా హింసించి, అరెస్టయి జైలు శిక్ష పొందారు. సమాజంలో వెలివేతకు, హింసకు, నిస్పృహకు గురవుతున్న ఏక లింగ, స్వలింగ

సంపర్కులు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల గురించి గౌర్మన్ అంతకు మూడేళ్ళ ముందు వ్రాసిన వ్యాసాన్ని పై ఉదంతంతో ముడి పెడుతూ అంతర్జాలంలో విపరీతంగా వేధింపులకు గురిచేశారు. చంపుతామని బెదిరించారు. ఆ సందర్భంలో మొదలు పెట్టి అంతర్జాల విద్వేష కారకులను, కారణాలను గుర్తించటానికి అయిదేళ్లపాటు ఆమెచేసిన పరిశోధన ఫలితం Troll Hunting.

ఈ పాత్రికేయులు ఇద్దరూ తమపై జరిగిన ట్రోలింగ్ గురించి చెప్పుకొనటంతోపాటు, దానికి కారణమైన వ్యవస్థల ఉనికిని గుర్తించి వివరించటంపై శ్రద్ధ పెట్టారు. అంతర్జాల గుండాల వెనుక, అశ్లీల రాతగాళ్ల వెనుక, అసత్యాలను సత్యాలుగా ప్రచారం చేసే వాళ్ళ వెనుక కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ ఉన్నదని, అది ముస్లిముల పట్ల విద్వేషాన్ని, ప్రభుత్వ రాజకీయార్థిక విధానాల పట్ల భిన్నాభిప్రాయం ఉన్నవాళ్ళ పట్ల అసహనాన్ని వెళ్లగక్కటానికి అంతర్జాల సైన్యంతో ట్రోలింగ్‌లు జరిపిస్తున్నదని స్వాతి చతుర్వేది అనేక ఆధారాలతో నిర్ధారించి చెప్పింది. దేశంలో పెరిగిపోతున్న అసహనాన్ని గురించి ఆందోళన వ్యక్తం చేసిన షారూక్‌ఖాన్, దానికి కొనసాగింపుగా అసహనం అభద్రతకు కారణమవుతున్నదని చెప్పిన అమీర్ ఖాన్ సినిమా రంగ ప్రముఖులు. అయినప్పటికీ ముస్లిములు కావటం వల్ల అంతర్జాలంలో విద్వేషపు వేధిపులకు గురి కావలసి వచ్చిన విషయాలను వివరిస్తూ స్వాతి చతుర్వేది, వాళ్ల సినిమాల విడుదలను అడ్డుకొనటానికి, వాణిజ్య ప్రకటనల నుండి వాళ్ళను తప్పించటానికి బీజేపీ రాజకీయ శక్తులు చేయించిన అల్లరిని, వాణిజ్య కంపెనీల మీద తెచ్చిన ఒత్తిడిని గురించి చెప్పింది. ఆమె చెప్పిన విషయాలు ట్రోల్ అన్నది నిరపేక్ష విషయం కాదని రాజకీయ ప్రయోజనాలతో నిర్వహించబడుతూ ఆర్థిక ఆధిపత్యాన్ని స్థాపించగల వ్యవస్థ అని సూచిస్తాయి. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలను గణనీయంగా ప్రభావితం చేయగల ట్రోలింగ్ గురించి మాట్లాడటం ఎంత మాత్రం ఎలీట్ వ్యవహారం కాదు.

కార్పొరేట్ దిగ్గజాలు, హిందుత్వవాదులు, స్వయంగా బీజేపీకి చెందిన ప్రజా ప్రభుత్వ ప్రతినిధులు ట్రోల్ సామ్రాజ్య బలమని తెలిసినప్పుడు దిగ్భ్రాంతి కలగకమానదు. ప్రతిపక్షపార్టీల ప్రతినిధులు ట్రోల్స్‌కు మినహాయింపు కాదు. అటువంటప్పుడు స్వతంత్ర భావాలు గల మహిళలు ట్రోలవడంలో ఆశ్చర్యం ఏముంది? లైంగిక ప్రతీకలతో అవమానించటం, అగౌరవకరం గా చూడటం మహిళలు ఎదుర్కొనే అదనపు ఆరళ్ళు.

ప్రభుత్వమే ట్రోల్‌ను యుద్ధ వ్యూహంగా చేసుకున్నప్పుడు పోలీసు న్యాయ వ్యవస్థలు దానికి బలైన వాళ్ళ పక్షాన చర్యలు తీసుకొంటాయని ఆశించటం అత్యాశే. ట్విట్టర్, ఫేస్ బుక్ మొదలైన సంస్థలు తమ వినియోగదారులకు వాగ్దానం చేసిన న్యాయపరమైన హామీలను నెరవేర్చగల స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోయి, ఆర్థిక ప్రయోజనాల స్వార్థంతో పాలకుల చేతిలో తోలుబొమ్మలు అవటం చూస్తున్నదే. వాటన్నిటినీ పౌర సమాజం దృష్టికి తెచ్చింది స్వాతి చతుర్వేది.

జింజర్ గౌర్మన్ - స్వాతి చతుర్వేది వలెనే ట్రోల్‌కు గురయిన వాళ్లను, ట్రోల్ చేసేవాళ్లను, వాళ్లకు చెందిన సమూహాలను, న్యాయ సంబంధమైన వ్యక్తులను, మనస్తత్వ వేత్తలను, విద్యా వేత్తలను కలిసి మాట్లాడి వ్రాసింది Troll Hunting పుస్తకాన్ని. ఆ క్రమంలో తనకు చాలా భ్రమలు తొలిగి పోయాయి అంటుంది. ట్రోల్స్ చేయటానికి ప్రపంచమంతా విస్తరించిన వ్యవ స్థీకృత సిండికేట్లు ఉన్నాయని, ఆ సిండికేట్లకు పరస్పర సంబంధాలు ఉండటమే కాదు మొత్తంగా అంతర్జాతీయ నేర వ్యవస్థలతో అనుసంధానించబడి ఉంటాయని గుర్తించి చెప్పింది.

స్వాతి చతుర్వేది పరిశీలనలో ట్రోల్ చేసేవాళ్లు ఎక్కువ చదువుకున్నవాళ్ళు కాదు, ఇంగ్లీష్ సరిగా మాట్లాడలేరు. ఆత్మ న్యూనతతో ఉంటారు. కానీ జింజర్ అనుభవంలో వాళ్ళు బాగా చదువుకొన్నవాళ్ళు. అమాయకులసలే కాదు. ట్రోల్ అంతర్జాల వాచాలత్వమే కానీ భౌతికంగా దెబ్బతీయవని అనుకొనటం సరి కాదంటుంది. ట్రోల్ చేసేవాళ్ల చిత్తశాంతిని భగ్నం చేస్తూ వాళ్ళ పెంపుడు జంతువుల మీద దాడులు చేయటాన్ని కూడా ఆమె గుర్తించింది. నోరున్న ఫెమినిస్టులు మాత్రమే ట్రోల్ కు గురవుతారన్నది కూడా భ్రమే అని ఆస్ట్రేలియాలో 34 శాతం పురుషులు, 44 శాతం స్త్రీలు ఆన్ లైన్ వేధింపులకు గురవు తున్నారని ఉదహరిస్తూ చెప్పింది. మగవాళ్ళు మత, జాతి, రాజకీయ విశ్వాసాలకు ట్రోలవుతుంటే స్త్రీలకు తరచూ లైంగిక వేధింపులు, అవాంఛిత సెక్స్ మెసేజ్‌లు ఎదురవుతూ వుంటాయి. వ్యక్తిగత జీవితం పబ్లిక్ చర్చకు పెట్టబడుతుంది. ట్రోల్స్ వాటంతట అవి పుట్టవని, మనం నివసిస్తున్న సమాజ లక్షణాలే వాటిని ఉత్పత్తి చేస్తాయని జింజర్ అభిప్రాయం.

హింసామయ, నిర్లక్ష్యపూరిత కుటుంబ వాతావరణం, చిన్న తనం నుండే ఇంటర్ నెట్ మీద ఒంటరిగా వదిలివెయ్యబడటం వంటివి కోపం, కసి, ద్వేషం వంటి లక్షణాలతో వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేస్తాయని, అలాంటివాళ్ళు సులభంగా ట్రోలర్స్ అవుతారని ఆమె భావిస్తుంది. బహుముఖ పౌర సమూహాల ప్రతిస్పందనలు, చట్టాన్ని, న్యాయాన్ని, అమలుచేయవలసిన యంత్రాగం, సోషల్ మీడియా కంపెనీలు ట్రోల్స్ నియంత్రణకు సహకార వ్యవస్థలుగా అభివృద్ధి చెందాలని ఆశించింది. కానీ అదే సమయంలో అవి బాధితుల పక్షాన నిలబడటం లేదన్న వాస్తవాన్ని కూడా గుర్తించి చెప్పింది.

ఇలా ఈ ఇద్దరు - ఒకరు దేశం నుండి, మరొకరు విదేశం నుండి-ఒకటి రెండేళ్లు ముందు వెనకలుగా ట్రోల్ కు గురయి, స్వీయాత్మక అనుభవాన్ని సాధారణీకరించి, వస్తుగత దృష్టితో విశ్లేషించిన మహిళలు. ఈ మార్గంలో తెలుగు సమాజంలో

ట్రోల్‌కు గురైన మహిళల అనుభవ కథనాలను సమీకరించి పుస్తకం తీసుకొని రావటం సమకాలపు అవసరంగా, ట్రోల్ బాధిత మహిళలకు నైతికమద్దతు ఇవ్వడంగా భావిస్తున్నది ప్రరవే. చాలాసార్లు ట్రోల్స్ ప్రత్యేక వ్యక్తిని లక్ష్యంగా చేసుకొని జరిగేవే అయినా అవి వ్యక్తిగతం కాదు. వ్యక్తిగతం అనుకొనటం, అనటం ప్రశ్నించే గొంతును ఒంటరి చేసి, న్యూనపరచి నిష్క్రమించేలా చేయటమే. ట్రోల్స్ వెనక ఉన్న పితృస్వామిక కౌటుంబిక, కుల, మత, ఆర్థిక, అధికార రాజకీయాలను గురించిన చర్చను ప్రారంభించటానికి ట్రోల్‌కు గురైన మహిళల అనుభవ కథనాలు ఒక దగ్గరకు తీసుకురావటం అవసరం అని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక భావించింది. ఇది సమకాలపు సమస్య. తెలుగు సమాజంలో ట్రోలవుతున్న వాళ్ళు చాలా వరకు మాకు తెలిసిన వాళ్లు, స్నేహితులూ అయినప్పటికీ జాబితా సిద్ధం చేయడానికి కొంత కసరత్తు అవసరం అయింది. సాహిత్య, పత్రికా, సామాజికోద్యమ రంగాలలో పని చేస్తూ ట్రోలయిన వారిని అడగాలని అనుకున్నాం. అందులో మా పరిధి మేరకు కొన్ని పేర్లు గుర్తించి అడిగాము. చాలా వరకు అందరూ అంగీకరించారు. ఇద్దరు ముగ్గురు వ్యక్తిగత కారణాలతో కాదన్నారు.

**అనుసరించిన పద్ధతి :**

ఎవరి అనుభవాలు, వాటి వ్యక్తీకరణలు వారివే అయినా పుస్తకంగా తీసుకు రావాలనుకొన్నప్పుడు సాధారణ ఏకసూత్రత అవసరం కనుక అందుకు సహాయకారిగా ఉంటుందని ప్రశ్నావళిని రూపొందించాం. అందులోని ప్రశ్నలు ఇవి :

- మీ సాహిత్య, సామాజిక, వృత్తి రంగాల నేపథ్యం, చేస్తున్న కృషి. మీ మీద మొదటిసారి ట్రోలింగ్ ఎప్పుడు జరిగింది, ఏ అంశంలో జరిగింది?
- ఎటువంటి దాడిని ఎదుర్కొన్నారు, కొనసాగుతూ వస్తున్నదా, ముగిసిందా?
- ట్రోలింగ్ మీకు కలిగించిన ఆందోళన ఎలాంటిది, దానికి మీ తక్షణ స్పందన ఏమిటి?
- ఆ సమయంలో కుటుంబ సభ్యుల స్పందన ఏమిటి?
- మిత్రులు, వృత్తిపర సంఘాలు స్పందించిన తీరు ఏమిటి?
- ఆ తరువాత మరెప్పుడైనా ట్రోలింగ్‌కు గురయ్యారా, ఆ సందర్భాలు ఏమిటి?
- ట్రోలింగ్ వల్ల కలిగిన అలజడిని ఎలా సంబాళించుకొన్నారు?
- మీ మీద జరిగిన ట్రోలింగ్‌కి తక్షణ కారణాలు, మూలాలు ఏమై ఉంటాయి?
- వ్యవస్థీకృత కారణాలు ఏమై ఉండవచ్చు?
- మీలా ట్రోలింగ్‌కు గురైన వాళ్ళ పట్ల మీ స్పందన, ఆచరణ ఎలాంటివి?
- పురుషులు కూడా ట్రోలింగ్‌కి గురవుతూ ఉంటారు కదా, స్త్రీలపై ట్రోలింగ్ దీనికన్నా ఎలా భిన్నమైనది?
- ట్రోలింగ్‌ను అరికట్టటం సాధ్యమేనా, సాధ్యమే అనుకొంటే అందుకు మార్గాలు ఏమిటి?

ఇవి అవగాహన కోసం రూపొందించినవే. కానీ ఎవరికి వారు తమ అనుభవ వ్యక్తీకరణ సమగ్రం కావడం కోసం అనుబంధంగానో, అదనంగానో కొత్త అంశాలు చేర్చుకోవచ్చని సూచించాం. అలా వచ్చిన వాటిని చదివి కొన్ని కొత్త ప్రశ్నలు, సందేహాలు, సూచనలను వాళ్లకు తెలియచేస్తే ఇష్టంగా వివరణలు వ్రాసి పంపారు. వాటిని చేర్చి, అనుభవ కథనాలుగా ఎడిట్ చేశాం. తుది ప్రతిని ఎవరిది వాళ్లకు పంపి ఆమోదం పొందిన తరువాతి రూపం ఈ పుస్తకం. ఈ పుస్తకం పని క్రమం లో తెలుగు సమాజంలో ట్రోల్‌కు గురవుతున్న పురుషుల అనుభవాలను, ట్రోల్ పట్ల, ప్రత్యేకించి మహిళలపై జరుగుతున్న ట్రోల్ పట్ల ప్రజాస్వామికవాదుల, రచయితల అభిప్రాయాలు సంక్షిప్తంగా అయినా సేకరించి చేర్చాము.

ఈ పుస్తకంలో పదిహేను మంది స్త్రీల అనుభవ కథనాలు ఉన్నాయి. వాళ్ళు భిన్న సామాజిక వర్గాలకు ప్రతినిధులు. కులం, జండర్, మత, మైనారిటీల సమస్యలపై పని చేస్తున్నవాళ్ళు, వివక్షారహిత లోకాన్ని ఆకాంక్షిస్తున్న వాళ్ళు, ప్రజాస్వామిక భావ చైతన్య ప్రసారానికి అవరోధం అవుతున్న వాటిని తొలగించుకొంటూ పోవాలని ఆశిస్తున్నవాళ్ళు, అందుకొరకే మాట్లాడుతున్న వాళ్ళు, వ్రాస్తున్న వాళ్ళు, సృజన సాహిత్యకారులు, పత్రికా రచయితలు, క్షేత్రస్థాయి కార్యకర్తలు. వ్యక్తిగతం కూడా రాజకీయమైన చోట - ఎద, మెదడులను ఏకకాలంలో వేధించే బాధ ఏదో వాళ్ళను ఈ పనులకు తరుముతున్నది. వాళ్ళు అంతర్జాల వేదికలను ఉపయోగించుకొనటం కూడా ఆ పనులకు విస్తరణగానే చూడాలి. అయితే వాళ్ళు అందుకు చెల్లిస్తున్న మూల్యం ఏమిటో ఈ కథనాలు చెప్తాయి.

**ఇవి ప్రధానంగా చర్చకి పెట్టిన అంశాలు**

- సమకాలీన ఘటనల నుండి, సందర్భాల నుండి స్త్రీల నిత్యజీవితంలో ఆచారాలు, నోములు, వ్రతాలు, కట్టు బొట్టు పేరిట కనిపించకుండా అమలవుతున్న పితృస్వామిక అధికార రూపాలను గుర్తించి విమర్శకు పెట్టటం.
- స్త్రీల లైంగికత, లైంగిక సంబంధాల గురించి చర్చించటం.
- దళిత స్త్రీ బయట నుండి, లోపలి నుండి ఎదుర్కొంటున్న వివక్షగురించి చర్చించటం.
- మనుషుల మధ్య నిచ్చెన మెట్ల అధికార సంబంధాలను

కుటుంబం పేరిట, కులం పేరిట, మతం పేరిట, రాజ్యం పేరిట స్థిరీకరించిన మనుస్మృతిని ప్రశ్నించటం.

- మనువాదుల వాదనలను తిప్పికొట్టటం.
- శాస్త్రీయభావాలను, ఆచరణలను విమర్శించటం, వ్యతిరేకించటం.
- ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలను, కార్యక్రమాలను విమర్శిస్తూ సరైన అవగాహనను కల్పించే ఆచరణలో ఉండటం.

రాజ్యాంగం ప్రకారం సమానత ప్రాతిపదికగా నూతన సమాజం వికసించటానికి ఇవన్నీ అడగవలసినవే. చేయవలసినవే. కానీ మాట్లాడవలసినవే మాట్లాడుతున్నందుకు, వ్రాస్తున్నందుకు వీళ్ళు ఎందుకు ట్రోలవుతున్నారు? అందరికీ అన్ని అవకాశాలు సమంగా ఉండే సమాజం అవసరం లేదనుకొనే అప్రజాస్వామిక మూకలతోనే దేశం నిండి ఉన్నదని సమాధానం. ఓటు వేయటానికి లభించిన సమాన అవకాశం సరిపోదు. రాజ్యాంగబద్ధమైన హక్కులన్నీ అందరికీ జీవిత వాస్తవం కావాలని అంబేడ్కర్ ఆశించాడు. అందుకు రాజ్యాంగ నైతిక దృక్పథాన్ని ప్రజాసమూహాలలో కలిగించటం స్వతంత్ర భారత ప్రభుత్వాల బాధ్యత అని నొక్కి చెప్పాడు. అయితే అది పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిందని ట్రోల్ సందర్భం మరొకసారి గుర్తుచేస్తున్నది.

ట్రోల్‌కు గురయిన మహిళల కథనాలలో కొంత మంది ఒక విషయంలో ఆందోళన పడటం కనిపిస్తుంది. అప్రజాస్వామిక మూకదాడులను, ముఖం లేని దాడులను ఊహించవచ్చు. అవస రం అనుకొంటే ప్రతి సమాధానం చెప్పవచ్చు. కాదనుకొంటే ఉపేక్షించవచ్చు. కానీ ఊహించని మూలల నుండి, మిత్ర సమూహాల నుండి, భావజాల ఐక్యత గల వర్గాల నుండి ట్రోల్ తరహా వేధింపులు జరుగుతుంటే తట్టుకొనటం ఎలా అన్నది వాళ్ళ వేదన. ఆర్థిక, రాజకీయ అధికార ప్రయోజనాల కొరకు అంతర్జాల వేదికలను ఆక్రమించిన పెత్తందారీ వర్గాలు చేరదీసి శిక్షణ ఇచ్చి వదిలిన అప్రజాస్వామిక అతి బలహీన స్వార్థపర ఏకాక్షి మూకలో, ఆ అధికార సంస్కృతి మాయ కమ్మిన వ్యక్తులో చేసే విచక్షణా రహిత నిందారోపణలకు, అసంబద్ధ, అసహన వ్యాఖ్యలకు-ప్రజాస్వామిక ఆచరణలో ఉన్న వాళ్ళ సంభాషణకు మధ్య గీత చెరిగిపోవటం ప్రమాదకరం కాదా అన్నది ప్రశ్న. స్థూలంగా ప్రజాస్వామిక చైతన్య చట్రంలో ఇమడగలిగిన వాళ్లే అప్రజాస్వామిక సంభాషణకు ఉత్సాహపడితే అది ఫాసిస్టు శక్తులు పండగ చేసుకొనటానికే ఉపయోగ పడుతుంది.

అనేక వైరుధ్యాల మధ్య, సంక్లిష్టతల మధ్య జీవిస్తున్న మను షులందరి చైతన్యస్థాయి, ఆచరణ ఒకే రకంగా ఉండటానికి వీలుందా ? ఉండాలని ఆశించటం, స్వీయ కొలమానాలతో తీర్పులు ఇయ్యటం బహుళత్వాన్ని చిదిమేసే రాజకీయాలకు బలం చేకూర్చటమే అవుతుంది కదా!? ఆ కొలమానాలు అందరి విషయంలో సమానంగా అన్వయించబడుతున్నాయా? విడివిడి వ్యక్తుల ఆచరణలను అంచనా వేయడం మొదలు పెడితే అది అనేక ద్వంద్వాలకు కారణం అవుతుంది. అలాగని ఈ కథన కర్తలు తాము విమర్శకు అతీతులమని కూడా అనుకొనటం లేదు. తమ భావాలు, వ్యక్తీకరణలు, ఆచరణలలో లోపాలు ఉంటే స్నేహపూర్వకమైన విమర్శకు, ఇంత చర్చకు చోటు మిగుల్చుకొందాం అంటున్నారు.

ట్రోల్‌కు గురైనవాళ్లు కూడా తమ భావజాలానికి అటో ఇటో కాస్త జరిగారనో, వ్యతిరేకించారనో ఇతరులను ట్రోల్ చేయటం, సామాజిక మాధ్యమాలలో వేధింపులకు గురవుతున్న ప్రగతి శీలురు-తాము మనువాద మత రాజకీయాలను వ్యతిరేకిం చేటప్పుడు ట్రోల్ భాషనే ఆశ్రయించటం ఇప్పటి వాస్తవమే కావచ్చు. కానీ అది కొనసాగించవలసిన సంప్రదాయం మాత్రం కాదు. అభిప్రాయాల మీద చర్చ ఎప్పుడూ కోరదగినదే. కానీ అభిప్రాయాలను వ్యక్తం చేసిన వ్యక్తులను ఎద్దేవా చేసి మానసికంగా, నైతికంగా గాయపరచడం వలన ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతిని అభివృద్ధి పరచగలుగుతున్నామా అని ఆత్మ విమర్శ చేసుకొనవలసిన సందర్భం ఇది. అదే సమయంలో పీడితులు తమకి జరిగే అన్యాయాలకి స్పందనగా ఆగ్రహాన్ని వ్యక్తం చేసేటపుడు సంయమన పూర్వక భాష ఉండాలని కోరుకోవడంలో అర్థం లేదు. కానీ అది పాటించవలసిన ఆదర్శం కాదనీ, నిస్సహాయ క్రోధాన్ని వెలికి తీసే ఒక అవుట్ లెట్ మాత్రమేనన్న ఎరుక మిగతా వారికి ఉండాలి.

ఈ పుస్తకంలోని స్త్రీలు ప్రశ్నించారు. మతతత్వానికి ఎదురుగా నిలబడి లౌకికత సంగతి ఏమిటన్నారు. స్త్రీల శరీరాలపై స్త్రీలకే హక్కు లేదా అన్నారు. మైనార్టీలు మనుషులే వారికి హక్కులు ఉంటాయన్నారు. కొన్ని కులాలకి ఆధిక్యం ఎందుకు అనడిగారు. రాజకీయ పార్టీల ప్రహసనాలను కళ్ళకి కట్టారు. మూఢ నమ్మ కాలు వద్దు, సైన్స్‌ని నమ్మమన్నారు. ఎవరి ఆహారం వారిష్టమని అన్నారు. వీరంతా భిన్నత్వాన్ని కోరుకున్నారు. వ్రాశారు, మాట్లాడారు, చర్చించారు. అందుకుగాను తీవ్రమైన ట్రోలింగ్ కి గురయ్యారు. పోర్న్ సైట్లలో అమ్మకపు సరుకుగా మార్చ బడ్డారు. కేసులు, బూతులు, బెదిరింపులు, అవమానాలు, అవహేళనలు, నిరంకుశ ఉపదేశాలు - అన్నీ భరించారు. బాధ, దుఃఖం, ఆగ్రహానికి గురవుతూ కూడా తాము నమ్మిన విలువలు, విశ్వాసాల వ్యాప్తి కోసం, నిలిచి పోరాడుతున్న స్త్రీలతో సంభాషణకు తలుపులు తీస్తుంది ఈ పుస్తకం. ఏక మత రాజ్యస్థాపన కోసం భిన్నాభిప్రాయాలను బుల్డోజ్ చేసుకుపోతున్న వర్తమాన అధికార రాజకీయాల అంధకారంలో ఒక ఆశను వాగ్దానం చేస్తుందీ పుస్తకం. ❑

# ఇవీ మన మూలాలు!

పుస్తక పరిచయం

- వి.విజయకుమార్




These are our roots!

**మానవ ప్రస్థానం గురించీ, మరీ ముఖ్యంగా 'మన' మూలాల గురించీ తెలుగులో ఒక సాధికారిక గ్రంథంగా ఇటీవల విడుదలైన 'ఇవీ మన మూలాలు' లో "మన విశ్వాసాలూ, ఇష్టాయిష్టాలూ, రాజకీయ అవసరాలదీ కాకుండా, శాస్త్ర పరిశోధనల్లో జ్ఞానానిది పైచేయి అయినంత వరకూ ఆ పరిశోధన క్రమంలో ఎలాంటి ఫలితాలు వచ్చినా, వాటిని తెరచిన బుద్ధితో ఆహ్వానించడమే మనం చేయగలిగిందీ, చేయవలసిందీ" అంటారు కల్లూరి భాస్కరం.**

"ఒక్క మన దేశానికి మాత్రమే పరిమితమై చెప్పుకుంటే, జన్యు పరిశోధనలు భారత్‌లోకి ఆర్య ఇండో-యూరోపియన్ జనాల వలసను స్పష్టీకరించిన దరిమిలా, జనం సెంటిమెంటును వాడుకునే రాజకీయానికీ, జ్ఞాన రంగానికీ మధ్య ఒక అసమ యుద్ధం ముమ్మరమైంది. ధర్మ పోరాటంలో తాను ఓడిపోతున్న పరిస్థితుల్లో రాజకీయం తమకు కలిసివచ్చే మేధావులూ, మీడియా సాయంతో అసత్యాలూ, అర్ధసత్యాలూ వక్రీకరణలే ఆయుధాలుగా అధర్మ పోరాటానికి దిగింది. అంతకన్నా కూడా అసలా చర్చ మీదే తెరదించేసి వ్యూహాత్మక మౌనం పాటించడమే మంచిదని కూడా క్రమంగా భావించినట్లు కనిపిస్తోంది"

నిజానికి కల్లూరి భాస్కరం గారి ఈ వాక్యాలే ఈ పుస్తకానికి ఆలంబన. ఇవీ 'మన' మూలాలు అనగానే మనకు తట్టేది ఒక గర్వాతిశయం. మన పూర్వీకుల గురించి గర్వంతో ఉప్పొంగి పోవాలన్న ఆసక్తి! ప్రతీ మానవుడికీ ఇది సహజమేనేమో! మన జననం, మన జనం, మన ఊరు, మన దేశం, మన తాత ముత్తాతలు, మన వంశవృక్షం అబ్బా, ఈ 'మన'లో ఎంత ఆకర్షణ వుంది! ఈ అవ్యాజమైన అనురాగాన్ని ఏ జన్యువు పెంచి పోషించిందో తెలీదు కానీ, మన మూలాల గురించి తెలుసుకో వాలన్న తపన మనని నిరంతరం ఉత్సాహంతో నింపేస్తుంది. ఈ సందర్భంలో అలెక్స్ హేలీ రాసిన 'ది రూట్స్' మనని అమితంగా ప్రభావితం చేసిన పుస్తకాల్లో ఒకటి.

ప్రాణికోటి ప్రస్థానం అంతా కలగాపులగం. అదేమీ అధ్యాయాలకు అధ్యాయాలు ఏదో మెథడలాజికల్‌గా, పద్ధతిగా




**ఈ పుస్తకం లభ్యమయ్యేచోటు**

**అనల్ప బుక్ కంపెనీ, ఫోన్ : 70938 00303**

**సంప్రదించండి : కల్లూరి భాస్కరం, 97034 45985**

**వెల : రూ.450**

అల్లుకుపోయిన కథేమీ కాదు. నిజానికి అదొక పేజీలు చిరిగిన పుస్తకం. అన్నీ అతుకుల బొంతలు. తదుపరి పేజీలో క్లూ దొరుకుతుందన్న ఉత్సాహంతో పేజీ తిప్పితే అక్కడ ఆ పేజీనే గల్లంతై ఉంటుంది.

తొలి మానవ ఆనవాళ్లు మొదలయ్యాక వాటి వలసలన్నీ అయోమయంగా ఊహకు అందనంతగా, ఎటువంటి ఆధారాల్లేకుండా పోవడానికి చాలా కారణాలే ఉన్నాయి. మనం భూగోళంగా భావించే ఈ మట్టి(నీటి) ముద్ద ఒకప్పుడెలా ఉందో, ఆ తర్వాత అది పెళ్ళలుగా విడిపోయి ఖండాలుగా అవతరించినప్పుడూ, మంచు యుగాలు కొనసాగినప్పుడూ, జల ఖండాలు విడదీసినప్పుడూ, అగ్ని పర్వతాలు బద్దలైనప్పుడూ ఎలా రూపు రేఖలు మార్చుకుందో నిరాధారం. మానవ మనుగడ మొదలయ్యే అనేక దశల్లో ఆ ఖండ భాగాలు చెల్లాచెదురై, గుంపులు గుంపులుగా కలిపి వుంచిన తొలి మానవ ప్రాణుల

మధ్య అగాధాలు సృష్టించినా, ఒక చోటు నుంచి ఇంకొక చోటుకు వెళ్లి మరొక గుంపుతో సంపర్కాలు జరిపి, తమ జన్యువుల్లో అన్ని గుంపుల తాలూకూ లక్షణాలను ఎలా మోసు కుంటూ తిరిగారో అంతా అనూహ్యం. అయినప్పటికీ, ఒకచోట స్థిరపడే వరకూ కొనసాగిన ఆ మానవ మహాప్రస్థానాన్ని, గల్లంతయిన పేజీలను జాగ్రత్తగా పేర్చుకుంటూ, సరిచేసుకుం టూ, నిర్మించు కురావడం చాలా ఆసక్తికరం. ఈ ఆసక్తికర కథనాన్ని ఈ పుస్తకం నిష్పక్షపాతంగా మన ముందుంచే ప్రయత్నం చేసింది. చార్ల్స్ డార్విన్, టోనీ జోసెఫ్, డేవిడ్ రైక్, రూథర్ ఫర్డ్, డేవిడ్ అంతోనీ వంటి వారి అద్భుత పరిశోధనా ఫలితాలను ఉటంకిస్తూ సాగిన ఈ రచన బీజాంకుర దశ నుంచి, అంటే ఎక్స్, వై క్రోమోజోముల నుంచి మొదలై, హద్దుల్లేని భూగోళ మంతా చుట్టి, ఆర్యావర్తం వరకూ వచ్చి అంతమవుతుంది. స్థల, కాలాల సరిహద్దుల ఊహాజగతి ఒక్కసారిగా విస్తృతమై, దిగంతాలు దాటి వెతుక్కుంటూ వెళ్లి, అన్వేషణ పూర్తయ్యాక మన హృదయాలు కుంచించుకు పోవడానికి బదులు విప్పారుతాయి. కుల, వర్ణ, వర్గ, జాతి స్పృహలు లేని ఒక మహోన్నత సమాజంలో విశ్వ మానవ ప్రాణిగా వికసించాల్సిన అవసరాన్ని ఈ పుస్తకం మన హృదయంలో నాటుతుంది. ఈ పుస్తకం పూర్తయ్యాక, మానవ సమాజం పట్ల ఒక గొప్ప గ్రంథానికి వుండాల్సిన బాధ్యత ఇంతకంటే వేరే ఏదో ఉంటుందనుకోవడం పొరపాటనిపిస్తుంది.

ఈ గ్రంథం మహా వానరాలైన చింపాంజీలూ, బోనోబోలు, ఒరాంగుటాన్లూ, గొరిల్లాలు, హోమోలు (24 జతల క్రోమోజోములు కలిగిన) నుంచి విడిపోయి, 23 జతల క్రోమోజోములు కలిగిన మనిషి తొలిసారిగా కనబడటం మొదలుపెట్టిన 32 లక్షల సంవత్సరాల క్రితం నుంచీ ప్రారంభించి, 19 లక్షల సంవత్సరాల క్రితం ఆఫ్రికా నుంచి వేరే ప్రాంతాలకు విస్తరించడమూ, 7 లక్షల సంవత్సరాల క్రితం వునికిలోకి వచ్చిన హోమో సేపియన్స్, నియాండర్తల్ అనే రెండు మానవ రకాల పరిశీలనతో ప్రారంభమవుతుంది. నియాండర్తల్ మగ ప్రాణి లక్ష సంవత్సరాల క్రితం ఈ హోమో సేపియన్స్ ఆడిపాణితో జత గూడడమూ, నియాండర్తల్ రకం అంతరించిపోయినా, ఇప్పటికీ మనలో 'కెరాటిన్' జన్యు అవశేషాన్ని మోసుకు తిరిగడమూ అనే ఒక్క ఉదాహరణతో మన సజాతీయ గుంపుల మధ్య సంపర్కాలు ఖండాలు దాటి ఉన్నాయన్న వాస్తవం గగుర్పాటు కలిగిస్తుంది.

మానవ చరిత్రలో తొలి మహత్తర విప్లవం వ్యవసాయమనీ, వ్యవసాయం కోసం ప్రాదేశిక భావన బలపడి రాజ్యావతరణకు ఎలా దారి తీసిందో, ఈ ప్రాదేశిక భావన వెనక అసలు నిజం ఆస్తుల స్వంతమూ, వాటిని కాపాడుకోవడం కోసమేననేది సరిహద్దుల గీతలు, కంచెలు, గోడల్లో చూడొచ్చుననే నిజాన్ని బయట పెడుతుంది. ఇలాంటి అద్భుత సూత్రీకరణలు ఈ పుస్తకంలో చాలా ఉన్నాయి. ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డేవిడ్ రైక్, హిటైట్ లిపి ఛేదించిన ప్రముఖ పురాతత్వ భాషావేత్త బెడ్రిక్ హ్రోజ్నీ నీ ప్రస్తావిస్తూ, వ్యవసాయ విప్లవం పారిశ్రామిక విప్లవంతో పోల్చదగ్గ మహా విప్లవం ఎందుకైందో చెబుతారు. నాలుగు భాగాలుగా విస్తరిల్లిన ఈ గ్రంథంలో మొదటి భాగంలో మానవ పూర్వీక జాతులైన నాలుగైదు రకాల మనలాంటి వారి మూలాలను చూపగా, రెండో భాగంలో వాంగ్మయాధారాలూ, యూరప్, భారత్‌లో కనపడే సామ్యాలూ, మూడో భాగంలో ఆఫ్రికన్ తల్లిలో వెతుక్కున్న జనన రహస్యాలూ, జన్యుమూలాలూ, తర్వాత అక్కడి నుంచి మానవ ప్రస్థాన విస్తృతిలో భాగంగా భరతభూమిగా పేర్కొనే మన సరిహద్దుల లోపల మెహర్‌గఢ్, హరప్పా, ద్రవిడ సంస్కృతి మేళవింపులూ, సరిహద్దు దేశాలతో బాంధవ్యమూ, ఆర్యావర్తమూ, వేదవాంగ్మయమూ, రామాయణ మహాభారతాల వెనుక ఉన్న చారిత్రక వెలుగు జిలుగులూ, మధ్య యూరప్ నుంచి చైనా వరకూ ఎనిమిది వేల కిలోమీటర్ల దూరం వ్యాపించిన స్టెప్స్ (ఎందుకో మరి కల్లూరి భాస్కరం గారు ఈ పదాన్ని 'స్టెప్పీలు' అన్నారు! నిజానికి వీటిని స్టెప్స్ అనడం సరైంది!) అనబడే గడ్డి భూములనుండి (సరిహద్దుల ఎల్లలు అనే స్పృహ ఇప్పుడు ఏర్పరచుకున్నది!) మొదలు పెట్టి, మహాభారత గాధల్లోని ఇతిహాసపు ఆనవాళ్లనూ, ఆర్యావర్తంలో అతి సాధారణమైన పశు బలుల గురించీ, యజ్ఞ యాగాదుల గురించీ, వైదిక ప్రమాణాల గురించీ చాలా విస్తృతమైన వివరణలు ఇస్తూ 'మన' మూలాల లోపలికి చొచ్చుకు వెళతారు.

ఇందులో ప్రతిదీ ఒక ఆసక్తికరమైన అంశమే. మన మూలాల్లోని ఒకటి రెండు సందర్భాల్ని ఇక్కడ ఉటంకించడం ద్వారా అవి మిమ్మల్ని ఎంతగా అప్రతిభుల్ని చేస్తాయో చూడొచ్చు. భారతీయుల రూపురేఖల్లో జన్యు మిశ్రమం వల్ల ఎంత వైవిధ్యం కనబడుతుందో చెబుతూ, నలుపు నుంచి చామన చాయ వరకూ, యూరోపియన్ కవళికల నుంచి చైనీయ కవళికల వరకూ ఇక్కడ జనాల్లో కనిపిస్తాయనీ, ఉత్తర భారత పూర్వీకులకు యురేషియా జనాలతో అంటే యూరప్, మధ్య ఆసియా, పశ్చిమాసియా, కాకసస్ లతో జన్యు సంబంధం ఉందనీ, అదే సమయంలో దక్షిణ భారత పూర్వీకులకు, నేటి భారత ఉపఖండానికి బయట ఉన్న ఏ జనాభాతోనూ జన్యు సంబంధం లేదనీ డేవిడ్‌రైక్ ప్రతిపాదించిన సూత్రీకరణలను ప్రస్తావిస్తారు. ఈ విషయ విస్తృతి ఒక మహా సముద్రమైతే, ఈ సమీక్ష ఒక నీటి బొట్టు మాత్రమే! ఈ సమీక్ష ఉద్దేశం బాధ్యతగల ఒక చదువరిగా తన జాతి మూలాలను వెతుక్కునే క్రమంలో సరిహద్దులు లేని ఒక నవీన మానవుడి అవతరణ దిశగా మన ప్రస్థానం కొనసాగుతుందని తెలుసుకోవడమే ప్రధాన విషయం. తెలుగువారికి ఒక గొప్ప పరిశోధక గ్రంధాన్ని అందించిన కల్లూరి భాస్కరం గారికి యావత్తు తెలుగు ప్రజానీకం కృతజ్ఞతలు తెలియజేద్దాం. ❑

## ఊపిరి బిగపట్టి చదవాల్సిన పుస్తకం

# ఉరి వార్డు నుండి..

- విఠపు బాలసుబ్రహ్మణ్యం




కొన్ని పుస్తకాలు చదవడానికి చాలా దిటవుగుండెలుండాలి. ఇలాంటివి చదివేపుడు ఇంత విషాదమా, ఇంత బీభత్సమా? వీటికి దరీ, అంతూ లేదా అనిపిస్తుంది. అయినా ఊపిరి బిగబెట్టి చదువుతాం. "మేరీ టైలర్" భారతదేశంలో నా జైలు జీవితం "అప్పటి పాఠకుల్ని రోజుల తరబడి ఇలానే వెంటాడి వుంటుంద నుకుంటాను. సుధా భరద్వాజ గారి "ఉరివార్డు నుండి" కూడా ఈ కోవకే వస్తుంది. ఇదేమీ ఆషామాషీ పుస్తకం కాదు.

ఇంత కొద్ది కాలంలోనే ఇది తెలుగులోకి అనువాదం కావడం ఆశ్చర్యం, ఆనందం కలిగిస్తాయి. ఇతర ఏ భాషల్లోనైనా ఎంత వేగంగా ఇది అనువాదం అయిందో లేదో తెలియదు. ఇది మన రాజకీయ సాంస్కృతిక సాహిత్య వారసత్వం తెలుగు వాళ్ళంగా మనం దీనికి గర్వపడాలి. ఇలాంటి గ్రంథాన్ని ఎంచుకొని, ఎక్కడా కొతుకు లేకుండా చదివేలా అనువదించిన ఉషారాణి గారిని, ప్రచురించిన ప్రజాశక్తి బుక్ హౌస్ వారినీ ఎంతైనా అభినందించాలి. సుధా భరద్వాజ్ లాంటి వాళ్ళు చాలా అరుదుగా కనిపిస్తారు. మనం సావిత్రిబాపూలే లాంటి మహిళల గురించి స్మరించుకుంటాం. కానీ వర్తమానంలోనూ ఇలాంటి వారున్నారన్నది మర్చిపోతుంటాం. తెలిసినా వీరి వెంట నిబడ్డానికి తటపటాయిస్తుంటాం.

సుధా గారి తల్లి కృష్ణ దేశం కోసం మహాలనబిస్ గారి పిలుపు మేరకు అమెరికా వదిలి మాతృభూమికి వచ్చేశారు. కూతురు సుధా గారు 21 ఏళ్లకే అమెరికా పౌరసత్వం వదిలేసి ఇండియా కు వచ్చేశారు. కాన్పూరు ఐఐటీలో ఐదేళ్ళ డిగ్రీ చదివి చత్తీస్ ఘడ్ గని కార్మికుల కోసం మరుగుదొడ్డి కూడా లేని గుడిసెలో మూడు దశాబ్దాల తరబడి వున్నారు. అక్కడి గిరిజనులే తన ప్రపంచంగా మారిపోయారు. బీమాకొరెగావ్ కేసులో జైలు శిక్ష అనుభవించారు. ఈ రోజుల్లో ఈ త్యాగాలు ఎవరిది సాధ్యం? తలచుకుంటే మన చుట్టూ ఉన్న ప్రపంచంలోనే ఇంత వీర వనితలు వున్నారా అన్పిస్తుంది. కొండంత ధైర్యం వస్తుంది. భవిష్యత్తు పట్ల గొప్ప భరోసా కలుగుతుంది. 'ఉరి వార్డు నుండి' మొదటి భాగంలో స్వంతంగా ఆమె చెప్పిన జీవిత కథ పుస్తకం లోకి దూరకముందే మన గుండెలను బరువెక్కిస్తాయి.

సామాన్యంగా జైలు రచనలు ఎక్కువ భాగం స్వీయాత్మకంగా వుంటాయి. కానీ "ఉరి వార్డు నుండి" ఈ ధోరణికి పూర్తిగా భిన్నం. ఇదంతా తోటి ఖైదీల గురించి, అదీ నిరుపేద మహిళా ఖైదీల గురించి చూసింది చూసినట్టుగా. వ్యాఖ్యానం లేకుండా




ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌస్, విజయవాడ

చేసిన కథనం. ఇది దాదాపు యాభైకి పైగా మహిళల వ్యథార్థ జీవితాల దృశ్య మాలిక. ఒక ఉద్యమకారిణిగా, మరీ మహిళగా సుధా గారికి ఒక విస్పష్ట ప్రాపంచిక దృక్పథంతోపాటు నిరుపేద మహిళల పట్ల గాఢతిగాఢ ప్రేమానురాగాలున్నాయి. ఆమె సామాజిక ఆచరణే వారి చుట్టూ జరిగింది. ఈ ఆర్ద్రత లేకుండా ఇలాంటి రచన చేయడం అసాధ్యం.

జైలులో ఆమె చుట్టూ రకరకాల స్త్రీలున్నారు. వారిలో కొందరు వచ్చి బాలింతలు వున్నారు. వారితోపాటు పసిపిల్లలు వున్నారు. వీరు చేసినవన్నీ చిన్నచిన్న నేరాలు. చాలా భాగం తెలియక చేసినవి. కొన్ని చేయక తప్పక చేసినవి. కొన్ని నెత్తిన పడ్డవి. ఒక పచ్చి బాలింతను. బిడ్డను కని వారం రోజులు కూడా తిరక్క ముందే మొగుడు తాగొచ్చి తన కోరికను తీర్చమన్నాడు. కాదంటే ఏడేళ్ల కూతురుని పంపమన్నాడు. ఇంకేం చేయాలి? బాది వాడిని చంపింది. ఇదీ ఆమె చేసిన 'హత్యా' నేరం. నేరం చేసినప్పుడు భార్య ఫోన్ మొగుడి దగ్గర వుంది. ఆ ఫోన్ కాల్ రిజిస్టరు ఆధారంగా ఆమెను అరెస్ట్ చేశారు! కొన్ని అత్తలతో గొడవలు. ఇవి చాలా భాగం సంసారపు సమస్యలతో ముడిపడ్డవి. దాదాపు అందరూ మొదటిసారి జైలుకొచ్చిన వారు. వీళ్ళల్లో ఒక్కరూ కరుడుగట్టిన నేరస్తులు లేరు. క్రిమినల్స్ లేరు. ఉగ్రవాదులు లేరు. కనీసం రౌడీషీటర్లు కూడా లేరు. అంతా

బండ చాకిరీ చేసి సంసారాల్ని ఈదుతున్నవారు. తాగుబోతు మొగుళ్ళతో బతుకంతా ఏగుతున్న వాళ్ళు. తమకంటూ ఏ న్యాయమూ లేని ప్రపంచంలో "లౌక్యంగా" నెట్టుకు రాజ తెలీక జైల్లోకి చేరిన వాళ్ళు. ఇలాంటి వాళ్ళ కోసమేనా మన జైళ్లు వుండేది. వీరి కోసమేనా పోలీసులు, లాయర్లు, కోర్టులు, కారాగారాల ఇంత పెద్ద వ్యవస్థ వుండేది? నిజానికి వీళ్లే ఈ వ్యవస్థకంతా బతుకుతెరువు. వీళ్ళే లేకుంటే వీటికి పూటే గడవదన్పిస్తుంది ఈ పుస్తకం చదువుతున్న ప్రతి క్షణం!

అసలు బయట వుంటున్న వారెవరు? జైల్లో వుంటున్న వారెవరు ? జరుగుతున్నది ఉల్టా కదా అన్న మౌలిక ప్రశ్నలు ఈ పుస్తకంలో చదువుతున్నంత సేపూ మనల్ని వెంటాడుతాయి. వేటాడుతాయి కూడా! విచిత్రం ఏమంటే నిర్భాగ్య మహిళలకు బయట ప్రపంచమూ, జైలు ప్రపంచమూ కొంచెం అటూ ఇటూ రెండూ ఒకటిగానే వుంటాయి. ఒక్కోసారి జైళ్లే మేలని అన్పి స్తుంటాయి. బ్రహ్మకుమారీలు వచ్చి "నైతిక ఆధ్యాత్మిక బోధా మృతం" కురిపించబోయినప్పుడు ఒక సాధారణ ఖైదీ "అందరం బాగానే వున్నాం కదా! ఇక్కడ అత్తలూ లేరు, మొగుళ్ళూ లేరు. వంటలూ లేవు, వేధింపులూ లేవు" అని అమాయకంగానో, గడసరి తనంతోనో వారిని ప్రశ్నిస్తుంది. ఇలాంటి ఘట్టాలు చదువుతున్నప్పుడు జైలు రచనల్లోనూ ఇంత హాస్యం పండించవచ్చునా అన్పిస్తుంది. కానీ ఇదొక కఠోర వాస్తవం.


జైల్లోనూ ఆడవాళ్ళకి పండుగలు, సంసారాలు, కోరికలు, ప్రేమలు, మేకప్‌లు, మాతృత్వాలు, సహకారాలు అన్నీ ఉంటాయి. అలానే అసూయలు, ద్వేషాలు, పోటీలు, కొట్లాటలు, దొంగతనాలు ఉంటాయి. జైల్లో వేసినంత మాత్రాన వాళ్ళ జీవితాలేమీ మారవు. వీళ్లంతా నిఖార్సైన మనుషులు, మట్టి మనుషులు. వాళ్లు ఎప్పుడూ మనుషుల్లానే వుంటారు. ఇలా చూస్తే జైలే వీళ్ళ ముందు ఒక ఘోరంగా ఓడిపోతుంది.

అన్నట్టు వీరంతా జైలు నుంచి బయటికొచ్చాక ఏమవుతారు? ఏమీ కారు. లోకాన్ని ఎదురీదడంలో అంతో ఇంతో మరింత రాటు తేలుతారన్పిస్తుంది. ఇంతకన్నా ఈ జైళ్లు నీళ్ళని "సంస్కరించించేదీ" లేదు. సాధించిందీ లేదు. బయట బడాబడా నేరగాళ్లు లక్షల మంది వుంటే వీళ్ళే జైలుకెందుకు రావాలి అనేది అసలు ప్రశ్న. కనీసం మరుగుదొడ్లయినా ఉందని, బాత్రూములు కూడా దొరకని, చివరకు బట్టలారేసుకొనూ దోవలేని దౌర్భాగ్యం దేనికనేది ప్రశ్న. సుధా గారే "నేను భారతీయ మరుగుదొడ్డిలో ఒక మూల కూచొని స్నానం చేసేదాన్ని" అన్నప్పుడు రాజ్యంలోని అమానుషత్వమంతా జైళ్లలో పేరుకుపోయిందా అనిపిస్తుంది. అసహ్యం వేస్తుంది. విచిత్రం ఏమంటే బ్రిటన్ కాలపు జైళ్లే మేలు. ఇదే యరవాడ జైల్లో గాంధీ గారి లాంటివారూ వున్నారు. ఆ రోజుల్లో వారికి కావలసిన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉండేవి. ఎన్ని రచనలనైనా వారు చేసేవారు. సమావేశాలు జరిపేవారు పూనా ఒప్పందం సైతం ఇక్కడే జరిగింది. దీర్ఘకాలిక నిరాహార దీక్షల్లాంటి రాజకీయ పోరాటాలు వాళ్ళు చెయ్యగలిగే వారు. మరి స్వతంత్ర భారత జైళ్ళు ఎందుకిలా బిగుసుకుపోయా యి? మన ప్రజాస్వామ్యం ఎందుకింత కురచబారి పోయింది? సుధా భరద్వాజ్ గారు ఈ ప్రశ్నలన్నీ లేవనెత్తుతారు. అసలు జైళ్ళులేని పాలన అంటూ వుండదా? ఉండే రోజులు రావా అని ఆమె ప్రశ్నిస్తారు. అలాగే మన నేర నిర్ధారణలూ, శిక్షాస్మృతులు కూడా. ఆత్మ రక్షణలో భాగంగా చెయ్యాల్సి వచ్చే చర్యల్ని బ్రిటన్ లాంటి దేశాలు హత్యా నేరాలుగా లెక్కించవు. మరి ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లంటూ బడాయికి పోతున్న మన దేశంలో ఈ మాత్రం విచక్షణా లేదెందుకని? అదే వుండి వుంటే ఈ ఖైదీల్లో సగం మంది జైలు ముఖం చూడాల్సి వచ్చేదే గాదు. సుధా గారు సూటిగా ఈ ప్రశ్నను లేవనెత్తుతారు.

ఇక "ఉరి వార్డు నుండి" కథనం కూడా అద్భుతమైంది. సుధా భరద్వాజ్ గారు చేయి తిరిగిన రచయిత్రిగా ఏ అరుంధతీ రాయ్ లాగానో సాహిత్య ప్రపంచంలో దఖలు పడకపోవచ్చు గానీ ఒక్కో ఖైదీని(ఈ మాట మాటి మాటికీ అనడం సిగ్గుగా ఉంది) సాదా సీదాగా ఆమె ముక్కు గురించీ, ముంగురుల గురించీ, పూసుకున్న లిప్టిక్ గురించీ, వేసుకొన్న జడ గురించీ చెబుత చెబుతూనే పాఠకుల్ని ఎంత దూరం తీసుకెళ్లాలో అంత దూరం తీసుకెళ్తారు. సామాజిక రాజకీయ అపసవ్యతలనన్నిటినీ మన ముందు రాసి పోస్తారు. పేర్లు చెప్పడం వీలు గాక రూపు రేఖలతోనో, వేషభాషలతోనో ప్రారంభించి ప్రతి ఖైదీ విషాదృశ్యాన్ని మన కళ్ళ ముందు నిలబెడతారు. ఇదో కొత్త ప్రక్రియ అనిపిస్తోంది.

చివరగా ఇలాంటి పుస్తకాలను తేవడం ఇప్పుడేమీ ఆషామాషీ వ్యవహారం కాదు. మనందరం ఒకరికొకరం తోడుగా నిలబడితేనే ఈ వరవడిని కొనసాగించగలం. ఇప్పుడు మనకు పాఠకుల రచయితల సంఘటన కూడా, ఏదో ఒకటి, ఏదో ఒక మేరకైనా వుండాలి. ఇలాంటి పుస్తకాలు సహకార రంగంలో వచ్చిన సమిష్టి ప్రచురణలుగా మారాలి. పుస్తకం వెలువడ్డాక కూడా కనీసం ఐదారు వందల పుస్తకాలయినా మనలాంటి వాళ్ళందరి చేతుల్లోకి రాగలగాలి. వాటిపైన చిన్నచిన్న గ్రూపుల్లోనయినా విస్తృతంగా చర్చజరగాలి. తెలుగు వాళ్ళకు గొప్ప ప్రజాస్వామిక సాంస్కృతిక వారసత్వం వుంది. దీన్నిప్పుడు మనం పనిగట్టుకొని మరీ నిలబెట్టుకోవాలి. ఈ రోజు మత ఛాందస శక్తుల నుంచి వెయ్యి సవాళ్లు మన ముందుండొచ్చు. ఎన్ని వున్నా మనం సమిష్టిగా వుంటే దీటుగా ప్రతి సవాలును విసరగలం. ప్రజాస్వామిక ఉద్యమాలకిది కొండంత స్ఫూర్తినిస్తుంది. వెన్నుదన్నుగా నిలుస్తుంది. "ఉరి వార్డు నుంచి" మనల్ని ఈ వైపుకు కొంచెమైనా మళ్ళించగల్గితే దీనికి మరింత సార్థకత చేకూరుతుంది. ❑ **(కొలిమి సౌజన్యంతో)**

# లెనిన్ ఐక్య సంఘటన ఎత్తుగడలు - సమకాలీన విప్లవోద్యమాలు



- కొండూరి వీరయ్య

ఏప్రిల్ 22 లెనిన్ 150వ జయంతి. ఈ సందర్భంగా సామ్రాజ్యవాద దశలోని పెట్టుబడిదారీ విధానాన్ని అర్థం చేసుకోవటానికి మార్క్సిజాన్ని సృజనాత్మకంగా అన్వయించటంలో లెనిన్ సాగించిన విశేష ప్రజ్ఞ గురించి చర్చలు జరుగుతున్నాయి. లెనిన్ గుణగణాలను, త్యాగనిరతి, నిర్మాణదక్షత, సైద్ధాంతిక కృషి, సామ్రాజ్యవాద దశలో పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్గత వైరుధ్యం, సంపన్న దేశాల్లో విప్లవం రాకముందే ఓ వెనుకబడిన దేశంలో విప్లవం సాధించటం, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద దశకు చేరుకున్న సమయంలో ఒక దేశంలో సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ నిర్మాణం, విశ్వ విప్లవ వ్యూహానికీ వలస దేశాల విముక్తికి మధ్య ఉన్న సంబంధం వంటి అనేక అంశాల గురించి లెనిన్ సాగించిన మేధో మథనాన్ని ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం, వామపక్ష శక్తులు మరోసారి మననం చేసుకోనున్నాయి. నిర్దిష్ట పరిస్థితులు, నిర్దిష్ట అధ్యయనం అన్నది లెనినిజానికి పునాది. ఈ సూత్రాన్ని భౌతిక రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేయటానికి, అంచనా వేయటానికి రాజకీయ వ్యూహాన్ని రూపొందించటానికి ఉపయోగించిన తీరు గురించి ఎన్నో ఉదాహరణలు చదివాం. తెలుసుకున్నాం. ఈ నిర్దిష్ట పరిస్థితులు నిర్దిష్ట అధ్యయనం సూత్రాన్ని పార్టీ నిర్మాణం, ఎత్తుగడల విషయంలో లెనిన్ ఎలా అమలు చేశాడో ఈ సందర్భంగా పున:శ్చరణ చేసుకోవటం సమకాలీన విప్లవోద్యమాలకు ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నాను.

ఐక్య సంఘటన నిర్మాణం, దానికి కావల్సిన ఎత్తుగడలు లెనినిజం పునాదుల్లో ఓ కీలక భాగం. బోల్షివిక్ విప్లవంలో లెనిన్ జయప్రదంగా అనుసరించిన ఎత్తుగడలే నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేయగల ఆయన సామర్థ్యానికి దర్పణం. ఈ ఎత్తుగడలు పార్టీలో ప్లెఖనోవ్, ట్రాటీస్కీ, ఆక్సెల్రాడ్, మార్టోవ్ వంటి నేతలతో ఉన్న భిన్నాభిప్రాయాలను అధిగమించటం మొదలు, నాటి వలస దేశాలు (నేటి వర్ధమాన దేశాలు) సోషలిస్టు శిబిరం మధ్య ఉండాల్సిన ఐక్య సంఘటన వరకు విస్తరించాయి. లెనిన్ అనుసరించిన ఐక్య సంఘటనలు నాటి సమకాలీన సామాజిక రాజకీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అనుసరించినవే తప్ప సార్వత్రిక ఎత్తుగడలు కాదు అన్న చారిత్రక వాస్తవాన్ని మనం మర్చిపోరాదు. రష్యా విప్లవోద్యమంలో తలెత్తిన నిర్దిష్ట అవసరాల నేపథ్యంలో వివిధ దశల్లో ఈ ఐక్య సంఘటన ఎత్తుగడలు అమలు జరిగాయి. ఈ ఎత్తుగడల కాలవ్యవధి ఒకే రీతిగా లేవన్నది వాస్తవం.

సామ్రాజ్యవాద స్వభావాన్ని గుత్తకు తీసుకున్న ద్రవ్య పెట్టుబడిదారీ(ప్రపంచీకరణ) దశలో వివిధ దేశాల్లోనూ ప్రత్యేకించి భారతదేశంలోనూ విప్లవోద్యమం పీడితుల ఐక్య సంఘటన నిర్మాణం దిశగా అడుగువేస్తున్న తరుణం ఇది. అందువల్లనే లెనిన్ నాయకత్వంలో రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీ(బోల్షివిక్) వివిధ సంధర్భాల్లో అనుసరించిన ఐక్య సంఘటన ఎత్తుగడలను, నాటి వాటి నేపథ్యాన్ని సంక్షిప్తంగా తెలుసుకునే ప్రయత్నం ఇది. నేటికీ పెట్టుబడిదారీ విధానం విశ్వవ్యాప్త విధానంగా ఎదిగినా కొన్ని దేశాలు ప్రజాతంత్ర విప్లవ దశ సాధన దశలోనే ఉండిపోయాయి. ఐక్య సంఘటన ఎత్తుగడ గురించిన గందరగోళం కార్మికవర్గ విప్లవ దశలో ఉన్న దేశాల్లో కంటే ప్రజాతంత్ర విప్లవ దశలో ఉన్న దేశాల్లో ఎక్కువగా ఉంది.

లెనిన్ రచనలను ఔపోసనపట్టిన సమర్ధ నాయకత్వానికి భారత విప్లవోద్యమ ప్రస్థానంలో కొరత ఏమీ లేదు. ఏ రచనను అయినా ఆయా చారిత్రక రాజకీయ నేపథ్యం నుండి చూసినప్పుడు మాత్రమే సదరు రచయిత చెప్పదల్చుకున్న సారం పాఠకులకు అందుతుంది. మనం అధ్యయనం చేసేటప్పుడు ఈ మౌలిక సూత్రాన్ని తరచూ విస్మరిస్తూ ఉంటాము. అందుకే ఒకే పుస్తకంలోని అంచనాలు నిర్ధారణలు ఒక్కొక్కరికి ఒక్కోరకంగా అర్థమవుతుంది. ప్రత్యేకించి 19, 20 శతాబ్దాల నాటి మేధో చర్చను విస్మరిస్తే మార్క్సిజాన్ని మనం అర్థం చేసుకోలేము. అందుకే తొలి తరం కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలు ఆధునిక రాజకీయ భూగోళం, చరిత్ర, తత్వశాస్త్ర పరిణామం, అర్థశాస్త్ర పరిణామక్రమం చదువుతూ మార్క్సిజాన్ని అధ్యయనం కాబట్టి సారాన్ని వడపోసి ఆ మార్గదర్శనంలో ఉద్యమాలు నిర్మించగలిగారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద దశలో ప్రవేశించినపుడు జార్ చక్రవర్తి కంబంధ హస్తాల నుండి విముక్తి ఉద్యమం సాధించిన పెద్ద విజయమే బోల్షివిక్ విప్లవం. నాటి జారిస్టు రష్యాలోని నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిజాన్ని అన్వయించే ప్రయత్నంలో ఆయన సాగించిన నిర్దిష్ట అధ్యయన సారాంశం ఫలితమే సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ అన్న రచన. ఈ రచనను పూర్తి చేసే సందర్భంలో వచ్చిందే ప్రపంచ సామ్రాజ్యవాదపు గొలుసులో జారిస్టు రష్యా బలహీనమైన లింక్‌గా ఉందన్న నిర్ధారణ కూడా. ఈ బలహీనమైన లింకును తెగ్గొట్టడమే అక్టోబర్ విప్లవానికి జయప్రదానికి మూలం. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు బోల్షివిక్ పార్టీని సన్నద్ధం చేసే క్రమంలో లెనిన్ దఫదఫాలుగా ఆచరణలో

వ్యూహం, ఎత్తుగడలు, నినాదాలు మార్చుకుంటూ వచ్చాడు. కొన్ని సందర్భాల్లో గతంలో తాను పూర్తిగా వ్యతిరేకించిన నినాదాలను, అంచనాలను సైతం విప్లవోద్యమ పురోగమనం ఆవశ్యకత దృష్ట్యా అంగీకరించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద దశకు చేరుకున్న సమయంలో ఒక దేశ విప్లవోద్యమం, కార్మికోద్యమంతోపాటు వలస దేశాల సమస్య, ప్రపంచ కార్మికోద్యమం సమస్య కూడా కీలక ప్రాధాన్యత సంతరించుకున్నాయి. లెనిన్ నాయకత్వంలో అటు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, దేశీయంగా జారిస్టు రష్యాలోనూ అమలు జరిగిన వ్యూహం, ఎత్తుగడలు, పోరాట రూపాలు, మిత్రులు – శతృవులను గుర్తించటం, వారి బలాబలాల గురించిన అంచనా వంటి వాటన్నింటినీ ఎప్పటికప్పుడు తాజా పర్చుకోవటంలో లెనిన్ అమలు చేసిన సూత్రమే నిర్దిష్ట పరిస్థితులపై నిర్దిష్ట అధ్యయనం. ప్రధానంగా 1905 నుండి 1917 వరకు లెనిన్ అనుసరించిన ఐక్య సంఘటన ఎత్తుగడలు, రష్యా విప్లవంపైనా, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంపైనా, వలస దేశాల విముక్తి ఉద్యమాలపైనా వాటి ప్రభావం తెలుసుకోటానికి కొన్ని ఉదాహరణలు, కొన్ని చారిత్రక అనుభవాలను పరిశీలిద్దాం.

## ప్రజాతంత్ర విప్లవ దశలో ఐక్యసంఘటన ఎత్తుగడలు

ఏ సమాజంలోనైనా పాలక వర్గం సంఖ్యా రీత్యా పరిమితమే. కానీ ఉత్పత్తి సాధనాలు, మార్కెట్‌పై వీళ్లదే పెత్తనం కావటంతో మొత్తం వ్యవస్థ వీళ్ల చెప్పు చేతల్లో ఉంటుంది. కనుసన్నల్లో నడుస్తుంది. సమాజ స్వభావం మారే కొద్దీ ఈ పరిమిత సంఖ్యలో ఉన్న ఆధిపత్య వర్గం చేతుల్లో నుండి ఉత్పత్తి సాధనాలపై పెత్తనం కొత్త వర్గం చేతుల్లోకి చేరుతుంది. ఈ క్రమంలో ఆధిపత్య స్థానానికి రావాలని కాంక్షించే కొత్త వర్గం విశాల జనబాహుళ్యంతో జట్టు కట్టాల్సిన అవసరం సమాజ పురోగమనంలో తరచూ ముందుకొస్తుంది. భూస్వామ్య వ్యవస్థపై తిరగబడ్డ బూర్జువావర్గం అప్పటి వరకు భూస్వామ్య వర్గం చేతుల్లో నష్టపోయిన వారినందరినీ కూడగట్టిందన్నది ఆధునిక యూరప్ విప్లవాల చరిత్ర. బూర్జువా వర్గం ఓ సారి పాకవర్గంగా అవతరించిన తర్వాత అప్పటి వరకు భూస్వామ్య వ్యవస్థపై పోరాటంలో తనతో జట్టుకట్టిన వారిని ఉపేక్షించదు. వాళ్లను దోపిడీ చేస్తుంది. ఈ దోపిడీ క్రమం రానురాను పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలోనే అనేక ఉత్థానపతనాలతో సాగుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలో తన పట్టును నిలిపి ఉంచుకునేందుకు జరిగే అన్ని ప్రయత్నాలు, ప్రయోగాలు పూర్తయ్యాక ఓ నూతన దశలోకి ప్రవేశిస్తుంది. సామ్రాజ్యవాదం అటువంటి ఓ నూతన దోపిడీ చట్రం. సామ్రాజ్యవాదం అంటేనే పీడితులపై సాగే దోపిడీ, దాని తీవ్రత నూతన దశకు చేరటం. దోపిడీ క్రమం నూతన రూపాలు సంతరించుకోవటం. పెట్టుబడి ఆధిపత్యానికి బలయ్యే పీడితుల సంఖ్య విస్తరించటం. అంటే పెట్టుబడి ఆధిపత్యాన్ని వ్యతిరేకించాల్సిన శక్తుల సంఖ్య, ప్రభావం, సమాజంలో వారి శాతం పెరగటం. కొన్ని కొన్ని సందర్భాల్లో (ప్రత్యేకంగా పెట్టుబడిదారీ సంక్షోభ సమయంలో) చిన్న చిన్న పెట్టుబడిదారులు, మధ్య తరగతి, వ్యాపారస్తులు, (పెటీ బూర్జువా వర్గం) ధనిక రైతాంగం కూడా సామ్రాజ్యవాద దశకు చేరుకున్న గుత్త పెట్టుబడిదారీ ప్రభావానికి దివాళా తీస్తారు.

ఈ పరిణామం (పెట్టుబడిదారీ దోపిడీ కారణంగా నష్టపోయిన ప్రజ సంఖ్య పెరగటం) మరోసారి ప్రజాతంత్ర కూటమి అవసరాన్ని ముందుకు తెస్తుంది. ఈ వాస్తవాన్ని తరచు కమ్యూనిస్టు ఉద్యమం గుర్తించలేకపోతోంది. వీరంతా పెట్టుబడి కారణంగా దివాళా తీస్తున్నారు, నష్టపోతున్నారు. కాబట్టి అనివార్యంగా పీడిత తరగతుల్లోనే పీడితులైన కార్మికవర్గ స్వభావాన్ని సంతరించుకుంటారనీ, అందువల్ల కార్మికవర్గ పోరాటాలే ఏకైక లక్ష్యమన్న నిర్ధారణకు వచ్చారు. ఈ విధంగా నష్టపోతున్న వర్గాలు తమ మౌలిక వర్గ స్వభావాన్ని అంత తేలిగ్గా వదులుకోవనీ, సాధ్యమైనంత వరకు దోపిడీ వ్యవస్థ నిర్మాణంలోనే తమ స్థానాన్ని అంటిపెట్టుకోవడానికి శాయశక్తులా ప్రయత్నం చేస్తారన్న వాస్తవాన్ని గుర్తించాలి. పెట్టుబడి ఆధిపత్యానికి బలై కొత్తగా పీడితుల కోవలో చేరే భిన్న సామాజిక తరగతుల నిర్దిష్ట పరిస్థితిని గమనించలేని స్థితి పోరాటాలు, విప్లవ నినాదాల రూపకల్పనలో, తదనుగుణమైన ఎత్తుగడలు రూపొదించటంలో ఒంటెత్తు పోడకలకు దారితీస్తుంది.

ఈ రకమైన పొరపాట్లు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రజాతంత్ర విప్లవ సమయంలోనే (1905 నాటి విప్లవం) లెనిన్‌కు, మెన్షివిక్కుకు, సోషలిస్టు రివల్యూషనరీలకు మధ్య జరిగిన సంవాదాన్ని పరిశీలించాలి. ఈ చర్చల్లో లెనిన్ కూడా రివిజనిస్టు అన్న ముద్రను భరించక తప్పింది కాదు. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో రివిజనిస్టు ధోరణుల గురించిన చర్చ గణనీయంగానే కనిపిస్తుంది. కానీ కాలక్రమంలో రివిజనిస్టు అన్న పదం భిన్న మార్క్సిస్టు స్రవంతులకు చెందిన వారిని దుయ్యబట్టేందుకు వాడే సాధారణ పదంగా దిగజారింది. విప్లవ పంథాలో పయనించే భిన్న స్రవంతులు ఒకరికొకరు ఈ ముద్రలు వేసుకున్న సందర్భాలూ చూశాం. పరస్పర సైద్ధాంతిక విభేధాలు తలెత్తిన సందర్భంలో ఇటువంటి చౌకబారు ఆరోపణకు పాల్పడటం భిన్న సైద్ధాంతిక స్రవంతుల మధ్య ఉన్న వ్యత్యాసాలను అర్థం చేసుకోవటానికి ఉపయోగపడకపోగా అపార్థం చేసుకోవటానికి దారితీస్తుంది. నాయకుల ప్రభావంతోనో, వారి మీదున్న నమ్మకం, గౌరవంతోనో ఆ నాయకుడు మరొకరిని రివిజనిస్టు అనో లిక్విడేషనిస్టు అనో ముద్ర వేసినప్పుడు దాన్ని ప్రామాణికంగా భావించటం విప్లవశక్తుల ఐక్యతను, శ్రేణుల మనోధైర్యాన్నీ బలహీనపర్చటమే తప్ప మరోటి కాదు. విప్లవోద్యమంలో కార్యకర్తలు, నాయకుల మధ్య నేడున్న గురుతత్వ ధోరణి స్థానంలో గతితార్కిక సంబంధాలు ఉండేలా పార్టీ నిర్మాణాన్ని ఆధునీకరించుకుంటే ఈ పొరపాటు అభిప్రాయాలు విప్లవ

పార్టీల్లో సార్వత్రిక భావనలుగా మారకుండా ఉంటాయి. 1905 నాటి బూర్జువా ప్రజాతంత్ర విప్లవం సాధన కోసం ఐక్య సంఘటన ప్రతిపాదించినప్పుడు మెన్షివిక్కు లెనిన్‌ను రివిజనిస్టుగా ముద్ర వేశారు. బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో కార్మిక వర్గానికి ఎటువంటి పాత్ర ఉండదన్నది వారి అవగాహన. బూర్జువా వర్గమే ఆ కర్తవ్యాన్ని జయప్రదంగా నిర్వహించుకుంటే తదనంతరం ఏర్పడే సమాజంలో ప్రశాంతంగా కార్మికవర్గ రాజకీయాలు నిర్వహించవచ్చున్నది మెన్షివిక్కు సిద్ధాంతం. కాస్త భిన్నమైనది ట్రాట్స్కీ అవగాహన. నిరంతర విప్లవ సాధన క్రమంలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవం ఓ తాత్కాలిక మజిలీ మరియు ఒక దేశంలో విప్లవాన్ని జయప్రదం చేటం సాధ్యం కాదు కాబట్టి శాశ్వత విప్లవం కోసమే కృషి చేయాన్నది ఆయన ప్రతిపాదన. ఈ రెండు అవగాహనకంటే భిన్నమైనది లెనిన్ అవగాహన. బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో కార్మికవర్గం భాగస్వామి కావటం ద్వారా దీర్ఘకాలంలో బూర్జువా విప్లవంపై కార్మికవర్గం ఆధిపత్యం సంపాదించటానికి అవకాశం ఉంటుందని లెనిన్ భావించాడు.

ఈ విమర్శకు సమాధానంగా సోషల్ డెమొక్రసీలో రెండు ఎత్తుగడలు అన్న లేఖలో సామ్రాజ్యవాద దశలో ఏ ఒక్కరమూ ప్రజాతంత్ర ఉద్యమాల నుండి ఒంటరి కాకూడదని హెచ్చరిస్తాడు. బూర్జువాతో సహా సమాజంలోని అన్ని వర్గాలు తరగతులతో ఈ దశలో కార్మికవర్గం సహకరించాలని ప్రతిపాదిస్తాడు. "ఇక్కడ మనకు మిగిలిన వాళ్లకు ఉన్న తేడా ఒక్కటే. ఈ విప్లవోద్యమంలో ఫైట్ టుగెదర్, వాక్ సపరేట్లీ అంటే మనం ఇతర విప్లవకారులతో కలిసి పోరాటాలు నడపాలి, విడివిడిగా మన స్వతంత్ర రాజకీయ పంథాను అమలు చేయాలి. కానీ మెన్షివిక్కు, సోషలిస్టు రివల్యూషనరీలు ఈ పోరాటంలో బూర్జువాలు, ఉదారవాదులతో కలిసి నడుస్తారు. ఇదే తేడా" అని గుర్తుచేస్తాడు. విశేషమేమంటే ఎత్తుగడలకు సంబంధించిన ఈ చర్చంతా కార్మికవర్గ పత్రికల్లోనే జరిగింది. తద్వారా నేరుగా ఈ చర్చల్లో కార్మికవర్గాన్ని భాగస్వామిని చేశాడు.

తన అవగాహనను మరింత పటిష్టరుస్తూ లెనిన్ కార్మికులు, రైతాంగం మధ్య ఐక్య సంఘటన ఎత్తుగడను ప్రతిపాదిస్తాడు. ఈ ఐక్యసంఘటన ప్రతిపాదన 1917 నాటి విప్లవం నాటికి పరిపక్వతను సాధించింది. బోల్షివిక్ విప్లవాన్ని విజయపథంలో నడిపించింది. ఫ్రాన్స్‌లో వర్గపోరాటం, పారిస్ కమ్యూన్‌ను విశ్లేషించేటప్పుడు సూక్ష్మస్థాయిలో మార్క్స్, ఏంగెల్స్‌లు ఈ ఐక్య సంఘటన ఆవశ్యకతను ప్రతిపాదిస్తే లెనిన్ బోల్షివిక్ విప్లవంలో ఈ ఎత్తుగడకు పరిపూర్ణతను సంతరించి పెట్టాడు.

## సామ్రాజ్యవాద, వలసవాద వ్యతిరేక ఐక్యసంఘటన

బోల్షివిక్ విప్లవం నూతన ప్రపంచాన్ని ఆవిష్కరించింది. సామ్రాజ్యవాద శక్తుల ఐక్య సంఘటనలో లింకును తెగ్గొట్టగలిగింది. రష్యాలో కార్మిక కర్షక రాజ్యం ఆవిర్భావంతో పాటు నాటి వలస దేశాల్లో జరుగుతున్న విముక్తి ఉద్యమాలు సామ్రాజ్యవాద శక్తుల ఐక్య సంఘటనను బలహీనపర్చటంలో సఫలమయ్యాయి. వలస విముక్తి ఉద్యమాలు ప్రపంచవ్యాపిత స్వభావాన్ని సంతరించుకున్నాయి. సామ్రాజ్యవాదం ప్రపంచవ్యాప్త శ్రామిక వర్గాన్ని దోపిడీ చేయటమే కాక నేటి వర్ధమాన దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిని ఆటంకపర్చింది. అందువల్లనే వలసవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో ఆయా దేశా బూర్జువా వర్గం క్రియాశీల నాయకత్వ పాత్ర పోషించింది. ఈ దిశగా ఐక్యసంఘటన ఎత్తుగడలను అంతర్జాతీయం చేసే ప్రయత్నంలోనే లెనిన్ సాగించిన కృషే మూడో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో ఏడవ మహాసభలో వలస దేశాల్లో విముక్తి ఉద్యమాల పట్ల తీసుకోవాల్సిన వైఖరి గురించిన సిద్ధాంత చర్చ ఒక కొలిక్కి రావటానికి కారణం. లెనిన్ ప్రతిపాదనతో విబేధిస్తూ ఎంఎన్ రాయ్ ఓ ప్రత్యామ్నాయ పత్రాన్ని ఈ సమావేశాల్లోనే ప్రతిపాదిస్తాడు. ఈ చర్చలో వలస దేశాల్లోని శ్రామికవర్గ ప్రతినిధులు బూర్జువావర్గ ప్రతినిధుతో కలిసి విముక్తి ఉద్యమాల్లో పాల్గొనాలా లేదా అన్నదే ప్రధానాంశం. దీనికి కొనసాగింపుగానే మన దేశంలో దత్ బ్రాడ్లీ థీసిస్‌ను భారత కమ్యూనిస్టు పార్టీ ఆమోదించింది. ఈ ఎత్తుగడలే భారత స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టు పాత్రను విస్తరించటానికి దోహదం చేశాయి.

వలస దేశాల్లో సాగుతున్న విముక్తి ఉద్యమాలు బోల్షివిక్ విప్లవం నుండి స్ఫూర్తి పొందుతాయి. ఆయా దేశాల్లోని పోరాటానికి నాయకత్వం వహిస్తున్న ప్రముఖులు, నాయకులు బోల్షివిక్ విప్లవానికి సంఘీభావం ప్రకటించారు. అనేక దేశాల నేతలు సోషలిస్టు రష్యాలో పర్యటిస్తారు. ఈ పరిణామాన్నింటినీ పరిశీలించిన లెనిన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ ఐక్య కూటమి ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని భావించాడు. కొన్ని వలస దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు తమ శక్తిని ఎక్కువగా అంచనా వేసుకుని ప్రజాతంత్ర విప్లవంతో అవసరం లేకుండా నేరుగా కార్మికవర్గ విప్లవం సాధించగలమన్న పొరపాటు అవగాహనతో ఉండేవి. ఈ అంచనాతో ఉన్న కమ్యూనిస్టు పార్టీలు చిన్న మధ్యతరగతి బూర్జువా వర్గాన్ని కూడా శత్రు శిబిరంలోకి నెట్టాయి. ఆయా దేశాల్లోని కమ్యూనిస్టు ఉద్యమం, ప్రజా చైతన్యపు నిర్దిష్ట దశతోపాటు దోపిడీ సమాజ నిర్మాణంలో ఉత్పత్తిలో ఆయా వర్గాల స్థానం ఏమిటి, పంపిణీలో వారి వాటా ఏమిటన్నది అధ్యయనం చేయకుండా ఫలానా వర్గం మన విప్లవ వ్యూహంలో ఫలానా స్థానంలో ఉంటుంది కాబట్టి లేదా వారికి ఊగసలాట ఎక్కువ కాబట్టి తక్షణ స్థితిలో ఎదురయ్యే వారి నిర్దిష్ట డిమాండ్లకు మన విప్లవోద్యమంలో స్థానం లేదని వాదించాయి. ఈ క్రమం అనేక వలస దేశాల్లో కమ్యూనిస్టు ఉద్యమాలు జాతీయ ప్రధాన ఉద్యమ స్రవంతి నుండి వేరుపడి ఒంటరయ్యే

పరస్థితిని కల్పించాయి. బూర్జువా ప్రజాతంత్ర విప్లవాల్లో కమ్యూనిస్టు, కార్మికవర్గం ఈ ఉద్యమాల్లో పాల్గొనాన్నది లెనిన్ అవగాహన. తద్వారానే ఆయా దేశాలు భవిష్యత్తులో విప్లవ దశకు చేరుకున్నపుడు ప్రజాతంత్ర విప్లవ దశలో అనుసరించిన ఐక్య సంఘటన ఎత్తుగడల్లో నేర్చుకున్న పాఠాలే పెట్టుబడిగా మారతాయన్నది లెనిన్ ఆశాభావం. అందువల్లనే మూడో ఇంటర్నేషనల్ నాల్గో మహాసభ సందర్భంగా వలస దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు స్వతంత్ర వర్గపోరాటాల పేరుతో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజాతంత్ర శక్తుల నాయకత్వంలో జరుగుతున్న పోరాటాల్లో పాలుపంచుకోక పోవటం దారుణమైన అవకాశవాదమని విమర్శిస్తాడు.

**ఐక్యసంఘటన వ్యూహం -ఎత్తుగడలు**

ఏ పేరుతో పిలబడుతున్నా (వలసవాదం, సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, ద్రవ్యపెట్టుబడి ప్రపంచీకరణ దశల లాంటి పేర్లు) సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులు విశాల ప్రాతిపదికన ఐక్య సంఘటన ఎత్తుగడలు అనుసరించాల్సిన పరిస్థితి ఏర్పడినది. ఈ విశాల శక్తులను సమీకరించలేకపోతే సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కోవటంలో కమ్యూనిస్టు కృషి విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే దిశగా సాగదు. నేటి అనుభవం కూడా ఇదే. అన్ని దేశాల్లోనూ పాలకవర్గ కూటముల్లో సామ్రాజ్యవాదానికి అనుంగు మిత్రులుంటారు. ఆయా దేశాల్లో పాలకవర్గ కూటమికి వ్యతిరేకంగా పోరాడేందుకు కమ్యూనిస్టులకు ఐక్య సంఘటన ఎత్తుగడ అవసరం.

ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ బోల్షివిక్ తరహా విప్లవోద్యమాలు పురివిప్పే అవకాశం ఉందన్న అంచనాల్లోని పొరపాట్లను గుర్తు చేస్తూ లెనిన్ రాసిందే వామపక్ష కమ్యూనిజం : ఓ బాలారిష్టం అన్న రచన. వలస దేశాల్లో ఎత్తుగడలు, వ్యూహానికి సంబంధించిన విషయాల్లో ఈ గ్రంథం ప్రామాణికమైనది. ఐక్యసంఘటన ఎత్తుగడలు, రాజకీయ వ్యూహాలు, కార్మికవర్గ ప్రతినిధులకు పార్లమెంట్‌లో ప్రవేశించాల్సిన అవసరం, ప్రవేశించాక చట్టసభల్లో అనుసరించాల్సిన ఎత్తుగడలు గురించిన చర్చ ఈ రచనలో కనిపిస్తుంది. అప్పుడే పురుడు పోసుకుంటున్న వర్ధమాన దేశాల్లో విప్లవోద్యమం తమ దేశాల్లో కూడా బోల్షివిక్ విప్లవం తరహాలో కార్మికవర్గ విప్లవానికి సన్నద్ధమవ్వాలన్న పొరపాటు అభిప్రాయాలకు గురికావటాన్నే లెనిన్ బాలారిష్టమని విశ్లేషిస్తాడు.

కమ్యూనిస్టు పార్టీలు వర్గపోరాటాల మీద కేంద్రీకరించే క్రమలో సాధారణంగా కొన్ని తప్పుడు అవగాహనతో పొరపాట్లు చేస్తుంటాయని హెచ్చరిస్తాడు. ఈ పొరపాట్లలో ఎన్నికల్లో పాల్గొనరాదని నిర్ణయించటం, బూర్జువా పార్లమెంట్ వేదికల్లో పాలుపంచుకునే ప్రతిపాదను తిరస్కరించటం, ఇతర పార్టీలతో ఏ విధమైన ఐక్యసంఘటనకు సిద్ధం కాకపోవటం, ప్రత్యేకించి బూర్జువా పార్టీలతో ఐక్య సంఘటనకు సుతరామూ తిరస్కరించటం, పార్టీ స్వతంత్రత కాపాడుకోవడమన్న లక్ష్యాన్ని ముందుకు తెచ్చి భావసారూప్యత కలిగిన మిత్రులను సమీకరించుకోవటం పట్ల విముఖత ప్రదర్శించటం, అసలు రాజీ అంటేనే పార్టీని లిక్విడేషనిజం వైపు నడిపించటంగా ప్రచారం చేయటం వంటి పొరపాట్లు తరచు జరుగుతుంటాయని లెనిన్ విశదీకరించాడు.

ఈ పొరపాట్లకు మూలం ఆయా దేశాల్లోని విప్లవోద్యమంలో మొహరించిన శక్తుల, వర్గాల బలాబలాలు, సంకీర్ణ నిర్మాణాల తీరుతెన్నులు, నిర్దిష్ట సమయంలో నిర్దిష్ట వర్గాల నిర్దిష్ట డిమాండ్లు, ఈ డిమాండ్ల సాధన కోసం జరిగే పోరాటం విప్లవోద్యమానికి దగ్గరగా తీసుకెళ్తుందా వంటి కీలక విషయాల పట్ల సరైన గతితార్కిక అవగాహన లేకపోవటమే. బోల్షివిక్ తరహా విప్లవం సాధించాలన్న తపనలో అత్యుత్సాహం ప్రదర్శించే పార్టీలు ఒంటెత్తు పోకడలకు పాల్పడతాయని, ఎన్నికల రంగంలో సానుకూల పరిస్థితులు ఏర్పడేందుకు అవకాశం ఉన్నా అందులో భాగస్వాములై ఆ పరిస్థితులను కార్మికోద్యమ విప్లవ పంథా దిశగా నడిపించటానికి ప్రయత్నం చేయరన్నది లెనిన్ విమర్శ.

"చారిత్రక పరిణామక్రమంలో అందుబాటులోకి వచ్చే మధ్యంతర విప్లవ దశల్లో భాగస్వాములు కావటానికి జర్మన్ కమ్యూనిస్టులు అంగీకరించరని, ఏకాఏకిన అంతిమ లక్ష్యమైన కార్మిక వర్గ విప్లవం కోసం మాత్రమే పనిచేస్తార"న్న ఏంగెల్స్ విమర్శను లెనిన్ వలస దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలకు వర్తింప చేస్తాడు. కార్మికవర్గ విప్లవమే అంతిమ లక్ష్యం కదా అని కూర్చుంటే సదరు లక్ష్యసాధన దిశగా అడుగు ముందుకేయటానికి బదులు మరింత దూరమవుతారని హెచ్చరించాడు.

బూర్జువా పార్టీలతో రాజీ పోరాటం కమ్యూనిస్టు పార్టీలు అనుసరించాల్సిన ఎత్తుగడల సారమనీ గతితర్కమని లెనిన్ వాదిస్తాడు. విప్లవ సాధన లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో బోల్షివిక్ పార్టీ రాజీ పడ్డ సందర్భాలను ఆయన వివరిస్తాడు. ఇందులో భాగంగా 1905 విప్లవయత్నం విఫలమయ్యాక 1906 ఏప్రిల్‌లో జరిగిన రష్యన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ నాల్గో మహాసభలో మెన్షివిక్కు, బోల్షివిక్కు విభాగాలను విలీనం చేయటం ఓ ఉదాహరణగా మనకు కనిపిస్తుంది. ఈ విలీనాన్ని లెనిన్ వ్యక్తిగతంగా వ్యతిరేకించినా మహాసభ విలీనానికే మొగ్గు చూపు తుంది. ఈ మహాసభ గురించి జినోవీవ్ మరో సందర్భంలో మాట్లాడుతూ "దిగువనున్న ప్రజా శ్రేణుల నుండి వచ్చిన ఒత్తిడికి తలొగ్గి ఇరు పక్షాలు విలీనానికి అంగీకరించాయ"ని చెప్తాడు. తర్వాత జరిగిన డ్యూమా ఎన్నికల్లో పాల్గొనరాదన్న నిర్ణయాన్ని లెనిన్ వ్యతిరేకించినపటికీ మెజారిటీ కేంద్ర కమిటీ ఎన్నికల బహిష్కరణకే సుముఖంగా ఉంటుంది. చివరకు తొలి డ్యూమాలో కానిస్టిట్యూషనల్ డెమొక్రటిక్ పార్టీ ప్రధాన శక్తిగా అవతరించటంతో కేంద్ర కమిటీలోని మెన్షివిక్ బృందం తన పొరపాటును అంగీకరిస్తుంది. ఈ విధంగా ప్రతి రాజీ సందర్భం విప్లవ శక్తులకు పాఠం

నేర్చుకునే సందర్భమేనని లెనిన్ ఆచరణలో రుజువు చేశాడు. దీన్ని నేటికీ కొన్ని విప్లవ శ్రేణులు గుర్తించటం లేదు. కొన్ని సందర్భాల్లో ఇటువంటి రాజీ కారణంగా ఆరెస్డీఎల్పీ నష్టపోయి నా, మెజారిటీ సందర్భాల్లో పురోగమించింది, వర్గ శత్రువును బహీనం చేయగలిగింది. పీడిత వర్గాలకు నాయకత్వం వహించి జారిస్టు రష్యాను బోల్షివిక్ రష్యాగా మార్చింది. ఇది లెనిన్ ఎత్తుగడల సాఫల్యత. దాని వెనక ఉన్న నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనం. జర్మనీలో సోషల్ డెమొక్రాట్లు ఇతర ప్రజా తంత్ర శక్తులతో కలిసి పని చేయటానికి నిరాకరించిన సందర్భంలో నూ, ఇంగ్లాండ్‌లో లేబర్ పార్టీతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేయటానికి తిరస్కరించిన సందర్భంలోనూ లెనిన్ ఆ పార్టీలను ఘాటుగా విమర్శిస్తాడు. రష్యాలో బోల్షివి క్కులు తీవ్ర మైన ఊగిసలాటతో ఉన్న వారితో కూడా కలిసి పని చేశారని గుర్తు చేస్తాడు. జార్ నియంతృత్వానికి వ్యతిరేకంగా శైశవ దశలో ఉన్న రష్యా బూర్జువావర్గంతో రాజీ పడటానికి బోల్షివిక్ పార్టీ ఏనాడూ తిరస్కరించలేదన్న విషయాన్ని లెనిన్ ప్రస్తావిస్తాడు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఐక్య సంఘటన


సరైన పంథాలో ఐక్య సంఘటన ఎత్తుగడలు అమలు చేసిన అన్ని సందర్భాల్లోనూ, అన్ని దేశాల్లోనూ కమ్యూనిస్టు ఉద్యమం పురోగమించిందని చరిత్ర చెబుతోంది. 1920 దశకం నాటికి మొదలై 30 దశకం నాటికి తీవ్రరూపం దాల్చిన సామ్రాజ్యవాద సంక్షోభం నేపథ్యంలో ప్రపంచ మార్కెట్‌పై ఆధిపత్యం కొనసాగిం చేందుకు చేసిన ప్రయత్నాలే ఫాసిజానికి పునాదులు వేశాయి. ఫాసిజం ప్రమాదాన్ని ఎదుర్కోవటానికి అనుసరించాల్సిన ఎత్తు గడ విషయంలో కొమిన్‌టర్న్‌లో తీవ్ర భిన్నాభిప్రాయాలు తలె త్తాయి. ఈ పరిస్థితుల్లో లెనిన్ స్ఫూర్తితో క్లారా జెట్కిన్, టొగ్లి యాట్టి, రజనీపామే దత్, డిమిట్రోవ్ ఐక్యసంఘటన వ్యూహం, ఎత్తుగడ ప్రతిపాదను ముందుకు తెచ్చారు. క్లారా జెట్కిన్ మొదలు డిమిట్రోవ్ వరకు కొమిన్‌టర్న్ మహాసభలు చర్చించిన ఫాసిస్టు వ్యతిరేక ఎత్తుగడలను అధ్యయనం చేయటం ఈ విషయంపై మరింత స్పష్టతనిస్తుంది. కొమిన్‌టర్న్ ఆరో మహా సభల్లో జర్మన్ కమ్యూనిస్టు పార్టీ, జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ మధ్య ఐక్యసంఘటనకు అంగీకారం కుదిరి ఉంటే రాజ్యాం గ సంక్షోభం తలెత్తేది కాదు, జాతీయ సోషలిజం నినాదం పేరుతో హిట్లర్ జర్మనీలో అధికారానికి వచ్చేవాడు కాదు అన్నది వాస్తవం. హిట్లర్ అధికారానికి రావటానికి ముందు ఈ రెండు పార్టీలకు వచ్చిన ఓట్లు సీట్లు కలిపి చూసుకుంటే నాజీ పార్టీకంటే ఎక్కువ ఉన్నాయి. జర్మన్ అనుభవా తర్వాత మిగిలియన యూరోపియన్ దేశాలు ప్రధానంగా ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్లు ఐక్య సంఘటన ఎత్తుగడలను అమలు చేశాయి.

చైనా, వియత్నాం విముక్తి పోరాటాలు ఐక్య సంఘటన ఎత్తుగడల ప్రాధాన్యత గురించి మరిన్ని మలువైన పాఠాలు నేర్పుతున్నాయి. వివిధ దేశాల ప్రత్యేకతలు, ఆయా దేశాల్లో కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీల ఆవిర్భావంలో ముందు వెనకలు, వివిధ దేశాలపై వలసాధిపత్యంలోని వ్యత్యాసాలు, వలస దేశాల్లో రాజ్యాంగ వ్యవస్థల నిర్మాణాలు పరిగణనలోకి తీసుకోకుండా సరళరేఖ వంటి ఎత్తుగడలు సాధ్యమని చెప్పటం ఇక్కడ నా ఉద్దేశ్యం కాదు. భారతదేశంలో స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా ఉనికిలోకి వచ్చిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకుల్లో అత్యధి కులు తర్వాతి కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాతలయ్యారన్న విషయాన్ని మనం మర్చిపోకూడదు.

పెట్టుబడిదారీ వ్యవస్థ స్వరూప స్వభావాలు లెనిన్ కాలం నాటికీ నేటికీ చాలా మారాయి. సామ్రాజ్యవాదం లెనిన్ కాలంతో పోలిస్తే ఆధునిక దోపిడీ రూపాలను ముందుకు తెచ్చింది. అదే విధంగా 1920 దశకంలో ఫాసిస్టు శక్తులు రాజ్యాంగ వ్యవస్థల పై యుద్ధం ప్రకటించి అధికారానికి వస్తే నేటి నయా ఫాసిస్టు శక్తులు తమ అధికార సోపానాలకు ఉదారవాద రాజ్యాంగాలే ఆలంబనగా మారుతున్నాయి. ఉదాహరణకు భారతదేశంలో ఆరెస్సెస్ రాజ్యాంగ బద్ధంగానే దేశాన్ని హిందూ రాష్ట్రంగా ప్రకటించే లక్ష్యంతో పనిచేస్తోంది. మరికొన్ని దేశాల్లో పాలక వర్గాలు నగ్నంగా నిరంకుశ విధానాలకు పాల్పడుతుంటే రాజ్యంగ వ్యవస్థలు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ అడపాదడపా అవరోధాలు కల్పిస్తున్నాయి. నేటి ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత నాజూకుగా, పారదర్శకంగా కనిపిస్తుందో అంత గాఢమైన దొంతర నడుమ తన దోపిడీని కొనసాగిస్తూ ఉంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా దోపిడీ చట్టాలను చట్రా లను ఆధునీకరిస్తూ వస్తోంది. లెనిన్ నాటికి ప్రపంచ దేశాలపై భౌతికాధిపత్యం కోసం బరితెగించిన ద్రవ్య పెట్టుబడి నేడు ప్రపంచీకరణ దశలో ప్రవేశించి దేశాన్నింటిలోనూ తరతమ స్థాయిల్లో ఉత్పత్తి శక్తుల అభివృద్ధినీ ఉత్పత్తి సంబం ధాలనూ నియంత్రిస్తోంది. మరోవైపున మితవాద నయా ఫాసిస్టు శక్తులు పార్లమెంటరీ, పార్లమెంటేతర మార్గాల్లో ఆయాదేశాల సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక జీవనంపై తమ ఆధిపత్యాన్ని మరింత సంఘటితం చేసుకుంటున్నాయి. భారతదేశంలో జరుగుతున్న పరిణామాలు కూడా ఈ కోవకు చెందినవే.


ఫాసిజం లక్షణాలు వ్యక్తీకరణలు వేర్వేరు దేశాల్లో వేర్వేరు రూపాల్లో కనిపిస్తాయి. అమలవుతాయి. ఆయా దేశాల సాంస్కృతిక వారసత్వం, సామాజిక నిర్మాణాలు, మతాచారాలు, సాంప్రదాయాలు కూడా ఫాసిజానికి ప్రత్యేక లక్షణాలు అద్దటంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ పరిస్థితుల్లో ప్రపంచం ముందు, భారతదేశంలోనూ ముందుకొస్తున్న ఫాసిస్టు శక్తుల పురోగమనాన్ని అడ్డుకునేందుకు కావాల్సిన ఐక్యసంఘటన ఎత్తుగడల విప్లవోద్యమాలను నడిపించటమే లెనిన్ 150వ జయంతి సందర్భంగా మనం అర్పించే నివాళి. ❑


# కొత్త పుస్తకాలు స్వీకారం




వెల : 395
కాపీలకు..
దేవులపల్లి
అమర్ గారిని
98480 48536
సంప్రదించండి


వెల : 350
కాపీలకు..
మందలపర్తి
కిషోర్ గారిని
81796 91822
సంప్రదించండి.




వెల : 200
కాపీలకు..
ఎంఎఫ్ గోపీనాథ్
గారిని
79935 84903
సంప్రదించండి.

వెల : 250
కాపీలకు..
శిరంశెట్టి
కాంతారావు
గారిని
98498 90322
సంప్రదించండి.







మోడీ గిఫ్ట్

మోడీ పోటు




మోడీ ధర్మం

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 2 - Issue No : 5 February 2024

# కొత్త పుస్తకాలు స్వీకారం




వెల : 100

ప్రతులకు..
డాక్టర్ రమేష్
ఫోన్ : 93971 14495




వెల : 100




ప్రతులకు..
డాక్టర్ రమేష్
ఫోన్ : 93971 14495

వెల : 100




అమూల్యం

ప్రతులకు..
డా॥ సి.స్టాలిన్
98493 48162

if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatal Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.